www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
06-01-2025

సంపుటి : 01 । సంచిక : 245 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

## కాంగ్రెస్ నేతలను అడ్డుకోండి..
# నిలదీయండి

**రైతాంగాన్ని నిలువునా మోసం చేసిన కాంగ్రెస్**



- తెలంగాణ చరిత్రలో రేవంత్ రైతుద్రోహిగా మిగిలిపోతాడు
- హార్టికల్చర్ రైతులకు రైతు భరోసా ఇస్తారా.. ఇవ్వరా.. అనే దానిపై క్లారిటీ లేదు
- ఉద్యోగులకు భూమితో సంబంధం లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు
- నేడు రైతులకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** రైతు భరోసా ఎందుకు ఇవ్వరో రేవంత్ రెడ్డి చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతు భరోసాపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో రైతులకు మద్దతుగా నిరసనలు తెలుపుతామని తెలిపారు. హార్టికల్చర్ రైతులకు రైతు భరోసా ఇస్తారా ఇవ్వరా అనే దానిపై క్లారిటీ లేదని అన్నారు. ఉద్యోగులకు భూమితో సంబంధం లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గండం మిగతా2లో...



## హైదరాబాద్ నుమాయిష్‌కు పోటెత్తిన సందర్శకులు

- బయట మార్కెట్లో దొరకని విభిన్నమైన వస్తువులు ఇక్కడ లభ్యం
- నగరం నలు మూలల నుంచి భారీగా తరలివస్తున్న జనం
- సందర్శకులతో రద్దీగా చుట్టుపక్కల రోడ్లు

2





# ఏడాదిలో 55,143 ఉద్యోగ నియామకాలు

## ఇది దేశంలోనే రికార్డు

- దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలబడింది
- గతంలో ఎన్నడూ 563 గ్రూప్ 1 ఉద్యోగాలు ఇవ్వలేదు
- 14 ఏళ్లుగా వీటి నియామకాలు చేపట్టలేదు
- ఇన్ని ఉద్యోగాలు ఇవ్వడం ఇష్టం లేక అడ్డుకునే కుట్ర చేశారు
- రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- సివిల్స్ ఇంటర్వ్యూకు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు ఆర్థిక సాయం
- ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందజేత
- సివిల్స్‌లో విజయం సాధించి తెలంగాణకే రావాలని ఆకాంక్ష

**వెనుకబడిన రాష్ట్రమైన బిహార్ నుంచి అత్యధికంగా సివిల్ సర్వీసెస్ అధికారులు వస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్లే ఎక్కువ మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బిహార్‌ను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు చెప్పారు. దీన్ని ఆర్థిక సాయంగా కాకుండా ప్రోత్సాహకంగా భావించాలన్నారు.**

**విశ్వంభర, హైదరాబాద్:** ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసమే తెలంగాణ సాధించుకున్నాం, గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగులు ఎంతో నష్టపోయారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సివిల్స్ లో మన రాష్ట్ర అభ్యర్థులు ఎక్కువ మంది రాణించాలని మా ఉద్దేశం, బీహార్ నుంచి అత్యధికంగా సివిల్స్ లో రాణిస్తున్నారు. అలాంటి ప్రత్యేక శ్రద్ధ మన రాష్ట్రంలో కూడా ఉండాలని, వారికి ఆర్థికంగా సహకారం అందించాలని మిగతా2లో...

## స్వదేశానికి 95 మంది
# భారతీయ మత్స్యకారులు

- 90 మంది బంగ్లాదేశీ జాలరులను బంగ్లాకు అప్పగించిన భారత్
- మానవతా కోణంతో, జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని పరస్పరం అప్పగింత ప్రక్రియ
- ఇరుదేశాలు అంగీకారం



2

## ఆరోపణలు కాదు..
# ఆధారాలు చూపించండి

- కేంద్రమంత్రికి సిద్ధరామయ్య సవాల్
- రుజువులు లేకుండా అసంబద్ధమైన ఆరోపణలు చేస్తుంటే చూస్తూ ఊరుకోమని ఆగ్రహం



2



విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

## ముగ్గురు ఉపాధ్యాయులు
# అరెస్ట్

ఫోక్సో చట్టం కింద అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

2

## నా ఉన్నతికి తెలుగు
# వెలుగే కారణం

- తెలుగు భాషకు మనమంతా వారసులం
- దానిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపైనే ఉంది
- మాతృభాషలో మాట్లాడడం అందరికీ అలవాటుగా మారాలి
- అంతర్జాతీయ తెలుగు సమాఖ్య మహాసభల్లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యలు

2





ట్రాఫిక్ కష్టాలకు చెక్..

## నేడే ఆరాంఘర్- జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభం

**4.08 కిలోమీటర్ల పొడవునా రూ.800 కోట్లతో పైవంతెనను నిర్మించిన బల్దియా**

**విశ్వంభర, హైదరాబాద్:** ఆరాంఘర్-జూపార్కు పైవంతెనను ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. సోమవారం సాయంత్రం 4గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగతా2లో...

## 26 రోజులుగా సమ్మె చేస్తున్నా..ప్రభుత్వం
# స్పందించడం లేదు



- సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల సీఎం హామీ ఇచ్చారు
- ఇప్పుడేమో కేంద్ర ప్రభుత్వ అంశమని మాటమారుస్తున్నారు
- సీఎం, మంత్రులు వారితో చర్చించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు
- వారి పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుంది
- ఎమ్మెల్సీ కవిత

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 108 | ₹ 130 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 189 | ₹ 215 |

# హైడ్రా దూకుడు

**అయ్యప్ప సొసైటీలో 5 అంతస్తుల భవనం కూల్చివేత**

- గత ఏడాది ఈ భవన యజమానులకు జీహెచ్ఎంసీ నోటీసులు
- హైకోర్టు సైతం అక్రమ నిర్మాణమని తేల్చింది
- ఈ క్రమంలో ఆదివారం కూల్చివేత



**విశ్వంభర, హైదరాబాద్:** అక్రమ నిర్మాణాలపై హైడ్రా దూకుడు కొనసాగుతోంది. నగరంలోని మాదాపూర్‌లో ఆక్రమణలను కూల్చివేస్తోంది. అయ్యప్ప సొసైటీలోని 100 ఫీట్ రోడ్డులో ప్రధాన రహదారికి ఆనుకొని అక్రమంగా నిర్మించిన 5 అంతస్తుల భవనాన్ని బుల్డోజర్ల సాయంతో హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది కూల్చివేస్తున్నారు. గత ఏడాది ఈ భవన యజమానులకు జీహెచ్ఎంసీ నోటీసులు ఇచ్చింది. ఆ తర్వాత హైకోర్టు సైతం మిగతా2లో...



## ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..
# హామీలు అమలు

- ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారు
- ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి.. గత ప్రభుత్వం మోసం చేసింది
- రూ.2 లక్షలలోపు ఉన్న రైతు రుణాలను ఒకే విడతలో మాఫీ చేశాం
- ఈ నెల 26 నుంచి రైతు భరోసా నిధులు పంపిణీ చేస్తాం
- సాగు చేస్తున్న భూమికే ఇస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, మొగిలిచర్ల:** అన్ని వర్గాల ప్రజలు పోరాడితేనే తెలంగాణ వచ్చిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఎంతో కష్టపడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్లపాటు మోసపోయామన్నారు. వరంగల్ జిల్లా మొగిలిచర్లలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి.. గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ మిగతా2లో...

## కాంగ్రెస్ నేతలను అడ్డుకోండి..
# నిలదీయండి

**మొదటిపేజీ తరువాయి**

దాటేందుకు రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విమర్శించారు. రైతుబంధు పథకం ఉండాలా వద్దా అనేది రైతులు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకోండి, నిలదీయండి అని పిలుపునిచ్చారు. నమ్మి ఓటేసిన పాపానికి పచ్చి మోసానికి పాల్పడ్డ ఈ కాంగ్రెస్‌ను రైతన్నలు పాతరేస్తారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ చేసిన దానికి మోసం అనే పదం చిన్నదైపోతది. దగా, నయవంచన పదాలు కూడా సరిపోవని విమర్శించారు. కాంగ్రెస్ రైతాంగానికి చేసిన ఈ ద్రోహం.. తెలంగాణ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. కపట నాటకాలకు, నోరు తెరిస్తే అబద్ధాలకు, బూటకపు వాగ్దానాలకు కేరాఫ్ కాంగ్రెస్/రేవంత్ అని రైతాంగానికి అర్థమైపోయిందని అన్నారు. తెలంగాణ చరిత్రలో రేవంత్ రైతుద్రోహిగా మిగిలిపోతాడని చెప్పారు.

డిక్లరేషన్ కాదు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చే గ్యారెంటీ అని రాహుల్ గాంధీ అన్నారని కేటీఆర్ గుర్తుచేశారు. రైతు భరోసా 12 వేలకు కుదించి సంబరాలు చేయాలని కాంగ్రెస్ అంటోంది.. కానీ ఎందుకు సంబరాలు చేయాలి.. రైతన్నలకు 15000 ఇస్తామని చెప్పి కోతలు పెట్టినందుకా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం మాయమాటలు చెప్పి మోసం చేసినందుకు పాలాభిషేకాలు చేయాలా అని నిలదీశారు. కాంగ్రెస్ అబద్ధాలకు డిక్షనరీలో కొత్త పదాలు కనిపెట్టాలని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ, రైతుబంధుకు కేసీఆర్ లక్ష కోట్లు ఖర్చు పెట్టారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ రైతుబంధుగా నిలిచారు కానీ.. రేవంత్ రెడ్డి రాబందుగా మిగులుతారని విమర్శించారు. రాహుల్ గాంధీకి తెలంగాణకు వచ్చే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో డిసెంబర్ 3కు ముందు తీసుకుంటే 10 వేలు, తరువాత 15 వేలు రైతు భరోసా అన్న కాంగ్రెస్ నేతల మాటలు ఎక్కడ పోయాయని నిలదీశారు. గతంలో ఇచ్చిన పదివేలనే బిచ్చం అన్న రేవంత్.. మరి నువ్వు పెంచిన వెయ్యి రూపాయలు ఏంటి? ముష్టి వేస్తున్నావా అని మండిపడ్డారు.

## హైదరాబాద్ నుమాయిష్‌కు
# పోటెత్తిన సందర్శకులు

**విశ్వంభర, హైదరాబాద్:** నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రారంభమైన అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)కు ఆదివారం సందర్శకులు భారీగా తరలివచ్చారు. వందల సంఖ్యలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో తమకు అవసరమైన వస్తువుల్ని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. కుటుంబ సమేతంగా నగరం నలు మూలల నుంచి ప్రజలు ఎగ్జిబిషన్ చూసేందుకు వస్తున్నారు. సాయంత్రం వేళ ఎగ్జిబిషన్ మైదానం చుట్టుపక్కల ప్రాంతాల్లో రోడ్లన్నీ సందర్శకులతో రద్దీగా కనిపించాయి.ఏటా కొత్త ఏడాది ప్రారంభంలో నగరవాసులను పలకరించే నుమాయిష్ రెండు రోజుల కిందట మొదలైంది. బయట మార్కెట్లో అంత సులువుగా దొరకని ఎన్నో భిన్న, విభిన్నమైన వస్తువులు ఇక్కడ లభ్యం కావడంతో నగర ప్రజలు తమకి ఇష్టమైన వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రోజువారీ వినియోగించే వస్తువులతో పాటు గృహాలంకరణ సామాగ్రి, కాస్మోటిక్స్, ఫుట్ వేర్, ఆభరణాలు, వంట సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫర్నిచర్, దుస్తులు, బ్యాగులు, కలంకారి వస్తువులు, హస్తకళలు, నేత చీరలు, స్టేషనరీతో పాటు వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు.

## విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన..

**విశ్వంభర, నిజాంసాగర్:** విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నలుగురు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేసిన ఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కొంతకాలంగా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. వారం రోజుల క్రితం విద్యార్థినుల ఫిర్యాదు మేరకు ఓ ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు చేశారు. అనంతరం కర్ణాటకకు బదిలీ చేశారు. తాజాగా మరో ముగ్గురు ఉపాధ్యాయులు వేధిస్తున్నారని ఫిర్యాదు రావడంతో పోలీసులు స్పందించారు. ముగ్గురు ఉపాధ్యాయులపై పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు నలుగురు ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సుభాష్, వేణుగోపాల్, అఫ్జోస్ కుమార్‌లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

## 26 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం
# స్పందించడం లేదు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా 19,600 సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు గత 26 రోజులుగా సమ్మె చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కుటుంబాలతో సహా రోడ్లపై నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులతో ముఖ్యమంత్రి, మంత్రులు కనీసం చర్చించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఇప్పుడు మాత్రం అది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశమని, నిరసనలు కొనసాగిస్తే, సమస్య తీవ్రమవుతుందని బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రేవంత్ వైఖరిని ఆమె తీవ్రంగా ఖండించారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

## ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..
# హామీలు అమలు చేస్తున్నాం

**మొదటిపేజీ తరువాయి**

అప్పుల రాష్ట్రంగా మార్చారని మండిపడ్డారు.''ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. రూ.2 లక్షలలోపు ఉన్న రైతు రుణాలను ఒకే విడతలో మాఫీ చేశాం. 3 నెలల్లోనే రైతులు ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేశాం. సాంకేతిక కారణాలతో ఎవరికైనా వర్తించకపోతే వారికి కూడా రుణమాఫీ చేస్తాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేదు. కానీ, ఈ ప్రభుత్వం తొలి ఏడాదే 56 వేల ఉద్యోగాలు ఇచ్చింది. రైతు భరోసాపై ఎంతో దుష్ప్రచారం చేశారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా నిధులు పంపిణీ చేస్తాం. సాగు చేస్తున్న భూమికే రైతు భరోసా ఇస్తాం'' అని భట్టి విక్రమార్క తెలిపారు.



## స్వదేశానికి 95 మంది
# భారతీయ మత్స్యకారులు

**ఢిల్లీ:** షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం, బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడుల వంటి పరిణామాలతో ఇరుదేశాల మధ్య సంబంధాలు ప్రభావితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. రెండు దేశాలూ పరస్పరం మత్స్యకారుల అప్పగింత ప్రక్రియ నిర్వహించాయి. ఆయా ఘటనల్లో బంగ్లా అధికారుల చేతిలో అరెస్టయిన 95 మంది భారతీయ మత్స్యకారులు స్వదేశానికి చేరుకోగా.. భారత్ సైతం 90 మంది బంగ్లాదేశీ జాలరులను ఆ దేశానికి అప్పగించింది. ''ఇటీవలి నెలల్లో పలువురు భారతీయ మత్స్యకారులు అనుకోకుండా అంతర్జాతీయ సముద్ర సరిహద్దు దాటి బంగ్లా జలాల్లోకి ప్రవేశించగా.. వారిని అక్కడి అధికారులు అరెస్టు చేశారు. భారత్ సైతం ఇటువంటి పరిస్థితుల్లోనే కొంతమంది బంగ్లాదేశీయులను అరెస్టు చేసింది. అయితే, మానవతా కోణంతోపాటు మత్స్యకార వర్గాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని జాలరులు, వారి పడవలను విడిచిపెట్టేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి'' అని భారత విదేశాంగశాఖ ఇటీవల వెల్లడించింది. ఇరుదేశాలూ జనవరి 2న తమ తమ కోస్ట్‌గార్డ్‌లకు సంబంధిత మత్స్యకారులను అప్పగించాయి.

షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం, బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడుల వంటి పరిణామాలతో ఇరుదేశాల మధ్య సంబంధాలు ప్రభావితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. రెండు దేశాలూ పరస్పరం మత్స్యకారుల అప్పగింత ప్రక్రియ నిర్వహించాయి. ఆయా ఘటనల్లో బంగ్లా అధికారుల చేతిలో అరెస్టయిన 95 మంది భారతీయ మత్స్యకారులు స్వదేశానికి చేరుకోగా.. భారత్ సైతం 90 మంది బంగ్లాదేశీ జాలరులను ఆ దేశానికి అప్పగించింది.
''ఇటీవలి నెలల్లో పలువురు భారతీయ మత్స్యకారులు అనుకోకుండా అంతర్జాతీయ సముద్ర సరిహద్దు దాటి బంగ్లా జలాల్లోకి ప్రవేశించగా.. వారిని అక్కడి అధికారులు అరెస్టు చేశారు. భారత్ సైతం ఇటువంటి పరిస్థితుల్లోనే కొంతమంది బంగ్లాదేశీయులను అరెస్టు చేసింది. అయితే, మానవతా కోణంతోపాటు మత్స్యకార వర్గాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని జాలరులు, వారి పడవలను



విడిచిపెట్టేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి'' అని భారత విదేశాంగశాఖ ఇటీవల వెల్లడించింది. ఇరుదే-
శాలూ జనవరి 2న తమ తమ కోస్ట్‌గార్డ్‌లకు సంబంధిత మత్స్యకారులను అప్పగించాయి.

# ఆరోపణలు కాదు.. ఆధారాలు చూపించండి

**బెంగళూరు:** కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామిపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వంలోని మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని కుమారస్వామి అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన చేస్తున్న ఆరోపణలు నిజమైతే తగిన ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. తగిన రుజువులు లేకుండా తమపై అసంబద్ధమైన ఆరోపణలు చేస్తుంటే చూస్తూ ఊరుకోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మా మంత్రులు 60 శాతం కమీషన్ తీసుకొని..అవినీతికి పాల్పడుతున్నారని కుమారస్వామి ఆరోపిస్తున్నారు. కేవలం ఆరోపణలు చేయడమే ప్రతిపక్షాల పని కాదు. వాటిని ఆయన నిరూపించే వరకు వదిలిపెట్టము'' అని ముఖ్యమంత్రి అన్నారు. బస్సు ఛార్జీల



పెంపుపై సీఎం మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలు, డీజిల్ ధరల పెరుగుదల, కొత్త బస్సుల కొనుగోలు వ్యయం, ద్రవ్యోల్బణం వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు, కుమారస్వామి సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో బస్సు ఛార్జీలు పెంచలేదా అని ప్రశ్నించారు. ఇటీవల మైసూరులో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు మంత్రులు కాంట్రాక్టర్ల వద్ద కమిషన్‌లు తీసుకుంటూ దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పీడబ్ల్యూడీ, నీటిపారుదల శాఖల్లో దోపిడి మరింత హద్దులు దాటుతోందని అన్నారు. పని కావాలంటే ప్రతి ప్రభుత్వ శాఖలో కొంత మొత్తంలో ఫిక్స్‌డ్ అమౌంట్ చెల్లించాల్సి ఉందని..అందువల్లే కాంట్రాక్టర్లు, చిన్న స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఏడాదిలో 55,143 ఉద్యోగ నియామకాలు



**మొదటిపేజీ తరువాయి**

రాజీవ్ సివిల్స్ అభయహస్తం ద్వారా రూ.లక్ష సాయం అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ ప్రజాభవన్ లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఇది ఆర్థిక సాయం కాదు... ప్రభుత్వం వారికి అందిస్తున్న ప్రోత్సాహంగా భావించాలి. కష్టంతో కమిట్మెంట్ ఉంటేనే విజయం వరిస్తుంది.ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతీ ఒక్కరూ సివిల్స్ లో సెలెక్ట్ అవ్వాలని ఆకాంక్షిస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి ఏడాదిలోనే 55,143 ఉద్యోగ నియామకాలు చేపట్టాం. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచింది.14 ఏళ్లుగా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేదు. కానీ మేం అడ్డంకులను, కుట్రలను అధిగమించి 563 గ్రూప్ 1 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించాం. మార్చి 31 లోగా 563 గ్రూప్ 1 ఉద్యోగాల నియామకాలను పూర్తిచేయబోతున్నాం-.ఈ ప్రభుత్వం ఆలోచించేది యువత భవిష్యత్ కోసమే జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. సివిల్స్ కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులను అన్నిరకాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది దేశంలో అత్యధికంగా మన రాష్ట్రం నుంచి సివిల్స్ లో ఎంపికవుతారని గర్వంగా చెప్పుకునే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సింగరేణి సీఎండీ బలరాం, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సివిల్స్ మెయిన్స్ ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ నుంచి సివిల్స్ అభ్యర్థులకు సాయం చేస్తున్నట్లు తెలిపారు. వీరంతా సివిల్స్‌లో విజయం సాధించి తెలంగాణకే రావాలని ఆకాంక్షించారు. ''తెలంగాణ అధికారులు కేంద్రంలో ఉన్నా రాష్ట్రం కోసం కృషి చేయాలి. మా ప్రభుత్వం వచ్చాక ఏడాదిలో 55,143 ఉద్యోగాలు ఇచ్చాం. ఇది దేశంలోనే రికార్డు. పదేళ్లలో పేరుకుపోయిన ఖాళీలను భర్తీ చేస్తూ ఇప్పుడు ఉద్యోగాలు ఇస్తున్నాం. దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలబడింది. గతంలో ఎన్నడూ 563 గ్రూప్ 1 ఉద్యోగాలు ఇవ్వలేదు. 14 ఏళ్లుగా వీటి నియామకాలు చేపట్టలేదు. ఇన్ని ఉద్యోగాలు ఇవ్వడం ఇష్టం లేక అడ్డుకునే కుట్ర చేశారు. గ్రూప్ 1పై కుట్రలన్నీ ఛేదించి పరీక్షలు నిర్వహించాం. ఈ విషయంలో కోర్టులు ప్రభుత్వానికి అండగా నిలిచాయి. మార్చి 31 లోపు ఈ నియామకాలు పూర్తి చేస్తాం.'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# పెళ్లికాని జంటలకు ఇకపై నో రూమ్

### ఓయో కొత్త చెక్-ఇన్ పాలసీ

**ముంబయి:** ప్రముఖ హోటల్ అగ్రిగేటర్ ఓయో కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త చెక్-ఇన్ పాలసీ తీసుకొచ్చింది. ఈ ఏడాదిలో అమల్లోకి వచ్చే కొత్త మార్గదర్శకాలు పరిచయం చేసింది. అందులో భాగంగా ఇకపై పెళ్లికాని జంటలు రూమ్ బుక్ చేసుకునేందుకు వీలుండదు. ఈ నిబంధనలు తొలుత మేరఠ్ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కంపెనీ ఆదివారం వెల్లడించింది.

ఓయో సవరించిన పాలసీ ప్రకారం.. ఇకపై పెళ్లికాని జంటలకు రూమ్‌లు ఇవ్వరు. కొత్త చెక్-ఇన్ పాలసీ ఆధారంగా.. ఇకపై ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లోనైనా రూమ్ బుకింగ్ సమయంలో అన్ని జంటలు పెళ్లి చెల్లుబాటు అయ్యే రుజువును సమర్పించాల్సి ఉంటుంది. అంటే కచ్చితంగా పెళ్లిని నిర్ధరించే ఐడీ ప్రూఫ్ చూపించాల్సి ఉంటుంది. ఏదైనా సందర్భంలో ఇలాంటి బుకింగ్‌లను తిరస్కరించే విచక్షణాధికారాన్ని ఓయో తన భాగస్వామి హోటళ్లకు అందించింది. మేరఠ్‌లోని తన భాగస్వామ్య హోటళ్లలో తక్షణమే దీన్ని అమల్లోకి తీసుకురావాలని నిర్దేశించింది. గ్రౌండ్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా కంపెనీ దీన్ని మరిన్ని నగరాలకు విస్తరించే అవకాశం ఉందని సంబంధిత వ్యక్తులు తెలిపారు.




ఓయో సురక్షితమైన, బాధ్యతాయుతమైన ఆతిథ్య పద్ధతులను అమలు చేసేందుకు కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఓయో నార్త్ ఇండియా రీజియన్ హెడ్ పవాస్ శర్మ అన్నారు. కుటుంబాలు, విద్యార్థులు, ఒంటరిగా ప్రయాణం చేసేవారికి సురక్షితమైన వసతులు అందించే బ్రాండ్‌గా నిలవాలని ఓయో భావిస్తోంది. అందులో భాగంగానే తాజాగా కొత్త చెక్ -ఇన్ పాలసీ తీసుకొచ్చింది. కస్టమర్ల విశ్వాసం పెరిగి, బుకింగ్లు పెరిగేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందన్నారు. అయితే వ్యాలిడ్ ప్రూఫ్‌గా ఏయే పత్రాలు చూపించాలనేదానిపై స్పష్టత ఇవ్వలేదు.

### ట్రాఫిక్ కష్టాలకు చెక్..
## నేడే ఆరాంఘర్- జూపార్క్
# ఫ్లైఓవర్ ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్నారు. నగరం నుంచి బెంగళూరు హైవేకు ఉన్న ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు 4.08 కిలోమీటర్ల పొడవునా దాదాపు రూ.800 కోట్లతో పైవంతెనను బల్దియా నిర్మించింది. హైదరాబాద్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో వాహనదారులు తీవ్రఇబ్బంది పడటమే కాకుండా కోట్లాది రూపాయల ఇంధనం, విలువైన సమయం వృథా అవుతోంది. నగరంలోని ముఖ్యప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు జీహెచ్ఎంసీ వ్యూహాత్మకరహదారుల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా పైవంతెనలు, ఆర్వోబీలను నిర్మిస్తూ ట్రాఫిక్ ఇక్కట్లను దూరంచేస్తోంది. ఎస్ఆర్‌డీపీలోలో భాగంగా సుమారు రూ.800 కోట్లతో చేపట్టిన ఆరాంఘర్-జూపార్క్ పైవంతెన పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తర్వాత నగరంలో రెండో అతిపెద్ద వంతెన.

## నా ఉన్నతికి తెలుగు
# వెలుగే కారణం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు భాషకు మనమంతా వారసులమని.. దానిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపైనే ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మన మాతృభాషను మనం ప్రేమించకపోతే ఇంకెవరు ప్రేమిస్తారని ఆయన ప్రశ్నించారు. మాతృభాషలో మాట్లాడడం అందరికీ అలవాటుగా మారాలన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు సమాఖ్య మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. తన ఉన్నతికి తెలుగు వెలుగే కారణమన్నారు. దేశంలో గొప్ప పదవుల్లో ఉన్నవారంతా మాతృభాషలో చదువుకున్నవారేనని చెప్పారు. ''ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఈ సభలను అమెరికాలో ప్రారంభించారు. ఆనాటి సమావేశంలో నేను కూడా పాల్గొన్నాను. దేశ విదేశాల్లో తెలుగువారిని ఒకే వేదికపై తీసుకురావడం హర్షణీయం. కళారూపాలు సామాజిక పునాదులుగా నిలుస్తాయి. కళలు ప్రజలను కార్యోన్ముఖులను చేస్తాయి. వాటిని ముందు తరాలకు అందజేయాల్సిన బాధ్యత మనదే. ప్రతి భాషకు ఓ ప్రత్యేకత ఉంది. తెలుగు మరింత విలక్షణమైంది. అలంకారాలు తెలుగు భాషకు ఎంతో అందాన్ని తెచ్చాయి. జీవిత అర్థాన్ని తెలిపే ఎన్నో సామెతలు తెలుగులో ఉన్నాయి. మాతృభాష.. మన సంస్కృతిని తనలో ఇముడ్చుకుంది. 2012లో ప్రపంచంలో రెండో ఉత్తమ లిపిగా తెలుగు నిలిచింది. మనదేశంలో 450 భాషలు ఉన్నాయి. ఇంగ్లీష్‌పై వ్యామోహంతో కొన్ని భాషలు అంతరించిపోతున్నాయి. భాష ఆగిపోతే.. శ్వాస ఆగిపోయినట్లే. మాతృభాష మర్చిపోతే.. మాతృబంధం విడిచిపోయినట్టే. మన వేషభాషల పట్ల మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. ప్రాథమిక విద్యను తెలుగు భాషలో అందించాలి'' అని వెంకయ్యనాయుడు అన్నారు.

# హైడ్రా దూకుడు..

**మొదటిపేజీ తరువాయి**

అక్రమ నిర్మాణమని తేల్చింది. ఈ నేపథ్యంలో శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ భవనాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో ఆదివారం కూల్చివేత చేపట్టారు. భవనం మెయిన్ రోడ్డు పక్కనే ఉండటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

# హిమాయత్‌నగర్ మినర్వా హోటల్‌లో భారీ అగ్ని ప్రమాదం

**విశ్వంభర, హైదరాబాద్:** హిమాయత్‌నగర్‌లోని మినర్వా హోటల్‌లో ఆదివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కిచెన్‌లో భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. దీంతో హోటల్‌లోని సిబ్బంది, కస్టమర్లు బయటకు పరుగులు తీశారు. దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పివేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



# ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

- సావిత్రి బాయి స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి
- స్త్రీ విద్యతోనే సమున్నత సమాజ స్థాపన
- ఐపీఎస్ అధికారి శిరీష రాఘవేంద్ర



**విశ్వంభర, ఎల్బీ నగర్:** భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు, స్త్రీ వాది అయిన సావిత్రి బాయి పూలే 194 వ జయంతి కార్యక్రమం మాభూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో చింతలకుంట లోని వాసవి శ్రీ నిలయంలో జరిగింది. గతంలో షి టీమ్స్ లో పనిచేసిన ఐ పీ యస్ ఆఫీసర్ శిరీష రాఘవేంద్ర ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి గేటెడ్ కమ్యూనిటీల్లో ఇటువంటి ఆదర్శవంతమైన కార్యక్రమాలు జరపడం అభినందనీయమనీ, సావిత్రి బాయి స్ఫూర్తి ఎప్పటికీ మహిళల్లో ఉండాలని, అవసరమైన వారు ఎటువంటి భయం లేకుండా షీ టీమ్స్ మరియు భరోసా సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ముఖ్య వక్తగా విచ్చేసిన సావిత్రి బాయి పూలే ట్రస్ట్ ఛైర్మన్ గూడూరు సీతా మహాలక్ష్మి తాము ఆ మహినీయురాలి ఆశయాల సాధనకోసమే ఎంతోమంది ఆడపిల్లల చదువుకోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఎల్.బి.నగర్ జిల్లా కోర్టు జడ్జి నిష్క పాత్రుడు మరియు సోషల్ వర్కర్ ముకుంద మాల ప్రత్యేక అతిధులుగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి వాసవి శ్రీ నిలయ మహిళలు అధిక సంఖ్యలో హాజరై సావిత్రీ బాయి కి ఘనమైన నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం సావిత్రి బాయి పూలే జయంతిని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినందున ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఆహ్వానించి కార్యక్రమంలో సత్కరించడంజరిగింది. సావిత్రి బాయి పూలే జీవిత నేపథ్యంతో చిన్నారులు చేసిన ప్రదర్శన అందరినీ అలరించింది. మాభూమి మహిళా సభ్యులు శరణ్య,అలివేలు మంగ, వనజా సుమన్, భవాని, చంద్రకళ, సౌజన్య, ఇతర కమిటీ సభ్యులు పాల్గొని ప్రసంగించారు. మాభూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక కమిటీ సమన్వయ కర్త గొర్రెపాటి నర్సింహ ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఉదయశంకర్, ఇంజమూరి రఘునందన్, యనాల నాగిరెడ్డి, విజయకుమార్, కేశవ రావు, ఎం వీ ఎస్ మూర్తి, ప్రకాష్ రావు పాల్గొన్నారు.

వేడుకగా ఆర్యవైశ్య మహాసభ

# ప్రమాణ స్వీకార మహోత్సవం



**విశ్వంభర, ఎల్బీనగర్:** రంగారెడ్డి జిల్లా ఆర్య వైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం చంపాపేట్ లోని సామ సరస్వతి గార్డెన్ లో వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభ ప్రారంభకులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, సభాధ్యక్షులు రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్ నగర్ శాసనసభ్యులు శంకర్, రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ దయానంద గుప్తా, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త, జైల్స్ రిటైర్డ్ డీజీపీ గోపీనాథ్ రెడ్డిలు హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అంటేనే సేవాతత్పరులని అన్నారు. అన్నదానం కంటే విద్యా దానం గొప్పదని, ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఆర్యవైశ్యులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. రాబోయే సంస్థగత ఎన్నికల్లో వైశ్యులకు సముచిత స్థానం కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

అనంతరం రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులుగా గందె సురేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా కిరణ్ కుమార్ గుప్త, కోశాధికారిగా వనపర్తి బద్రీనాథ్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రభాకర్ గుప్తా, అదనపు ప్రధాన కార్యదర్శిగా తెరటిపల్లి శ్రీనివాస్ గుప్తా, మహిళ అధ్యక్షురాలుగా రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా రాధిక, కోశాధికారిగా విజయలక్ష్మి, యువజన సంఘం అధ్యక్షులుగా రాహుల్ గుప్తా, వాసవి సేవాదళ్ అధ్యక్షులుగా బచ్చు మహేష్ గుప్తా, రాజకీయ కమిటీ అధ్యక్షులుగా కొత్త రవికుమార్ గుప్త, కోశాధికారిగా లకుమారపు వినీల్ కుమార్ గుప్తాలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ గణేష్ గుప్త, ఉప్పల శారద ,చింతల రవికుమార్ గుప్తా, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ, పెద్ద ఎత్తున సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

**- బీజేఎల్పీ నేత ఏలేటి**



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా పని చేస్తున్నదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర మంత్రివర్గం శనివారం తీసుకున్న నిర్ణయాలు నిరాశ పరిచాయని ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న రైతు భరోసాపై స్పష్టత లేదన్నారు. పెన్షన్ పెంపు, ఆరు గ్యారంటీలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉన్నాయని చెప్పారు.తాను లేవనెత్తిన పలు అంశాలపై స్పందించక పోవడం ప్రభుత్వం తప్పు చేసిందనే దానికి నిదర్శనం అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కంపెనీ వ్యవహారంలో ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లిఫ్ట్ టెండర్లలో గోల్ మాల్ సంగతేమిటని నిలదీశారు. ఈ అన్ని అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాడుతామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తాం అని స్పష్టం చేశారు.

# సిద్దిపేట ప్రజలపై ఎందుకింత వివక్ష..

**సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు**



**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ అంటే మాటలు కోటలు.. చేతల్లో కోతలు, ఎగవేతలు అని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పాత పథకాలు బంద్ చేసిండు.. ఆరు గ్యారంటీలు అటకెక్కించాడని ఆరోపించారు. సిద్ధిపేట క్యాంప్ కార్యాలయంలో నంగునూర్ మండల యువజన విభాగం నాయకులతో హరీశ్‌రావు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్ధిపేట అభివృద్ధిపై అక్కసు, కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని అన్నారు. సిద్ధిపేటలోని వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించారని గుర్తుచేశారు. సిద్ధిపేట అభివృద్ధికి కాంగ్రెస్ అడుగడుగునా కాంగ్రెస్ అడ్డుపడుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యువతదే అని స్పష్టం చేశారు. భవిష్యత్తు యువతదే అని హరీశ్‌రావు అన్నారు. రాజకీయాల్లో యువత కీలక భూమిక పోషిస్తారని అన్నారు. సిద్ధిపేట అంటే గౌరవం వచ్చేలా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపామని హరీశ్‌రావు తెలిపారు. రాజకీయ ప్రయోజనాలు వదిలి ప్రజా ప్రయోజనాలపై కాంగ్రెస్ నాయకులు దృష్టి పెట్టాలని సూచించారు. సిద్ధిపేటలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు అయిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. సిద్ధిపేటకు కొత్తవి తెచ్చింది లేదని.. పైగా ఆపేశారని అన్నారు. సిద్ధిపేట ప్రజలపై ఎందుకింత వివక్ష అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. దీనిపై సిద్ధిపేట కాంగ్రెస్ నాయకులు ఎందుకు నోరు మెదపరని నిలదీశారు. సిద్ధిపేటలో పనులు జరిగే వరకు పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. పనులు జరిగే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు.

# రెడ్డి ఒక కులం కాదు.. ఒక బిరుదు

*** ఘనంగా చెంగిచెర్ల రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ**

*** హాజరైన స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మంద సంజీవరెడ్డి**



**విశ్వంభర, ఉప్పల్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల రెడ్డి సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం విద్యా జ్యోతి హై స్కూల్ ప్రాంగణంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి , బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్ ల చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బారసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జిల్లెల సంజీవరెడ్డి, కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, బింగి జంగయ్య, మోదుగుల శేఖర్ రెడ్డి, ఎడ్ల దీపకరన్ రెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు బి శ్రీనివాస్ రెడ్డి, కె శశిధర్ రెడ్డి, రామ్ రెడ్డి, సురేఖ వెంకట్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రఘుపాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రఘు తిరుపతిరెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, పురుషోత్తం రెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడే చర్లపల్లి న్యూ టర్మినల్ రైల్వే స్టేషన్ ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగర శివార్లలో కొత్తగా నిర్మించిన చర్లపల్లి టర్మినల్ రైల్వే స్టేషన్ సోమవారం ప్రారంభం కానున్నది. రిమోట్ వీడియో లింక్ ద్వారా చర్లపల్లి టర్మినల్ రైల్వే స్టేషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభిస్తారు. సోమవారం ఉదయం 10.15 గంటలకు చర్లపల్లి రైల్వే స్టేషన్ రెండో ప్రవేశ ద్వారం వద్ద ప్రారంభ వేడుక జరుగుతుందని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీఎం ఏ రేవంత్ రెడ్డి, కేంద్ర భూగర్భ గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి, రైల్వేశాఖ సహాయ మంత్రి వీ సోమన్న, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ ఐటీ మంత్రి డీ శ్రీధర్ బాబు, ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొంటారు. దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కూడా హాజరవుతారు. దక్షిణ మధ్య రైల్వే నెట్ వర్క్ పరిధిలో చర్లపల్లి రైల్వే స్టేషన్ కీలకం కానున్నది. హైదరాబాద్ నగర ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంతోపాటు ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి టర్మినల్ రైల్వే స్టేషన్ నిర్మించారు.



**నార్కెట్‌పల్లి మండలం బజాకుంట గ్రామానికి చెందిన పపెట్ల యాదగిరి రెడ్డి మనవడి జన్మదిన వేడుకలకు హాజరైన నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య.**

**(విశ్వంభర, నకిరేకల్)**

## నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం.. నీటి సంపులోపడి రైతు మృతి


**విశ్వంభర, బిజినేపల్లి :** ప్రమాదవశాత్తు నీటి సంపులోపడి ఓ రైతు మృతిచెందిన విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వడ్డెమాన్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డెమాన్‌కు చెందిన గుంటి బంగారయ్య(40) రోజు మాదిరిగానే తన మక్క పంటకు నీరు పారపెట్టేందుకు వెళ్లాడు. ఈక్రమంలో పొలంలో ఉన్న నీటి సంపులో కాలుజారిపడ్డాడు.ఎవరూ గమనించకపోవడంతో సంపులోనే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించారు. బంగారయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కాంగ్రెస్ హామీలు అబద్ధం..

**వరంగల్ డిక్లరేషన్ మోసం : గండ్ర వెంకటరమణారెడ్డి**



**విశ్వంభర, కృష్ణకాలనీ:** కాంగ్రెస్ పార్టీఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అబద్ధం..చివరకు వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఎకరానికి రూ. 15వేలు ఇస్తానని మోసం చేసిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీలో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్ధన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని గత్యంతరం లేని పరిస్థితులో శనివారం క్యాబినెట్ మీటింగ్ పెట్టి రైతు డిక్లరేషన్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో వరంగల్‌లో నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.15వేలు రైతు భరోసా ఇస్తామని రైతు డిక్లరేషన్ చేసి, ఇప్పుడు రూ. 12వేలు ఇస్తానని రైతులను మోసం చేసిందని అన్నారు. రైతుల కిచ్చిన హామీల గురించి అడిగితే ప్రభుత్వం ముఖం చాటేస్తున్నదని మండిపడ్డారు. అంతే కాదు.. రూ.2లక్షల రుణమాఫీ ఇప్పటి వరకు కొద్దిమందికి మాత్రమే జరిగిందన్నారు. రైతుభరోసా పూర్తిస్థాయిలో రుణమాఫీ, సన్న, దొడ్డు వడ్లకు రూ. 500బోనస్, వృద్ధులకు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు, మహిళలకు రూ. 2,500, రూ.500కే గ్యాస్, నిరుద్యోగ భృతి, కల్యాణ లక్ష్మి తులం బంగారం పథకాలను ఎప్పుడు ఇస్తారో ప్రకటించి, కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ శబ్దం వెంకటరాణి సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజు పటేల్ పాల్గొన్నారు.






# అభ్యాసకుల కరదీపిక తెలుగుబడి బాలవాచకం

కమ్మనైన భాష అమ్మభాష. మధురమైన భాష మన మాతృభాష. తీయనైన భాష తెలుగుభాష. తేనెలొలుకు భాష మన తెలుగుభాష అని వేనోళ్ళ కొనియాడబడిన భాష. ఆంధ్రభోజుడుగా గణుతికెక్కిన శ్రీకృష్ణదేవరాయలు "దేశభాషలందు తెలుగు లెస్స" అన్నారు. ప్రముఖ తమిళకవి సుబ్రహ్మణ్యభారతి "సుందర తెలుంగు తెలుగు" అని తెలుగుభాష గొప్పదనాన్ని చెప్పారు. "ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్" అని ఇటలీ దేశస్థుడైన నికోలా డి కాంటి తెలుగు భాషను కొనియాడినారు. అజంత భాష మనది. అమృత భాష మనది. అట్లాంటి తెలుగు భాషను మన పిల్లలు దోషరహితంగా చదువలసిన అవసరాన్ని, తప్పులు దొర్లకుండా రాయవలసిన ఆవశ్యకతను రచయిత కూకట్ల తిరుపతి "తెలుగుబడి బాలవాచకం" ద్వారా నొక్కి చెప్పారు. అందు కోసమే ఈ చిరు పొత్తాన్ని మన ముందుంచారు. ప్రస్తుతం ప్రపంచీకరణ ప్రభావం వల్ల అందరూ అన్యభాషైన ఆంగ్లం మోజులో పడి, అమ్మభాషను అభాసుపాలు చేస్తున్న క్లిష్ట సందర్భంలో ఉన్నారు. అంతర్జాతీయంగా అనుసంధానం చేసే ఆంగ్లభాషను నేర్చుకోవడం మంచిదే కావచ్చు కానీ మన తల్లిభాషను మరచిపోతే తెలుగుజాతి మనుగడకు ముప్పు తప్పదని రచయిత నొక్కి వక్కాణించారు. తెలుగు భాషను సులభంగా చదువ, రాయ నేర్చుకోవడానికి కవి, రచయిత కూకట్ల తిరుపతి తెలుగుబడి బాలవాచకం అనే పుస్తకాన్ని చక్కగా రూపొందించారు. కరీంనగర్ పట్టణానికి చెందిన ఈయన పెద్దపల్లి జిల్లా, మండలంలోని మూలసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఈ పుస్తకం ద్వారా పిల్లలు తెలుగు భాషను దోషరహితంగా చదువడం, రాయడంను సులువుగా నేర్చుకోవచ్చు. ఇందులో సరళపదాలు, గుణింతపదాలు, ద్విత్వాక్షరపదాలు, సంయుక్తాక్షరపదాలు, సంశ్లేషాక్షరపదాలు మరియు ఆ పదాలతో కూడిన వాక్య రచనలను సోదాహరణంగా వివరించిన తీరు పాఠకులను ఆకర్షిస్తుంది. ఇదే వరుస క్రమంతో, పద పద్ధతిలో తెలుగు భాషను సులభంగా అభ్యసించవచ్చు. ప్రతి అంశంలో వాక్య నిర్మాణాన్ని కూడా తేలికగా చేసి చూపించారు. వీటికి సంబంధించిన డిజిటల్ పాఠాల క్యూఆర్ కోడ్లను ఆయా పాఠాల దగ్గర పొందుపరచడం విశేషం. పాఠకుడు స్వయంగా ఈ పుస్తకంలోని పాఠాలను చదువుకోవచ్చును. అలాగే క్యూఆర్ కోడ్లను స్కాన్




చేసి డిజిటల్ పాఠాలను చూస్తూ, వింటూ భాషను సొంతంగా నేర్చుకోవడానికి అనువుగా ఈ పుస్తకాన్ని రచయిత కూకట్ల తిరుపతి అభ్యాసకులకు అనుకూలంగా మలచినారు. ఇలా సాంకేతిక పరిజ్ఞానం జోడించబడడం పుస్తక ప్రపంచంలో కొత్తదనంగా భావించవచ్చు. తెలుగు భాషలో సులభతరం నుంచి కఠినతరం వైపుగా బోధనాభ్యసన ప్రక్రియను కొనసాగించడానికి వీలుగా ఈ పుస్తక రూపకల్పన చేశారు.


తెలుగు భాషను చదువడం, రాయడం నేర్చుకున్న తర్వాత తెలుగు వాడిగా జీవించడానికి పనికి వచ్చే పాఠాలను ఇందులో పొందుపరచడం ముదావహం. తెలుగు పండుగలు, మన ఆటలు, తెలుగు సామెతలు, తెలుగు జాతీయాలు, పొడుపు కథలు, తిథులు, వారాలు, నక్షత్రాలు, రాశులు, కార్తెలు, మాసాలు, ఋతువులు, కాలాలు, ఆయనాలు, తెలుగు సంవత్సరాలు, తెలుగు అంకెలను అందుబాటులో ఉంచారు. ఇప్పటి తరానికి ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉన్నది. తెలుగు భాషను నేర్చుకోవడంతో పాటు తెలుగువాడిగా జీవించడానికి, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను అలవర్చుకోవడానికి, అనువుగా ఈ పుస్తక రూపకల్పన జరిగిందని చెప్పవచ్చు. ఈ పుస్తకానికి భావస్ఫోరకమైన ముఖచిత్రాన్ని కూకట్ల సాయి భారవి అందించారు. ఈ చిరు పొత్తానికి విశేషమైన ప్రజాదరణ లభించడాన్ని బట్టి చూస్తే, మాతృభాషాభిమానం ఇంకా సన్నగిల్లడం లేదనిపిస్తున్నది. మన దేశంలోని ముంబై, చెన్నై, రాజస్థాన్, న్యూఢిల్లీ తదితర ప్రాంతాలలోని తెలుగువారితో పాటు అమెరికా, మయన్మార్, దుబాయ్ మొదలైన దేశాలలోని ప్రవాస తెలుగువారి నుంచి ఈ పుస్తకానికి విశేషమైన స్పందన లభించడం అభినందనీయం. దక్షణాఫ్రిక దేశంలోని ప్రవాస తెలుగు పిల్లలకు తెలుగు పాఠ్య పుస్తకంగా తెలుగుబడి బాలవాచకంను వినియోగించుకోవడం గర్వకారణం. తీయనైన తెలుగు భాష మూలాల్లోకి వెళ్ళి, తెలుగును తేలికగా నేర్చుకోవడానికి ఈ పుస్తకం దోహదం చేస్తుంది. ప్రతి తెలుగువాడు చదవవలసిన పుస్తకమిది. ప్రతి పాఠశాల గ్రంథాలయంలో ఉండవలసిన పుస్తకం తెలుగుబడి బాలవాచకం. మాతృభాషాభిమాని, తెలుగుభాషోద్యమకారుడు, తెలుగుభాషోపాధ్యాయుడు, కవి, రచయిత కూకట్ల తిరుపతి కలం నుండి తెలుగుభాషకు సంబంధించిన పుస్తకాలు ఇతోధికంగా వెలువడాలని కోరుకుంటున్నాను. మాతృభాష పరిరక్షణ కోసం పాటుపడుతున్న కూకట్ల తిరుపతి గారికి అభివాదాలతో కూడిన అభినందనలు, శుభాకాంక్షలు.



-కె.సాయి భారవి, ఎం.టెక్.
కరీంనగర్.
సెల్: 9491047591

# నైతిక ప్రవర్తనతో జీవన వికాసం

స్వచ్ఛ భారతావని నిర్మాణానికి కేవలం భౌతిక పరిశుభ్రత మాత్రమే కాదు మానసిక పరిశుభ్రత కూడా ఎంతో అవసరం. మానసిక పరిశుభ్రత కొరకు నైతిక విలువలను పాటించటం ఎంతో ముఖ్యం. నైతిక ప్రవర్తనతో కూడిన జీవన విధానం వలన దేశం పురోగతి సాధిస్తుంది. ఈ పురోగతికి యువత కీలక పాత్ర వహిస్తుంది. అటువంటి యువత నీతివంతంగా ఎదగడానికి సత్ప్రవర్తనతో బాధ్యతాయుతంగా మనుగడ సాధించడానికి బాల్యం నుంచి పటిష్టమైన పునాది ఉండాలి.





ప్రస్తుత సమాజంలో నీతి నిజాయితీలు నైతికత లోపిస్తున్నాయి. విలువలు నానాటికి తరిగిపోతున్నాయి. ఇది వాస్తవం. మంచైనా, చెడైనా పెద్దలను చూసి పిల్లలు నేర్చుకుంటారు కదా! పెద్దవారు పద్ధతిగా ఉంటే చిన్నవారు వారిని అనుసరిస్తారు. నీతి, నిజాయితీ, క్రమశిక్షణ సమయపాలనతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వారి జీవిత చరిత్రలను పిల్లలకు తల్లిదండ్రులు కథల రూపంలో ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పగలగాలి. ప్రతి తల్లి, తండ్రి తమ సంతానం వరకు ఉత్తమ ఉపాధ్యాయులు కావాలి. ఒక తల్లి వెయ్యి మంది ఉపాధ్యాయులతో సమానమని వేదం చెబుతుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తాము ఆచరిస్తూ చెప్పే బోధనలు పిల్లలపై అత్యంత ప్రభావం చూపిస్తాయి. గాంధీజీ స్వీయ చరిత్ర నైతిక ప్రవర్తనకు ఉత్తమ పాఠ్యగ్రంథం అని చెప్పవచ్చును. గాంధీజీ బాల్యంలో హరిశ్చంద్ర నాటకం చూసి ఎన్ని కష్టాలు వచ్చినా సత్యాన్ని పలకాలని నిశ్చయించుకున్నారట. బాల్యంలో పడే ముద్ర అంత గాఢంగా ఉంటుంది మరి.

చిన్నారులను ఆకట్టుకునే ఎన్నో మంచి మంచి కథలు తెలుగు భాషలో మనకు కనిపిస్తాయి. వాటిని పిల్లల మనసులకు అర్థమయ్యేలా పెద్దవారు చెప్పగలగాలి. గురుముఖతః విన్నవాటికి ఎక్కువ ప్రభావం ఉంటుంది. ఆ గురువు బాల్యంలో ఇంటి వద్ద తల్లిదండ్రులైన కావచ్చు. పాఠశాలలో ఉపాధ్యాయుడైన కావచ్చు తేట తెలుగులో ఎన్నో నీతి శతకాలు ఉన్నాయి. భారత, రామాయణ, భాగవత గ్రంథాలు సైతం నీతి కథలు, ధర్మాలు, సత్ప్రవర్తన సూత్రాలతో నిండి ఉన్నాయి. సాహిత్య సంపదను మాతృభాషలోనే అందించే ప్రయత్నం బాల్యంలోనే ప్రతి తల్లి తండ్రి చేయాలి. పిల్లల కోసం తల్లిదండ్రులు ఎంత డబ్బు ఖర్చు చేస్తున్నారన్న దానికన్నా వారికోసం ఎంత నాణ్యమైన సమయం వెచిస్తున్నారన్న దానిపైనే పిల్లల నైతిక ప్రవర్తన, వ్యక్తిత్వ వికాసం ఆధారపడి ఉన్నాయి. మాతృభాష సంస్కారాన్ని ఇస్తుంది. ఆలోచన విధానాన్ని పెంచుతుంది. మాతృభాషతో అనుసంధానమైన చదువు నైతిక జీవన వికాసానికి దోహదం చేస్తుంది. జ్ఞానాన్ని విచక్షణను విశ్లేషణను ఇవ్వని విద్య నిరుపయోగం. అంతేకాక సమాజ వినాశనానికి దోహదం చేస్తుంది.

నీతి, నిజాయితీ, అహింసా, సత్యసంధత, క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత, సత్ప్రవర్తన వీటన్నిటి సమాహారమే నైతిక జీవనం. నీతివంతమైన జీవితం అలవడాలంటే చిన్నారులకు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవర్చాలి. ప్రాచీన సాహిత్యంలో గురుశిష్య పరంపరపై ఉత్తమ కథలు ఎన్నో మనకు కనిపిస్తాయి. అవేవీ చదవకుండా వినకుండా సత్ప్రవర్తన ఎలా అలబడుతుంది? పాఠ్యాంశాలలో ఉండే విషయాలు పరీక్షలకే పరిమితమైతే, జీవితం కఠిన పరీక్షలను ఎదుర్కోవలసి వస్తుంది. నేర్చుకున్న విషయాలను జీవితంలో అమలుపరచకపోతే వ్యక్తిత్వం ఏనాటికి వికసించదు. చదువుకున్న చదువుకు జీవిత వికాసానికి మధ్య ఉన్న పెద్ద అగాధం పూడ్చుకున్నప్పుడే మానవ జీవితంలో మార్పు సాధ్యపడుతుంది. చేసే పనుల్లో చిత్తశుద్ధి మమేకత లేకపోతే ఆ పనులకు విలువే ఉండదు.

నైతిక ప్రవర్తన లేని మనుషులు ప్రశాంతంగా జీవించలేరు. సంతోషంగా బ్రతకలేరు. ప్రక్క వారిని సైతం బ్రతకనివ్వరు. అవినీతి మార్గమనే ముళ్ళబాటలో నడిచే వారికి జీవితంలో స్థిమితం, గౌరవం లభించవు. ఒకవేళ గౌరవాదరాలు లభించినా అవి ఆ వ్యక్తికి ఆ సమయంలో సమాజంలో ఉన్న పలుకుబడి గుర్తింపు లకే కానీ, ఆ వ్యక్తికి కాదు అని గమనించాలి. మరణానంతరం కూడా మనిషిని శాశ్వితుడిని చేసేది కేవలం నైతిక ప్రవర్తన తో కూడిన వ్యక్తిత్వమే. నైతిక విలువలను పెంపొందించుకోవాలంటే సత్సాంగత్యం, సద్గంధ పఠనం, సత్కాక్షేపం తప్పనిసరి అని అందరూ గుర్తించాలి.




-"సాహిత్య కళా విభూషణ"
చౌడూరి నరసింహారావు
సాహిత్య, సామాజిక విశ్లేషకులు

# తెలుగు కవుల ఐక్యకూడిక "కవిత్వం 2023" సంకలనం

కవిత్వరంగంలోనూ,కథారంగంలోనూ యేడాది ముగిసిందంటే వార్షికసంకలనాల,ప్రత్యేక సంకలనాల ట్రెండ్ ఇటీవల ఎక్కువగా నడుస్తోంది. సంకలనాల రూపంలో నాణ్యమైన సాహిత్యచరిత్ర నమోదవుతుంది. వార్షికల్ని తెచ్చే ఆనవాయితీ కవులకు, కథకులకు ఉత్సాహాన్ని నింపుతుంది. ఆ యేడాదిలో వాటిల్లిన సామాజిక చరిత్ర గతి అంతా నమోదవుతుంది. వార్షిక సంకలనాల్లో అందరూ కవర్ కాకపోవచ్చు. ఇబ్బందేమీ లేదు. మంచి రచన ఎక్కడున్నా అది నాల్కలను వరిస్తుంది. అప్పుడెప్పుడో ముద్దుకృష్ణ వైతాళికులు సంకలనంలో జాషువా మహాకవికి చోటు దక్కలేదు.మరి జాషువా సుకవి ప్రజల నాల్కలయందు జీవించడాన్ని ఎవరైనా ఆపగలిగారా!? గనక సంకలనాల్లో కొందరికి చోటు లేకపోవచ్చు. కారణాలు సంకలనకర్తలకు కొన్ని లక్ష్యాలుంటాయి. కొన్ని సందర్భాలను రికార్డుజేసే ఆవశ్యకతలుంటాయి. గనక వాళ్ల లక్ష్యాలకు మ్యాచ్ కాక, మిగిలిన వారు చేరలేకపోవచ్చు. చింతించవలదు. ఇకపోతే తెలుగులో మడికిసింగన "సకలనీతిసమ్మతం" నుంచీ అనేక సంకలనాలు వచ్చాయి. తెలంగాణ కవితా వార్షికలు, బెజవాడ కవితా వార్షికలు, రైతుకవిత సంకలనం, కవితాదశాబ్ది, నాన్న పదం,అమ్మపదం, నాయన సంకలనాలు,నానీసంకలనాలు, రెక్కలసంకలనాలు, బాలుడి ఆత్మగీతాల సంకలనం, మంగలికైతల సంకలనం, రజకగీతాల సంకలనం, ముస్లిం కవితా సంకలనాలు, సంఘటనాత్మకంగా వచ్చే అసిఫా సంకలనం, ఉచ్ఛలజలధి తరంగ వంటి సంకలనాలు, ఇలా అనేక సంకలనాలు వాటి వాటి లక్ష్యాలతో వెలువడుతున్నాయి. ఏ సంకలనం వచ్చినా అందులో కొంత నాణ్యమైన సరుకున్నట్టే,కొంత నాసి వుండొచ్చు. కానీ ఆ సంకలనం ఎందుకు వెల్లడయింది. ఎలాంటి ప్రభావాన్ని చూపిందీ,ఎలాంటి సామాజిక బాధ్యతను నెరవేర్చిందనేదే చూడాలి.దర్భశయనం శ్రీనివాసాచార్య మనందరికీ తెలుసు. కవిగా, వ్యాసకర్తగా, విలువైన ఉపన్యాసకుడిగా మనకు ఆయన ప్రతిభ తెలుసు. వారు ఎవుసాయంపై ప్రాణంపెట్టి రాసే, కవిగా ఇంకా నిశితంగా తెలుసు. దీనితోపాటు యేడాది ముగియగానే, ఆ యేడాదిలో రవళించిన,రమణించిన కవిత్వాన్ని ఏర్చికూర్చి సంకలనంగా తీసుకువస్తున్నారు. కొత్తతరాన్నీ పాతతరాన్నీ మేలుకలయికగా దండగుచ్చిన తీరులో వారి కృషి ఎన్నదగినది. ఇపుడు కవిత్వం 2023 సంకలనాన్ని పరిశీలిద్దాం.

ఈ సంకలనంలోకి 60 కవితలు తావుని పొందాయి. అనేక పత్రికలను కాగడాపట్టి వెతికి మేలిమి కవితలను కూర్పు చేశారు. వస్తువైవిధ్యం ఇబ్బడిముబ్బడిగా వుంది. అరిగిన వస్తువులు కొన్ని వున్నా,అరుదైన వస్తువులు ఎన్నో వున్నాయి. మామూలు అభివ్యక్తులు అంటే నెరేటివ్ మెథడాలజీలో నిర్మితమైనవి కొన్నయితే, కళాత్మకత పుష్కలంగా వున్న ఎక్స్ప్రెషన్ ఎక్సర్ సైజులూ చాలా వున్నాయి. ఆంధ్రా అని లేదు, తెలంగాణా అని లేదు. తెలుగు కవి ఎక్కడ రాసినా సంకలనంలోకి తీసుకున్నారు. తెలుగు కవుల ఐక్యకూడిక ఈ సంకలనం. సంకలనాల ద్వారా హద్దులు గీసుకుంటున్న వైనం వుంది మన తెలుగు నేలలమధ్య. వివక్షల్ని సహించలేక నిరసనలు బయల్పడుతున్నాయి. కాక రేపుతున్నాయి. అలాంటి సమయంలో కవుల సమైక్యతను సాధించడం కవిత్వం 2023 లో కానవస్తున్నది.

వేముగంటి మురళి జ్ఞాపకాల కాపలా కవిత రాసాడు. ఇంటితో




మనుషులతోని పెనవేసుకున్న జ్ఞాపకాలను చిత్రించాడు. కవిత్వం ఒక వాతావరణంలోనికి లాక్కుని పోవాలి. కవితలోని వస్తువు పాఠకుడి జీవితంలోని సామ్యతను రూపుగట్టాలి. పాఠకుడు చలించాలి. కవితను తనలోకి లాక్కొనాలి. అలాంటి పదచిత్రాలు ఈ కవితలో వున్నాయి.

"పండుగకు సున్నం వేయించినప్పుడల్లా
పెచ్చులూడిన గోడ లోపలిదుఃఖం
కళ్లముందు కదులుతుంది"
"పల్లు విరిగిన దువ్వెనకు చిక్కుకున్న తెల్లవెంట్రుకలు
ఇంటిపెద్ద అనుభవాన్ని పరిచయం చేస్తాయి"
" ఊసులవాసాలకు కట్టిన పెళ్లినాటి బాసింగంలా ఊగుతుంటే
కనురెప్పకొట్టని ఇంటికి జ్ఞాపకాల కాపలా"

"యింకో రాత్రి గడిచిందనుకో" కవిత అఫ్సర్ రాసిన ఆయన మార్కు కవిత. సరళంగా తాత్వికతను రాయడం ఆయన మార్కు. దేశదేశాల కవనరీతులను చదివిన విస్తృతకవి అఫ్సర్ .మహాకవులంతా నిరాడంబరంగా జీవించినట్టు, మహా కవిత్వమంతా నిరాడంబర శైలిలో వెలువడుతుందన్న సాకారత అఫ్సర్ కవిత్వంలో చూడొచ్చు. సరళ వచనంలో గాఢభావాలను నడిపించిన కవిత ఇది.కొన్ని పాదాల్లోకి మనసొగ్గుదాం.

"ప్రతిసారీ పలక తుడిచి,అక్షరమెలా వుంటుందో నేర్చుకోవాల్సిందే ఎవరైనా!"
"రాత్రి అనేది ఒకటుంటుంది, దాని నల్లటిసిగమీద మఖమల్ రెక్కలపక్షిని నువ్వెప్పుడూ చూస్తూనే వుండాలి.నిన్ను నిర్వచించే కల అంత చీకట్లోనే ఎందుకు వస్తూ వెళ్తుందో కూడా నువ్వు చూస్తూ చూస్తూ వుండాల్సిందే"
"పోయిన కాలాలన్నీ పొట్టిపోయిన కలలే,కాదంటావా!?"

ఇలా ప్రోజ్ పోయట్రీ శైలినీ, పొడవువాక్యాల శైలిని పాఠకుడి ఆలోచనల్లోని కలుపుని తీసి,గట్టిగింజల హృదయసస్యాన్ని పండించే కవనసాయం అఫ్సర్ కవిది.

ఎపుడో అంగలకుర్తి విద్యాసాగర్ కవికి ఉత్తరం రాస్తే నగరానికొచ్చిన నాగళ్లు, భద్రాచలం మన్నెంకతలు పొత్తాలు పంపారు.తరువాత వారు టచ్ లో లేరు. మరలా ఈ సంకలనంలో "కాలాతీత సుస్వరం"గా వినిపించడం ముదావహం. కే.జే.యేసుదాసు గారి పాట నిపుణతను, సంగీత విశేషజ్ఞతను ఈ కవితలో వారి పాటల్లోని పదాలతో బొమ్మకట్టించిన తీరు గొప్పగా వుంది. గుండెను ద్రాక్షతీగలా అల్లుకునే పదసరంజామాను సమకూర్చుకున్న సుందరకవిత.

విన్నకోట రవిశంకర్ "స్నేహం" కవితను రాసాడు. "సాహచర్యం కొందరికొక అదృష్టం అనీ,మరికొందరికది ఏనాటికీ రూపుదాల్చని ఒక ఏకాంత స్వప్నమనీ అంటాడు. కంచరాన భుజంగరావు సంక్షోభ సమయాలకు, ధిక్కరించే సందర్భాలకు కవులు బిగి పిడికిళ్లనివ్వమనే కర్తవ్యనిష్ఠను బోధించాడు.పద్యమనే గదిని ఒక విపత్తు ప్రాంతం అంటున్నాడు. ధీరజ్ కశ్యప్ వేముగంటి "ఊ" అనే ఖండికలో నిద్రలోకాల సంగీతంలో ఎన్ని స్వరాలుంటాయో ఎవరికైనా తెలుసా అని ప్రశ్నిస్తున్నాడు.

తెలంగాణ కవులలో దేశీయనుడిని కవ్వడిగా రాస్తూ, కవిత్వానికొక కొత్తందనాన్ని అందిస్తోన్న కవి తులశ్రీనివాస్ . కడుపుతీపి అనే కవిత రాసాడు. పేదతల్లి బిడ్డకు లోకరీతినీ, జీవన విధాన్ని బోధిస్తోన్న వైనం కవిత సారం. గోవ్యాఘ్ర సంవాదంలో ఆవు లేగకు బుద్ధులు చెప్పిన కథాకావ్య శిల్పంలా అనిపించినా అది ప్రాదేశికతా శిల్పమే. కొన్ని వాక్యాలను చదువుదాం.

"ఆశకో ఆకలికో
చిన్న పొరపాటు కూడా సేయకు
ఊర కుక్కలన్నీ పీక్కతింటయి
మనద్దుల్ల మనముండాలి బిడ్డా!"
"కడుపు గాలే పరిస్థితి కన్నా
కాట్లెగాల్తనే బాగుంటది బిడ్డా"

కడుపునించుకుంటే కాళ్లమీద బడతది, పద్దాడెపుడూ సెడ్డోడు కాదు, గుడ్డగాల్చి మీదెస్తరు, పేదోడి కోపం పెదవికి చేటు, కడుపులిసం లేనోళ్లం,మనద్దుల్ల మనముండాలి వంటి జన నుడికారాలతో గుండెను చలింపజేసే నేర్పుగల్ల కవిత్వం తులశ్రీనివాస్ ది.

ప్రసిద్ధకవి శివారెడ్డి గారు "స్త్రీ ముందు తలవంచి" రాసిన సిరా కమ్మదనంగా వుంది. ఏది లేకపోతే ఈ సృష్టి అసంపూర్ణమో అది భూమి,అది స్త్రీ అని స్త్రీ శక్తిని ఉదాత్తీకరించారు. అపురూపంగా ఔదల ధరించారు.

"రాత్రి వెంట పగలు స్త్రీ వెంట పురుషుడు
ఇంత దుమ్ము తీసి నెత్తిమీద పోసుకుంటే
స్త్రీని స్నానించినట్టు
ఇంత అగ్ని తీసి కళ్లల్లో పెట్టుకుంటే
స్త్రీని జీవించినట్టు
వాళ్ల పాదాల పట్టెడ సవ్వడులు
భూమి చేసే గొప్ప సంగీతం"

శివారెడ్డి గారి తనయుడు శ్రీకాంత్ కూడా అమ్మను గురించి సిమిలీ పూర్వకమైన చక్కని భావచిత్రాలతో రాసాడు.

"చూడని వాటినేవో తన కాంతిలో
స్పష్టం చేసే
ఒక మట్టి ప్రమిదలా అమ్మ"

కవియాకూబ్ "కొన్ని ప్రశ్నలు" వర్తమాన జనజగతి నడిచే, నడిపించే అథోగతి పైన మాట్లాడాయి. నీళ్లపొదుగుల్లో దాహం తీరక ఉక్కిరి బిక్కిరి అవుతున్న దిక్కులేని కాలాన్ని కళ్లముందుంచే అనేక దృశ్యాలు కవితనిండా పారించాడు.కాగితప్పూల పరిమళాలను, సర్పపరిష్వంగాలకు కరిగే జీవితాలను, ప్లాస్టిక్ సన్నివేశాల సమాధాలను, బతుకుల్లోకి బొట్లుబొట్లుగా పడుతున్న విషబిందువుల మూలాలను ,కుట్రలమధ్య నలిగే అస్థిపంజరాల మనుషులను కలిగిన ఈ కాలం భయపెట్టే కొండచిలువ అనడం ఔచితీవంతంగా పొసగింది.

దర్భశయనం గారు రాసిన "ఆఖరి ఉత్తరం" చనిపోయే ముందు మాటలు బట్వాడా చేయలేని దుర్భర వేదనా స్థితిలో వారి నాయన రాసింది.ఇదొక ఎలిజీ. నాయన ఆఖరి లేఖను "వృద్ధాప్యపు ముడతలతో వుంది కానీ అక్షరాల తళుకు మసకబారలేదు, అనుభవజ్ఞుడి కంటికాంతిలా" అనడం బాగుంది. సార్థకమైన పదచిత్రాలెన్నో మెరిసిన కవిత.

మునాసువెంకట్ గల్మ కవిత అపురూపం. గల్మ(గడప)ను పసుపుకుంకుమలు రాసుకుని, ఇంటిముందు కూర్చున్న ఇంటి ముత్యాలమ్మ అనడం ఈ మెదకవి ఎదకే చేతనవును.దేశరాజు ఎదిగిన కొడుకుని,వాడి హృదయాన్నీ, వాడి మీసాన్ని కౌగిలించుకున్నాడు. ఎదిగిన కొడుకుని అందుకునే ఎత్తుకి తండ్రులను ఎదగమంటున్నాడు.

కోడూరి విజయ్ కుమార్ మానవసంబంధాల మధ్య యాంత్రిక విషాదాన్ని బంజరు సంబంధాలు అనడం సముచితంగా నప్పింది. మంత్రి కృష్ణమోహన్ నేలపట్టు పక్షికేంద్రాన్ని ఒక పక్షుల పుస్తకం అనడం,పక్షిప్రేమికుల పారడైజ్ అనడం రమ్యంగుంది.


"గులాగ్ " కవిత సమకాలీన ప్రాపంచిక విషాదానికి అద్దం పట్టింది. తుల్లిమిల్లి విల్సన్ సుధాకర్ "ఎవర్ని కదిపినా నాది పవిత్రభూమి అంటాడు,ఎవడ్ని చూసినా నిరంతర రక్తకవాతులు చేస్తూ కనబడతాడు". ఈ ప్రాపంచిక విరోధాభాషగా నడుస్తోన్న కుసమయాలను ఎలుగెత్తాడు.కవితలో చివరివాక్యం కుదిపేసింది.

"పసిపిల్లలకు పాలూనీళ్లూ ఇవ్వలేకపోతేనేం
శవాలను మోసుకెళ్లడానికి గోనె సంచులను సరఫరా చేస్తున్న
దయగల ప్రభువులకు వందనాలు".

సంకలనంలోని కవితలన్నీ స్థలాభావం, పాఠకుడి ఓపిక వలన తడమలేం గానీ ఈ పుస్తకంలో దర్భశయనంగారు ఎన్నిక కవితలన్నీ మన్నిక గలవే. మన్ కి మహదానందం కలిగించేవే. మువ్వలచేతికర్రతో తవ్వకం జరిపిన కవి శిఖామణి తన కూతురు నందినిని ప్రేమజ్వరమాని అనడం బాగుంది. అరటిచెట్టు మొవ్వులోంచి నవనవలాడుతూ బయటకు తొంగిజూసిన లేలేతమారాకులా వుండే కూతురని వర్ణిస్తాడు. కవిత్వం చేయితిరిగిన కలం కదా, పఠితనెపుడూ అతడు గెలుస్తాడు. అన్నవరం దేవేందర్ ఊరిని తనదైన బాణీలో,వాణితో "పలకరింత" చేశారు. గంటెడ గౌరునాయుడు ఉత్తరాంధ్ర ఉత్తమగళం. ఏటిపాటను రైతుపాటను మరుపురాకుండా పాడుతనే వుంటాడు. ఉత్తరాంధ్ర నుడితో, పాటరచనా పగిదితో రాసిన "దుఃఖ్ఖంల దాన్నిపుకళ్లం" కవిత ఇందులో వుంది. గమనిద్దాం.

"పండించింది అమ్మకానిది పోదు
వొండింది తిండికి పనికిరాదు
పండగొచ్చింది నాయనా కొండలాగ
రైతునోడి బుర్రమీద బండలాగ"

అదే ప్రాంతం నుంచి కేక్యూబ్ వర్మ "కళింగ సీమ ఇది, అమాయకంగా కనిపించే ధిక్కార భూస్వరమని అంటున్నాడు. ఇంకా ఈ ప్రాంతం నుంచే పాయల మురళీ మాస్టారికో లేఖ, మొయిద శ్రీనివాసరావు ఆకలిగిన్నెలు, సాంబమూర్తిలండా ఎవరో ఒకరు, బాలసుధాకర్ మౌళి నదిలేని ఊరునుంచి, సిరికి స్వామినాయుడు "నిర్వాసిత" వేర్వేరు నేపథ్యాల్లోంచి రాసిన బలమైన కవితలు. అలాగే ఈ సంకలనంలో కవయిత్రుల విలువైన కవితలున్నాయి. కొండేపూడి నిర్మల "బొట్టు" కవిత వుంది. బొట్టుని నిర్బంధ శాసనమైందనీ, గుండెలో కత్తి దించినట్టు మొహాల మీద బొట్టుని నాటుతున్నారనీ,బొట్టు అంటే నేను కాదు, నా ఉనికి బొట్టులో లేదు" అని నిర్భరగొంతుని వినిపించారు. జూపాక సుభద్ర "యెలుతురు తొవ్వల్ని యెతుకుతూ" రాజకీయ స్వారాన్ని గొంతెత్తారు. కుండ దొరకని ఎసరుయెత, సెట్టు దరిలేని సెరువు కతను చెబుతూ పాలకుల గతిని ఎండగట్టారు. వైష్ణవిశ్రీ "యుగాంతం" కవిత స్త్రీ పక్షంగా రాసారు. స్త్రీ చైతన్యాన్ని ఆత్మాభిమాన జెండాగా ఎగరేసారు. జి.కళావతి "స్వేచ్ఛగా", మానసచామర్తి "అమాత్ర", మందరపు హైమవతి "మోసగించిన కల" వీరిలో ఏ కవిత చదివినా తెగువతనమే వుంది. పురుషాధిపత్యంపై నిరసన వుంది. సుంకరగోపాలయ్య,మహమూద్ ,పొన్నాలబాలయ్య, తగుళ్లగోపాల్, పల్లిపట్టునాగరాజు, బండారు రాజ్ కుమార్ ,వేణు ఊడుగుల,దొంతచరణ్ వంటి యువకంఠాలు జీవితాన్ని పొరలు పొరలుగా ఒలుచుకుని రాయడం నచ్చిన విషయం. కవిత్వకళ పట్ల వీళ్లకున్న అభిరుచి, అవగాహన అబ్బురపరుస్తున్నది. ఎంత ఆధునికత వెల్లివిరిసి, బిజీ జీవితాలొచ్చినా కవులకు కవిత్వానికెపుడూ ఢోకా వుండదు అనడానికి ఈ కవులంతా భరోసానిస్తున్నారు. స్థలాభావం వలన మిగిలిన కవులను స్పర్శించలేక పోతున్నాను. కానీ ఈ యేడాది సంకలనంలో చోటుజేసుకున్న కవితలన్నింటికీ చదివించుకునే గుణమే వుంది. వస్తువు పాతదైనా అభివ్యక్తి నవ్యతను కనబర్చారు కొందరు. అభివ్యక్తి రోటీనుగున్నా వస్తు నవ్యతను తెచ్చారు. కొందరైతే వారిదైన ప్రాదేశిక భాషను జమిలీజేశారు. మొత్తానికైతే కవిత్వ కళా ప్రపంచం ప్రతిఫలించింది. దర్భశయనం శ్రీనివాసాచార్యగారు ది.25/12/24 తేదీన హైదరాబాదు బుక్ ఫెయిర్లో నేను పాల్గొన్న కవిసమ్మేళనం వేదిక మీద ఈ సంకలనాన్ని అందించారు. కృతజ్ఞతలకోటిగా ఈ వ్యాసాన్ని రాసాను. కవులందరికీ, సంపాదకులకు మనసారా అభినందనలు!



-మెట్టానాగేశ్వరరావు
9951085760

# ఆమనగల్ ముఖ చిత్రాన్ని మారుస్తా

- మొదటి ఏడాదిలో రోడ్ల 189 కోట్లు
- విద్య అభ్యున్నతి కి 20. 43 కోట్లు మంజూరు
- ఆమనగల్లు లో తక్కువ ఓట్లు వచ్చినా అభివృద్ధి చేసి చూపిస్తా
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



విశ్వంభర, ఆమనగల్లు: రెండేళ్లలో ఆమనగల్లు ముఖచిత్రాన్ని మారుస్తారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో అమనగల్లు చిరు వ్యాపారస్తుల సంఘం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని ఆదివారం ఆయన నివాసంలో కలిసి మండల కాంప్లెక్స్ భవన నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం వివిధ మండలాల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రెండు సంవత్సరాలలో ఆమనగల్లు ముఖ చిత్రాన్ని మారుస్తానని గత ప్రభుత్వంలో ఆపేసిన పనులు కొనసాగేలా చేసి ఆమనగల్లు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గతంలోనే 189 కోట్లు రోడ్ల కోసం మంజూరు చేసి పనులు ప్రారంభించామని విద్య అభ్యున్నతి వసతుల కల్పన కోసం 20 కోట్ల రూపాయలను విడుదల అయ్యాయని తెలిపారు. నాది తలకొండపల్లి మండలం ఖానాపూర్ స్వగ్రామమైన నేను చదువుకున్నది ఆమనగల్లు లో అని నాకు ఓట్లు రాకున్నా నేను అందరికీ ఎమ్మెల్యేనని అందులో ఆమనగల్లు కూడా భాగమని కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో ఆమనగల్లును అభివృద్ధి చేసి నారాయణరెడ్డి అంటే ఏంటో చూపిస్తానని, నాకు అన్ని మండలాలు సమానమేనని ముఖ్యంగా కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ, వివిధ పత్రికల నూతన సంవత్సర క్యాలెండర్ ల ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు కిషన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సంజీవ యాదవ్, యాచారం వెంకటేశ్వర్లు, చిరు వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు గాజుల శీను, ఉపాధ్యక్షులు రూపం వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాస్యం నరేందర్, కార్యదర్శులు కార్యదర్శులు చెరుకు యాదగిరి రజాక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మ గుడి నిర్మాణానికి విరాళం



**విశ్వంభర, రంగారెడ్డి :** నందిగామ మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ గుడి నిర్మాణానికి భారీ విరాళం అందజేసిన తెలుగు సినిమా సెట్టింగ్ ఆర్ట్స్ డైరెక్టర్ జంగిలి యాదయ్య మామ జంగిలి చంద్రయ్య ఆదివారం గుడి సమక్షంలో ఇరువై వేల నూట ఒక్క రూపాయలు ఇవ్వడం జరిగింది. వారికి అమ్మవారి కృప ఎల్లవేళలా ఉండాలని గ్రామ ప్రజలు కోరుకున్నారు. మరియు జంగిలి మల్లేష్ తండ్రి చంద్రయ్య ఐదువేల ఒక్క రూపాయి ఇవ్వడం జరిగింది. వారికి అమ్మ వారి కృప ఎల్లవేళలా ఉండాలని గ్రామ ప్రజలు కోరుకున్నారు.

## మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్‌కు ఘన సన్మానం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం టాకురాజుగూడ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆమనగల్లు మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ యాట గీత నర్సింహా ముదిరాజ్ ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకంక్షాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బీమా నాయక్, జగన్ నాయక్, బాలు నాయక్, బీమ్లా, లాలూ, బలరాం, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న అందెల శ్రీరాములు



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల్ సిరిగిరి పురం గ్రామంలో చిట్టే అంజయ్య గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఇరుముడి మహోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అయ్యప్ప స్వాముల కొరకు నిర్మించిన నూతన సన్నిధానంను శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఆపదలను తీర్చే దైవం హరిహర సుతుడు అయ్యప్ప స్వామి అని, అయ్యప్పను కొలవడం ద్వారా ఆపదలు తొలగి అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు చేకూరుతాయని, చేపట్టే ప్రతి పనిలో విజయం సాధిస్తారని అన్నారు. మండల దీక్షను ముగించుకుని శబరిమలై బయలుదేరుతున్న అయ్యప్ప స్వాములు క్షేమంగా వెళ్లి రావాలని తెలిపారు. అదేవిధంగా సిరిగిరి పురం గ్రామంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ కాసుల సురేష్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసుల సురేష్, పాండు, అనిల్ గౌడ్. తడకల నవీన్. పర్వతాలు. మహేందర్. చెన్నయ్య. బాల్ రాజ్. నరేష్. అలివేలు. మనోహర్ .చిట్టే వెంకటేష్. కాసుల వెంకటేష్, లక్ష్మయ్య, శ్రీధర్, కరుణాకర్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన



**విశ్వంభర, ఇనుగుర్తి:** రోడ్డు భద్రతా నియమాలపై మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు ఎస్ఐ చిర్ర రమేష్ బాబు ఆదేశాల మేరకు పోలీసులు ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ వెంకటరెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అన్నారు. వాహనదారులు పాదచారులు ప్రయాణం చేసే సమయంలో ఎడమవైపు వెళ్లాలని, రోడ్డు దాటే సమయంలో ఆగి రెండు వైపులా చూసి దాటాలని సూచించారు. బస్సులలో బడికి వెళ్లే పిల్లలను ఎక్కే అప్పుడు దిగే అప్పుడు దగ్గరుండి తల్లిదండ్రులు బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొయ్యడి యాకాంతం గౌడ్, బైరు మల్లేశం, శ్రీనివాస్, కురిమెల సతీష్, రంజిత్, ప్రవీణ్, బత్తిని మురళీకృష్ణ, స్వాములు నాయిని నరేష్, ఉడుత అనిల్, పోలోజు శివ, బత్తిపట్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలను బహుమతిగా ఇచ్చిన ఆటో యూనియన్

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో సిరిపురం ఆటో యూనియన్ నాయకులు తమ గ్రామానికి నాలుగు సీసీ కెమెరాలు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమానికి రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్సై పి.మల్లయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించినారు. అనంతరం రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామాలకు సీసీ కెమెరాలు దిక్సూచిగా ఉంటాయని తెలిపారు. సిరిపురం ఆటో యూనియన్ వారి దాతృత్వాన్ని సీఐ అభినందించినారు. అనంతరం యూనియన్ నాయకులు రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్ల, ఎస్ఐ పి. మల్లయ్య లను సన్మానించినారు. ఇలా మండలంలోని అన్ని గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని, ముందుకు రావాలని అన్ని గ్రామాల నాయకులను, సంఘాల నాయకౌలను రామన్నపేట సీఐ, ఎస్సై లు కోరారు.



## యంసీపీఐ(యూ) పార్టీలో వర్కర్స్ పార్టీ విలీనం




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ బాగ్ లింగం పల్లి ఓంకార్ భవన్ యంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యాలయం లో వర్కర్స్ పార్టీని రద్దు చేసుకొని యంసీపీఐ(యూ) విలీనం చేస్తున్నట్లు వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగాచారి ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, వి. తుకారాం నాయక్ పాల్గొన్నారు. తొలుత వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగాచారి కి పార్టీ కండువా ను కామ్రేడ్ అశోక్ ఓంకార్ కప్పి యంసీపీఐ (యూ) లోకి ఆహ్వానించారు. ఈ చేరికల్లో వర్కర్స్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు వడ్ల అరుణ, వర్కర్స్ పార్టీ ఇబ్రాహీం పట్నం నియోజకవర్గం ఇంచార్జి ఉనుకుంట్ల మురళి లకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పాండురంగాచారి మాట్లాడుతూ యంసీపీఐ(యూ) పార్టీ సామాజిక న్యాయం ఎజెండా కు కట్టుబడి, బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానం తో ఏ పాలకవర్గ బూర్జువా భూస్వామ్య పార్టీలతో ఎన్నికలల్లో కానీ, ఇతర సందర్భంగా కానీ కలవకుండా నీతినిజాయితిగా నిబద్ధతకు పార్టీ కార్యక్రమం ను అమలు చేస్తున్న విధానం, దేశంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టుల ఐక్యత కోసం చేస్తున్న కృషి కి ఆకర్షితులై మా యొక్క పార్టీ అయిన వర్కర్స్ పార్టీని యంసీపీఐ(యూ) లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. యంసీపీఐ(యూ) లో చేరిన వారికి కామ్రేడ్ అశోక్ ఓంకార్ సాదరంగా ఆహ్వానించి యంసీపీఐ(యూ) దేశం లో, రాష్ట్రంలో కమ్యూనిస్టు వామపక్ష సామాజిక శక్తుల ఐక్యత కోసం నిరంతరం చేస్తున్న కృషి కి ఆకర్షితులై పార్టీ లో వర్కర్స్ పార్టీని విలీనం చేయడం యంసీపీఐ(యూ) చేస్తున్న కృషి కి ఒక తోడ్పాటు అందిస్తుంది అని చేరిన వారు పార్టీ నిబంధనలకు కట్టుబడి పని చేయాలని అన్నాడు.

## ఎమ్మెల్యేకు భగవద్గీత బహూకరణ



**విశ్వంభర, మహబూబాబాద్:** నూతన సంవత్సరం సందర్భంగా మహబూబాబాద్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డా.బీ. మురళీ నాయక్ కు కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు శంతన్ రామరాజు భగవద్గీతను బహుకరించారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ భగవద్గీత ఉపనిషత్తుల సారమని, గీతా పఠనం లక్ష్యసాధనకు, పాపహరణకు మార్గమని అన్నారు. ఎమ్మెల్యేగా తన నియోజకవర్గ అభివృద్ధికోసం మురళీనాయక్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వైద్యునిగా మనుషులను బాగుచేసిన మురళీ నాయక్ వ్యవస్థలో ఉన్న అవినీతిపై యుద్ధం ప్రకటించి పేదప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేని కౌరవసైన్యానికి కునుకులేకుండా పోయిందని ఎద్దేవాచేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టనష్టాలను తీరుస్తున్న గొప్ప నాయకుడు మురళీ నాయక్ అని కొనియాడారు. నిరంతర ప్రజాసేవకుడైన మురళీ నాయక్ కు మంత్రివర్గంలో చోటు కల్పిస్తే ఈప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భగవద్గీత పఠనంతో అసురులను జయిస్తూ రాజ్యభివృద్ధి, ప్రజల ఉన్నతిని పెంచే ఆత్మస్థైర్యం సిద్ధిస్తుందన్నారు. స్వపక్షంలోనూ, విపక్షంలోనూ ఉన్న శతృమూకలను చీల్చిచండాడే గొప్పశక్తికి గీత గీటురాయన్నారు. మంచిమనస్సున్న మురళీ నాయక్ కు మానుకోటను బంగారుకోటగా తీర్చిదిద్దే సంకల్పానికి ఆ కృష్ణభగవానుడు అండగానిలిచి ఆదేవదేవుని ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని ప్రార్ధించారు. మురళీ నాయక్ చేస్తున్న సేవలు, అభివృద్ధి ఎప్పటికీ విరాజిల్లుతాయని అన్నారు. అనంతరం మురళీ నాయక్ మాట్లాడుతూ ప్రజలు నాకిచ్చిన బాధ్యతను ఎన్ని ఆటంకాలు ఎదురైనా నెరవేరుస్తానన్నారు. నా ఆశ, ఆశయం, నాజీవితం బడుగుబలహీనవర్గాల అభివృద్ధికే అంకితమన్నారు. నాకోసం కష్టపడ్డ ప్రతిఒక్కరికి సరైన న్యాయం చేస్తానని అన్నారు.ఇంకా ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ అసిఫ్, గండ్రాతి మల్లేష్, గోనె శ్యామ్ రావు, కొండి సాయికిరణ్ నేత, గుంజె హన్మంతు, బొమ్మరాజు కుమారస్వామి, రామిశెట్టి ఉప్పలయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరికాదు



విశ్వంభర, మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వివిధ వర్గాల కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి జి రామయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నేడు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామయ్య మాట్లాడుతూ న్యాయమైన కార్మిక వర్గ సమస్యలను పరిష్కరించటానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా లేదని అన్నారు. గత ఎన్నికలలో కార్మికులకు, ప్రజలకు ఇచ్చిన హామీలులో ఘోరమైన వైఫల్యం ఉందని ఆరోపించారు. దానిని కప్పిపుచ్చుకోవటానికి, కాలయాపన కోసమే అనవసర విషయాలను తెరమీదకి తీసుకొస్తున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్మికులు, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసనలు, సివిల్ సప్లై హమాలీల వేతన జీవోల కోసం, ఉద్యోగుల డీ ఏ ల కోసం ఆందోళనలు చేయక తప్పట్లేదని అన్నారు. ఎన్నికల ముందు అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీలను అమలు లో విఫలం చుస్తే గత పాలకుల బాటలోని కాంగ్రెస్ నడుస్తుందని అన్నారు. కార్మిక వర్గం ఐక్యమై సమరశీల పోరాటాలను తీవ్రతరం చేయాలని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల శ్రమ దోపిడిని పెంచడానికి వారిని కట్టు బానిసలుగా తయారు చేయడానికి నూతన లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చారని అన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా పరిపాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. కార్మిక వర్గం ప్రజలు చైతన్యయుతమైన పోరాటాల ద్వారా మతోన్మాదానికి తగిన గుణపాఠం చెప్పటానికి ఐక్యత రావాలని అన్నారు. అనంతరం గ్రామపంచాయతీ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ స్పందించి కనీస వేతనం అమలు చేయాలని, రైతాంగం వ్యవసాయ కార్మికుల మహిళల నిరుద్యోగులు, విద్యార్థులసమస్యలపై పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా కంటి సూర్యం, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల యాకయ్య, జిల్లా కోశాధికారి కమ్మగాని సంపత్, జిల్లా కార్యవర్గ సభ్యులు నేరేళ్ల బలరాం, అర్వపల్లి వెంకన్న తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



మాదాపూర్ అయ్యప్ప సొసైటి 100 ఫిట్ రోడ్డు లో అక్రమ నిర్మాణం కుల్చివేస్తున్న హైడ్రా అధికారులు (విశ్వంభర, హైదరాబాద్)




## నిరుద్యోగులకు త్వరలో ఉద్యోగాలు

*** భవిష్యత్తు లో భారతదేశం యువతదే**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలను కల్పించడానికి సన్నహాలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టరెడ్డి అన్నారు. బర్కత్పుర ఆవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ప్రజ్ఞా2025 పేరుతో జాతీయ సదస్సును హైదరాబాద్ కాచిగూడ మున్నూరుకాపు సంఘం మ్యాడం ఆంజయ్య హాల్లో నిర్వహించారు. అతిథులుగా ప్రొఫెసర్ ఎం.రామ్మోహన్ రావు, ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసమూర్తి, బీకే వసంతలక్ష్మి, అనుపమ రాజన్, అవంతి కళాశాలల వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టరెడ్డి హజరై మాట్లాడుతూ రానున్న రోజులు భారతదేశం యువతదేనని, విద్యార్థులకు విద్యావకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త ఆలోచనలతో దేశ అభివృద్ధికి తొడ్పాలని, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని సాధించడానికి ఆహర్నిశలు కష్టపడి చదవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆవంతి కళాశాలల అధ్యక్షురాలు ఎం.జ్ఞానేశ్వరి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రియాంక,ఎండీ శ్రవణ్కుమార్,ఉపాధ్యక్షుడు నందీశ్, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ధనంజయ్సింగ్, విద్యాసాగర్, ముద్రిక ఖండేల్వాల్,ప్రిన్సిపాల్ అప్పారావు, సెక్రటరీ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతరావుకు బ్రహ్మకుమారీల శుభాకాంక్షలు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ డీడీ కాలనీలోని మాజీ ఎంపీ హనుమంతరావు ను బ్రహ్మకుమారిస్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట శాఖ డాక్టర్ శ్రీలత,దివ్య సిస్టర్స్. హనుమంతరావు తో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంబుల శ్రీకాంత్ గౌడ్ ఉన్నారు.

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ లోని చంపాపేట్ లో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహా సభ, మహిళ సభ, యువజన సంఘం, వాసవి సేవా దళ రాజకీయ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవ కార్యక్రమానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా షాద్ నగర్ పట్టణానికి చెందిన గందే సురేష్ గుప్తా ఆర్యవైశ్య మహా సభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా నిమతులైనందుకు గాను ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, శంషా బాద్ గణేష్ గుప్తా, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూర్ విశ్వం, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి, జగదీశ్వర్, కల్వ యాదగిరి, ఉప్పల శ్రీనివాస్, యంసాని శ్రీనివాస్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల డిమాండ్లు తీర్చకుంటే సమ్మెకు సిద్ధం

**విశ్వంభర, ఆమనగల్లు:** మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ మున్సిపల్ యూనియన్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఆమనగల్ మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి దీక్షకు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం ఏరియా కన్వీనర్ ఔట్సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్, ఫిక్స్డ్ ఫే, తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందినందరినీ పర్మినెంట్ చేయాలని, రెండవ పీఆర్సీ లో కనీస వేతనం రూ.26,000 లుగా నిర్ణయించాలని, ఆలోపు ఆంధ్రప్రదేశ్లో ఇస్తున్నట్లుగా రూ.21,000 ల వేతనం అమలు చేయాలని, కేటగిరీల వారిగా వేతనాలు ఇవ్వాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ లలో జరుగుతున్న అవకతవకలను నివారించాలని, కార్మికులందరికీ వారాంతపు సెలవులను మరియు లేబర్ డిపార్ట్మెంట్ ప్రతిపాదించిన జాతీయ సెలవులన్నింటిని కార్మికులందరికీ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కొత్త కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు అమలు చేసి క్రమం తప్పకుండా ప్రతి నెల ఇవ్వాలని, కార్మికుల వయస్సు పైబడిన, అనారోగ్యానికి గురైన, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి వారసులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం కోరుతూ నిన్న ఆదివారం 48 గంటల పాటు మున్సిపాలిటీల ముందు దీక్షలు చేపట్టారు. జనవరి 6వ తేదీన కలెక్టరేట్ ముట్టడికి కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కన్వీనర్ జిల్లెల్ల పెంటయ్య, హంసమ్మ, రవి, గోపి, విజయ్, జంగమ్మ సుధాకర్, అంజయ్య, కార్మికులు పాల్గొన్నారు.



# అర్ధనగ్నంగా నిరసన తెలిపిన హమాలీ కార్మికులు

*** సోమవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపు**

**విశ్వంభర, రామన్నపేట:** సివిల్ సప్లై హమాలీ కార్మికులకు పెంచిన కూలీ రేట్ల జి.ఓ ను తక్షణమే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో ఆదివారం సివిల్ సప్లయి హమాలీస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెంచిన కూలి రేట్ల జి.ఓను విడుదల చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న నిరవధిక సమ్మె 5వ రోజు యధావిధిగా కొనసాగింది. ఈ సందర్భంగా 5వ రోజు రామన్నపేట ఎం.ఎల్.ఎస్ గోడౌన్ వద్ద ప్రభుత్వ తీరుకు నిరసనగా హమాలీ కార్మికులు అర్ధనగ్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ, 4 అక్టోబర్ 2024 న సివిల్ సప్లయిస్ కమిషనర్, ఏఐటీయూసీ నాయకుల సమీక్షంలో జరిగిన చర్చలకు సంబంధించిన జీవో కాపీ విడుదల చేయడంలో ప్రభుత్వం, సివిల్ సప్లయిస్ కమిషనర్ పూర్తిగా విఫలం అయ్యారని అయన ఆరోపించారు. 5 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ, కమిషనర్ కు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పెంచిన కూలి రేట్ల జీవోను విడుదల చేయమంటే, సమ్మెను అణిచివేయడానికి అనేక రకాలుగా అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జి.ఓ విడుదల చేసే వరకు సమ్మె యదావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. జీవోను వెంటనే విడుదల చేయాలని రేపు కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న హమాలీలు, స్వీపర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఇమ్రాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ్మా, సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్, ఏఐటీయుసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల సత్తయ్య, శివరాత్రి సమ్మయ్య, హామాలీ సంఘం నాయకులు, ఏఐటీయుసీ జిల్లా ఉఫాధ్యక్షులు గొరిగె నర్సింహ్మా, గొరిగె శంకరయ్య, బండ స్వామి, అంజయ్య, నగేష్, రవి, ఉపేందర్, బాలరాజు, మహేష్, పెంటయ్య, అచ్చాలు, అనిల్, శ్రీను, లింగస్వామి, నర్సింహ్మా, స్లీపర్ సరిత తదితరులు పాల్గొన్నారు.






## ముగ్గుల పోటీలలో తీరొక్క ముగ్గులు

**విశ్వంభర, పరిగి:** పరిగి మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యార్డులో ఆదివారం పూడూరు మాజీ జడ్పీటీసీ మేఘమాల ప్రభాకర్ గుప్తా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు తీరొక్క రంగులు, పువ్వులు కూరగాయలు చిరుధాన్యాలతో అందంగా ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు మున్సిపల్ ఛైర్మన్ ముకుంద అశోక్ కుమార్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. మున్సిపల్ ఛైర్మన్ ముకుంద అశోక్ మాట్లాడుతూ.. సామాజిక చైతన్యం కలిగించే విధంగా తీరొక్క రంగులతో మహిళల ముగ్గులు ఆకట్టుకున్నాయని అన్నారు. ప్రతి సంవత్సరం జనవరిలో ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. గత ఏడాది కంటే ఎక్కువ మంది మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొనడం సంతోషకరమన్నారు. రంగ వల్లులతో తమలోని ప్రతిభను మహిళలు బయట పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇరుముడిలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజా ఇరుముడి కార్యక్రమాలలో భాగంగా మహేశ్వరం మండల కేంద్రం శ్రీ శివగంగ రాజరాజేశ్వరి రాజరాజేశ్వర స్వామి మందిర ప్రాంగణంలో అలాగే సిరిగిరిపురం గ్రామంలో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలో జరిగిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజా ఇరుముడి కార్యమాలకు మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గము ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఆమెకు స్వాములు ఘన స్వాగతం పలికారు. పూజ కార్యక్రమాల అనంతరం ఇరుగ్రామల అయ్యప్పస్వాములు శాలువా మెమోంటోతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మండలం రోజులు దీక్ష చేపట్టిన మీకు స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా మీపై అలాగే మహేశ్వరం నియోజకవర్గ ప్రజలపై ఉండాలని. మీ యాత్ర దిగ్విజయంగా జరగాలని కోరుకుంటున్నానని అన్నారు.కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, మహేశ్వరం :** తెలంగాణ టైలర్స్ అండ్ మగ్గం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ఐడికార్డ్స్ షాపు సర్టిఫికెట్లు, టైలరింగ్ సర్టిఫికెట్లు రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ అన్వర్ రాష్ట్ర ఛైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ అజీమ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీర్ అక్రమ్ అలీ, కార్యదర్శి గడ్డం రాజు, కార్యదర్శి మహమ్మద్ ఇంతియాజ్, వివిధ జిల్లాల సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జీలు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ షేక్ హాజీ బాబా పాల్గొనడం జరిగింది.

## కోశాధికారి బద్రీనాథ్ గుప్తకి ఘన సన్మానం



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం :** రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా ఇబ్రహీంపట్నం కు చెందిన వనపర్తి బద్రీనాథ్ గుప్తా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం చంపపేట్ లోని సామ సరస్వతి గార్డెన్లో వేడుకగా జరిగిన కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్, ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్ పాల్గొని బద్రి నాథ్ గుప్తను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగదీశ్, ప్రశాంత్ యాదవ్, యాదగిరి గౌడ్ , వినోద్ , కిరణ్, శ్రీకాంత్ తదితరులు అన్నారు.

## శ్రీ వాసవి వివాహ సేవా సంస్థ పరిచయ వేదిక

**విశ్వంభర, ఎల్బీనగర్ :** శ్రీ వాసవి వివాహ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వధూవరుల పరిచయ వేడుకను కర్మాన్ఘాట్ లోని లక్ష్మీ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించినట్లు వ్యవస్థాపకులు చంద్రశేఖర్ గుప్త, అధ్యక్షులు నీల సూర ప్రకాష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి రాములు గుప్తా లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు మాత్రమే ఈ సేవా సంస్థ పరిచయ వేదిక ద్వారా ఇరు కుటుంబాలను ఒకే దగ్గరికి చేర్చి వారి వివాహ మహోత్సవానికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. దాదాపు ఆదివారం నిర్వహించిన ఈ పరిచయ వేడుకల్లో 140 మంది వరకు హాజరైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఛైర్మన్ జగినీ శ్రీనివాస్, రిజిస్ట్రేషన్ కమిటీ ఛైర్మన్ వాసుదేవ్, అర్జెంట్ కమిటీ ఛైర్మన్ నాచం సుధాకర్, ఫుడ్ కమిటీ ఛైర్మన్ ఎకుల నరసింహ, రిసెప్షన్ కమిటీ ఛైర్మన్ బాల్రాజ్, మీడియా కమిటీ ఛైర్మన్ వనపర్తి కిషన్ గుప్తా, సలహాదారులు సుభకర్ రావు, దామోదర్ బాలరాజ్, కో ఛైర్మన్ లు రఘుపతి, రాఘవేంద్ర, అనిల్ కుమార్, కృష్ణయ్య బాలరాజు రాజేందర్ మాణిక్యం దుర్గేష్ లింగమూర్తి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మ రక్షణకు క్రమశిక్షణకు కరాటే దోహదం

**విశ్వంభర సంగారెడ్డి:** స్వీయ ఆత్మరక్షణకు క్రమశిక్షణకు కరాటే విద్య దోహదం చేస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం సంగారెడ్డి నియోజకవర్గం కంది మండలం ఎద్దుమైలారం గ్రామ పరిధిలోని ఓడీఎఫ్ సారత్ కమ్యూనిటీ హాల్లో నిర్వాహకులు శ్రీనివాస్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8 వ స్టేట్ లెవెల్ సక్సెస్ శోటోకాన్ కరాటే పోటీలను సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి గారితో కలిసి ప్రారంభించారు. నిర్మలా జగ్గారెడ్డి, నీలం మధు మాట్లాడుతూ యుద్ధకళగా ప్రచారంలోకి వచ్చిన కరాటే వ్యక్తిగత ఆత్మ రక్షణతో పాటు వ్యాయామంగాను పనికొస్తుందన్నారు. మహిళలు తమ రక్షణ కోసం కరాటే ను నేర్చుకోవాలని వారు సూచించారు. కరాటే శిక్షణ అందిస్తూ ఎంతోమంది కరాటే సాధకులను తయారు చేస్తున్న సక్సెస్ షోటోకన్ కరాటే నిర్వాహకులను నీలం అభినందించారు. భవిష్యత్తులో కరాటే యోధులకు పూర్తిస్థాయిలో తన సహాయ సహకారాలు అందిస్తానని నీలం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ ఛైర్మన్ గడిల రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిమామిడి రాజు, తలారి ఈశ్వర్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి,మోకిలా వెంకటేష్, రాజు గౌడ్,బాలు,సతీష్, పాండు,గోపాల్, నిర్వాహకులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.






## మృతుడి కుటుంబానికి మిత్రుల ఆర్థిక సహాయం

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, నీర్నెముల గ్రామానికి చెందిన ఎన్.స్వామి మరణించాడు. విషయం తెలవగానే మృతుడి తో పాటు రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 20032004 బ్యాచ్ కు చెందిన 10వ తరగతి విద్యార్థులు తమ స్నేహితుని కుటుంబ మద్దతు కోసం ఆర్థిక సహకారంగా రూ. 20,000లు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.సతీష్‌కుమార్, ఎన్.లింగస్వామి, కె.చంద్ర శేఖర్, పి.ఉపేందర్, వి.రవి, జి.శేఖర్, ఎస్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ధరఖాస్తుల ఆహ్వానం

*** మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ గోపి**

**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ మహేశ్వరం లో అడ్మిషన్లు పొందుటకు గాను ఆన్లైన్లో ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈ. గోపి ఒక ప్రకటనలో తెలిపారు.202526 విద్యా సంవత్సరానికి గాను 6 నుండి 10వతరగతి అడ్మిషన్ల కొరకు జనవరి 6వ తేదీ నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఆన్లైన్లో ధరఖాస్తుల కొరకు https//telanganaams.cgg.gov.in వెబ్సైట్ లో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఎస్సీ ఎస్టీ బీసీ ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు 125 రూపాయలు ఇతర విద్యార్థులకు 200 రూపాయలు ఆన్లైన్లో పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను ఆన్లైన్లో ఏప్రిల్ 3వ తేదీ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఆరవ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 13వ తేదీన ఉదయం 10 నుండి 12 గంటల వరకు అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తారని అలాగే అదే రోజు 7వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ గోపి తెలిపారు.



## పీఎం కిసాన్ యోజన పథకాన్ని అర్హులకు వర్తింప చేయాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో జరిగిన రైతుల సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్, టీడీపీ మండల నాయకులు బత్తుల సత్తయ్య లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి.యం కిసాన్ యోజన పథకంలో భాగంగా 6,000 రూపాయలను ఇస్తోందని, అయితే పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుండి 2018 డిసెంబర్ వరకు అప్లై చేసుకున్నవారికే ఇస్తోందని, 2018 తర్వాత భూములు మార్పులు, చేర్పులు జరిగి, వారి వారసుల పేరుమీద లేదా ఆ భూములను కొన్నవారి పేరుమీద బదిలీ అయ్యాయని, వారికి పి.యం కిసాన్ యోజన వర్తించడం లేదని, 6 సంవత్సరాల నుండి ఆ పథకంలో చేరే అవకాశం వారికి ఇవ్వలేదని, వారికి ఆ పథకంలో చేరే అవకాశాన్ని కల్పించి, రైతులకు పెట్టుబడి సాయం కింద ఒక వరంలా రైతులకు పంట పండించడానికి ఇవ్వాలని వారు కోరారు. ఇప్పుడున్న రైతులలో చాలామందికి ఆ పథకం వర్తించడం లేదని, మరొకసారి పి.యం కిసాన్ యోజన పథకాన్ని అందరికి వర్తింపచేసేలా రైతుల నుండి ధరఖాస్తులు స్వీకరించి, వారికి అవకాశం కల్పించి రైతులను ఆదుకోవాలని రమేష్, సత్తయ్య కోరారు.

# ఘనంగా బండల మల్లన్న జాతర మహోత్సవం

- మల్లన్న ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్ చేరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ శ్రీ భ్రమరాంబ కేతకి రేణుక ఎల్లమ్మ మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన స్వామి వారి కళ్యాణ మహోత్సవం, జాతరలో ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు జాతరలు ప్రతీక అన్నారు. నియోజకవర్గంలో నూతన దేవాలయాలతో పాటు పురాతన ఆలయాల జీర్ణోద్ధారణకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చేరు మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, గూడెం పల్లవి విక్రమ్ రెడ్డి, మల్లేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం గర్వకారణం

**విశ్వంభర, ఆమనగల్లు:** కల్వకుర్తి బిడ్డ ఉత్తమ పార్లమెంటురియన్ స్వర్గీయ జైపాల్ రెడ్డి పేరును నాలుగు జిల్లాలను పూర్తిస్థాయిలో సస్యశ్యామలను చేసి వ్యవసాయ రంగంలో మరియు త్రాగునీరు సమస్యను తీర్చే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కు మన ప్రాంతానికి చెందిన తెలంగాణ సాధకుడు ప్రజాస్వామ్యవాదిగా పిలువబడే కాంగ్రెస్ నాయకుడు జైపాల్ రెడ్డిని వచ్చేతరం గుర్తించే విధంగా జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తెలంగాణ ప్రభుత్వ క్యాబినెట్ ఏకగ్రీవ తీర్మానం చేయడం సంతోషించదగ్గ విషయం, ఇందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు, మంత్రులకు కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, గూడూరు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



# టర్కోయిస్ ఫిట్‌నెస్ ప్రో జిమ్ ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** హిమాయత్ నగర్ డివిజన్ హైదేరాగూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ దారి విట్టల్ వాడీ ప్రధాన దారి లో టర్కోయిస్ ఫిట్‌నెస్ ప్రో జిమ్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. నిర్వాహకుడు అర్జున్ కేంద్ర మంత్రి కి పుష్ప గుచ్చం తో స్వాగతం పలకాడు. ప్రారంభం చేసి కాసేపు జిమ్ పరికరాల పై కసరత్తు చేసి వాకింగ్ చేశాడు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు తప్పకుండా వ్యాయామం చేయాలని, రోజుకు ఒక గంట తప్పకుండా ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని సూచన చేశాడు కిషన్ రెడ్డి.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్లు మహాలక్ష్మి, అమృత,రామన్ గౌడ్, నర్సింహా, నర్సింగ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డోకూరికి టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి పరామర్శ

**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి సోదరుడు నరేందర్ రెడ్డి ఇటీవల మరణించారు. ఆదివారం ద్వాదశ దినకర్మ సందర్భంగా టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి డోకూరు ప్రభాకర్ రెడ్డిని పరామర్శించారు. అనంతరం డోకూరి నరేందర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకట్రాం రెడ్డి ,శ్యాంసుందర్ రెడ్డి ,నరేందర్ గౌడ్ ,రచ్చ శ్రీరాములు ,మాజీ అధ్యక్షులు మండ్లి రాములు,శ్రీనివాస్ రెడ్డి ,యువజన నాయకులు రాజశేఖర్,ఇమ్రాన్ బాబా,సీనియర్ నాయకులు లక్ష్మణ్ నాయక్,దాస్ నాయక్,బాలు నాయక్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ఈ నెల 20 ఎంఆర్ఓ కార్యాలయం ముట్టడి

**విశ్వంభర, మహబూబ్ నగర్:** అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 ఎంఆర్ఓ కార్యాలయం ముట్టడి చేపట్టారు. ఎంఆర్ఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం కరపత్రాన్ని ప్రొఫెసర్ అరగోపాల్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012 ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 60 గజాల ఇంటి స్థలం వాటి స్థానంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని పట్టా సర్టిఫికెట్లను తిరిగి స్వాధీన పరుచుకొని నేటికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా సొంత జాగా లాగా అమ్ముకున్న అధికారులపై ప్రజాప్రతినిధులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గత పది సంవత్సరాల నుండి అర్హులందరికీ న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని 886 మంది డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందుటకు అరువులుగా నిర్ధారిస్తూ అప్పటి ప్రభుత్వం జాబితాను విడుదల చేయడం జరిగింది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా అప్పటి మంత్రి నిబంధనలకు విరుద్ధంగా అర్హులు కాని వారికి పంచిపెట్టారు రెవిన్యూ అధికారులు కూడా ఎలాంటి విచారణ చేయకుండా సొంత భూమిలాగా ఇళ్లను పంపిణీ చేశారు. ఈ పంపిణీలో జరిగిన అవినీతి అక్రమాలను బయటకు తీసి అధికారుల పై అప్పటి ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.

మహబూబ్ నగర్ అర్బన్ పరిధిలో వేల ఎకరాల భూమి ప్రభుత్వ భూమి ఉంది ఆ భూమిలో ఎవరెవరు ఆక్రమించుకున్నారు. ఎంత ఆక్రమించుకున్నారో ఏం చేస్తున్నారో కూడా మండల ఎమ్మార్వో కు సమాచారం లేదని ఆయన విమర్శించారు. ప్రైవేట్ వ్యక్తులకి వేల ఎకరాలు కట్టబెట్టి పేద నిరుపేద కుటుంబాలకు 60 గజాలు స్థలం ఇచ్చి గుంజుకొని వారికి న్యాయం చేయకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని 523 సర్వే నెంబర్లు ఇంటి స్థలం పట్టా తీసుకొని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన ప్రజా ప్రతినిధులపై అధికారులపై చర్యలు తీసుకోవాలి. మహబూబ్ నగర్ అర్బన్ పరిధిలో ప్రభుత్వ భూములు ఎవరెవరు ఆధీనంలో ఉంది ఎంత భూమి మిగిలి ఉందని శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ ద్వారాల నుండి ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 15 లక్షల రూపాయలు ఇవ్వ లని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్పీవో మాజీ జిల్లా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి టీఎఫ్ టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఖలీల్ జిల్లా అధ్యక్షులు పి విజయకుమార్ , టౌన్ ప్రధాన కార్యదర్శి జలాల్ పాషా, నాయకులు రామ్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి నూతన సంవత్సర క్యాలెండర్ బహూకరణ



**విశ్వంభర, హైదరాబాద్:** చిల్కానగర్ డివిజన్లోని బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం సభ్యులు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి గారికి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ... సంఘం క్యాలెండర్ ని బహూకరిస్తూ కుమ్మరి సంఘం అభ్యున్నతికి వారి సంఘం భవనానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారం ఉండాలని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి భానుచందర్, కోశాధికారి కుమార్ మరియు వారి సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మాజీమంత్రి జగదీష్ రెడ్డి

*** పేటలో 118 బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత**



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం లో ఆదివారం మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం వ్యాప్తంగా పలు రకాల ప్రమాదాలు, అనారోగ్యంతో వైద్య ఖర్చుల నిమిత్తం వచ్చిన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ద్వారా దళితులకు మేలు



**విశ్వంభర, కడ్తాల్:** ఇటీవల నూతనంగా రంగారెడ్డి జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులుగా ఎన్నికైన పంది పెంటయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని హైదరాబాదులోని అంబర్పేట్ లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మండల ఎస్సి సెల్ అధ్యక్షులు పోతుగంటి అశోక్, మాజీ సర్పంచ్ పోతుగంటి శెంకర్ పాల్గొన్నారు. అనంతరం ప్రీతం కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలో గౌ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళితుల కోసం అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వస్తుంది, దళితులకు ఎస్సి కార్పొరేషన్ ద్వారా నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని తెలియజేశారన్నారు. కార్యక్రమంలో ఈర్లపల్లి జగన్, శ్రీను,రమేష్, పాల్గొన్నారు.

## గాంధీ భవన్ లో ఘనంగా రైతు భరోసా సంబరాలు




**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాలు అమలు చేస్తుండడం పట్ల టీపీసీసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ రోజు గాంధీ భవన్ లో ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇస్తామన్న హామీని నెరవేర్చుతుందని హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులు మిఠాయిలు పంచుకొని సంబరాలు చేశారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వే సత్యనారాయణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**విశ్వంభర, బోడుప్పల్:** గౌతమ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ కేంద్ర మంత్రివర్యులు సర్వే సత్యనారాయణ ని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ కాలనీ అధ్యక్షులు భూపతి సారయ్య, ప్రధాన కార్యదర్శి ఈ ముత్యాలు, ఉపాధ్యక్షులు ఉపేందర్ చారి మరియు కాలనీ సలహాదారుడు ఎండి గఫర్ కార్యదర్శులు పి రవి, అంజి, సత్యనారాయణ, జి సత్తయ్య, నవీన్, ప్రవీణ్, ప్రతాప్, బాలస్వామి, ముత్యాలు, కాలనీవాసుల అందరూ పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



## నదుల అనుసంధానం మహబూబ్ నగర్ జిల్లాను ఎడారిగా మారుస్తుంది



**విశ్వంభర, మహబూబ్ నగర్:** నేడు టీఎన్జీవో భవనంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో వేదిక మహబూబ్ నగర్ జిల్లా కన్వీనర్ ఎ.తిమ్మప్ప అధ్యక్షతన పాలమూరు డిండి ప్రతిపాదనను, నదుల అనుసంధానాన్ని వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ హరగోపాల్ ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పాలమూరు డిండి ప్రతిపాదనను ఆమోదించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఇది అమల్లోకి వస్తే మహబూబ్ నగర్ జిల్లా తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ కాలం అంతా కూడా మహబూబ్ నగర్ జిల్లా కరువు, నీటి సమస్య పైన తెలంగాణ అన్ని జిల్లాలలో చర్చ జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకుని 11 సంవత్సరాలు గడుస్తున్న కృష్ణానదిలో మహబూబ్ నగర్ నీటి వాటకు సంబంధించి న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. ఉద్యమ పార్టీగా అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలమూరు రంగారెడ్డి ప్రతిపాదనను పూర్తిగా మార్చి వేసి కృష్ణా నదిలో మహబూబ్ నగర్ నీటి వాటను అందకుండా చేసిందని తెలిపారు. కేసీఆర్ నియంత్రుత్వ పాలనను నిరసించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన తీసుకొని వస్తుందని ఆశించి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకోవచ్చారన్నారు. నీటి పంపిణీలో శాస్త్రీయ పద్ధతి అనుసరించకుండా మహబూబ్ నగర్ జిల్లాకు అన్యాయం చేసే డిండి ఎత్తిపోతల పథకాన్ని ఆమోదించడము అనుచితమైన చర్యగా ఆయన తెలిపారు. జిల్లా వాసి ముఖ్యమంత్రిగా ఉండి ఈ జిల్లాకు అన్యాయం చేస్తే చరిత్రలో రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు అన్యాయం చేసిన వాడిగా మిగిలిపోతాడని హితవు పలికారు. మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గానికి నీరు అందించడంలో బీఆర్ఎస్ విఫలమైందని, కాంగ్రెస్ పార్టీ కూడా అదే దారిలో పయనిస్తే చరిత్ర క్షమించదన్నారు.పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవచారి మాట్లాడుతూ గోదావరి కృష్ణా కావేరి అనుసంధానం మహబూబ్ నగర్ నీటి సమస్యలు పరిష్కరించేది కాకుండా మరిన్ని కొత్త కారణం అవుతుందని ఆయన తెలిపారు. ప్రముఖ తెలంగాణ ఉద్యమ నాయకులు, టీజేఏసీ కన్వీనర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో భీమా 2, కోయిల్ సార్ ఎత్తిపోతల పథకాలు మాత్రమే ఉన్నాయని ఈ రెండు పథకాలు మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గం భూములకు సాగునీరందియ్యడంలో వీటి సామర్థ్యం సరిపోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ డిండి ప్రతిపాదన గురించి పునరాలోచన చేయాలని కోరారు.సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా నీటి వనరుల న్యాయమైన పోరాటం కోసం తమ పార్టీ పూర్తిస్థాయిలో సంఘీభావం తెలుపుతుందన్నారు. టీ ఎఫ్ టీ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ మాట్లాడుతూ వందల సంవత్సరాలుగా కరువు, వలసలకు నిలయమైన మహబూబ్ నగర్ జిల్లాను నీళ్లు లేకుండా చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఇప్పటికే మహబూబ్ నగర్ పట్టణంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు శ్రీశైలం,ఆదిత్య, వామన్, కుమార్, టీపీఎఫ్ నాయకులు బుచ్చారెడ్డి, సీపీఐ నాయకులు పరమేష్, ప్రముఖ ప్రజా కవి జన జ్వాల, సామాజికవేత్త అనీఫ్ అహ్మద్, టిఎఫ్టియు నాయకులు పి విజయ కుమార్, జలాల్ పాషా, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు కేసి వెంకటేష్, వెంకట్రాములు, జి వెంకట్ గౌడ్, కే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.ప్రజా కళాకారులు జక్కగోపాల్, వన్నాడా అంజన్న పాలమూరు కరువు పై పాటలు పాడారు.సమావేశానంతరం స్థానిక తెలంగాణ చౌరస్తాలో పాలమూరు అధ్యయన వేదిక, సీపీఐ ఇతర ప్రజా సంఘాల నాయకులు తెలంగాణ క్యాబినెట్ మంత్రుల నిర్ణయాన్ని నిరసిస్తూనిరసన తెలిపారు.

## అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద కుటుంబానికి ఆర్థికసహాయం

*** సహాయాన్ని అందజేసిన మొగుళ్ళ రాజిరెడ్డి**



**విశ్వంభర, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని పెద్దరాజుపేట గ్రామంలో మేకల రమేష్ (35) అనారోగ్యంతో హైదరాబాదులోని హాస్పిటల్ లో చనిపోగా ఆదివారం ఉదయం తన స్వగ్రామమైన పెదరాజుపేటకు తీసుకురావడం జరిగింది. గత రెండు సంవత్సరాల క్రితం ఇద్దరూ ఆడపిల్లల చిన్నతనంలో ఉన్నప్పుడే రమేష్ భార్య కూడా అనారోగ్య కారణాలవల్ల మృతి చెందడం జరిగింది. తన భార్యను బతికించుకునేందుకై రమేష్ తనకున్న కొద్దిపాటి భూమిని మరియు తన ప్లాటును అమ్ముకున్నాడు. ఎన్ని లక్షలు ఖర్చు చేసినా కూడా ఫలితం లేకుండా పోయింది. తర్వాత బతుకుదెరువు గురించి తన తల్లిని మరియు పిల్లలను తీసుకొని హైదరాబాదులో స్వీపర్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే తను కూడా అనారోగ్యం పాలై హాస్పిటల్ లో చూపించుకునేందుకు డబ్బులు లేక తనలో తానే కుమిలిపోయి తన ఇద్దరు పిల్లల్ని అనాధాలుగా చేసి చనిపోయాడు. తనది ఆర్థికంగా చాలా నిరుపేద కుటుంబం అని,వారి కుటుంబాన్ని ఆదుకోవాలనే విషయాన్ని ఐ ఐ ఎన్ టీ యు సీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ళ రాజిరెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించగా.. వెంటనే స్పందించి మానవతా దృక్పథంతో రమేష్ దహన సంస్కారాల నిమిత్తం ఐదువేల రూపాయలను పంపించడం జరిగింది. భవిష్యత్తులో తన ఇద్దరు పిల్లల చదువుల నిమిత్తం స్కూలు ఫీజును కూడా అనే సమకూరుస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మొగుళ్ల రాజన్న యువసేన చేర్యాల మండల నాయకులు,సోషల్ మీడియా టీం మెంబెర్స్ మేడిపల్లి చందు, ఎం.రమేష్ చారి, సొంటె రమేష్, సొంటె కిరణ్ కుల పెద్దలు అంకని స్వామి,పాపి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు మేకల నర్సింలు మేకల స్వామి, మేకల ఆనందం మరియు చింతకింది నర్సింలు, చింతకింది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణతో అట్టడుగు వర్గాలందరికీ న్యాయం




**విశ్వంభర, హైదరాబాద్ :** ఎస్సీ వర్గీకరణతో అట్టడుగు వర్గాలకు అందరికీ న్యాయం జరుగుతుంది అని మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షులు ఆరెపల్లి రాజేందర్ అన్నారు. ఆదివారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ మేధావుల పురం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి భరత్ భూషణ్, మాదిగ మేధావుల పురం అధ్యక్షులు ఆరెపల్లి రాజేందర్, ప్రొఫెసర్ చింతకింద కాశీం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. భారత అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ రిజర్వేషన్ జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిందన్నారు. సామాజిక న్యాయం సమకూరాలంటే వర్గీకరణ జరగాల్సిందే అని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం అట్టడుగు వర్గాలు అందరికీ న్యాయం జరగాలనీ న్యాయమూర్తులు అభిప్రాయపడి తీర్పు ఇచ్చారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మద్దతు ప్రకటించి కావాల్సిన చర్యలను వెంటనే ప్రారంభించి క్యాబినెట్ సబ్ కమిటీ వేశారని హైకోర్టు రిటైర్డ్ జడ్జితో ఏకసభ్య కమిషన్ వేశారన్నారు. ఈ నివేదిక తీసుకొని వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణతో ఒక మాల మాదిగలే కాకుండా మిగతా అన్ని ఉపకులాల కు 59 కులాల అట్టడుగు వర్గాల కు లబ్ధి చేకూరుతుందని ఇంతవరకు విద్యా రాజకీయాలలో ప్రాధాన్యత లేనటువంటి అట్టడుగు వర్గాలకు అవకాశాలు వస్తాయని అందువలన మాల సోదరులు పెద్దన్న పాత్ర పోషించి దీనికి అడ్డుపడకుండా పునరాలోచన చేసుకొని అందరికీ న్యాయం జరిగే విధంగా సామాజిక న్యాయానికి పునాదులు వెయ్యాలని అభివృద్ధికి దోహదం చేయాలని కోరారు. వర్గీకరణను సమర్థించి షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల పెంపు కొరకు ఐక్యతతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు పల్లెల వీరస్వామి, రిటైర్డ్ రైల్వే మేనేజర్ డా .చీమ శ్రీనివాస్, సామర్ల కిరణ్, డిప్యూటీ కలెక్టర్ రిటైర్డ్ ఉపాధ్యక్షులు ఏ సాయిబాబా, రిటైర్డ్ జీఎం జె నర్సింగరావు, డిప్యూటీ డైరెక్టర్ రిటైర్డ్ నరసయ్య, సోషల్ ఆక్టివిటీస్ మోలుగు రాజు, ప్రతినిధి ట్రెజరర్ బెజ్జంకి రాంబాబు, గడ్డ యాదయ్య, వషపాక నరసింహ, చిలక భాస్కర్ , గౌతమ్ రాజు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి అవార్డ్స్ 2025 ప్రదానోత్సవం




**విశ్వంభర, సూర్యాపేట:** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి ని పురస్కరించుకొని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టి.ఎం.ఎస్.టి.ఎ) సూర్యాపేట జిల్లా ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న సావిత్రిభాయి అవార్డ్స్ 2025 ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా వ్యాప్తంగా ఎంపికైన ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాళ్లకు అవార్డ్స్ ను ప్రదానం చేసిన మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి. జగదీష్ రెడ్డి మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మహిళా సావిత్రి బాయి పూలే అని అన్నారు.తొలి మహిళా ఉధ్యాయురాలిగా ఆమె జీవితం అందరి ఆదర్శనీయమని,మహిళల చైతన్యంతోనే సమాజంలో పూర్తిస్తాయి అభివృద్ధి జరుగుతుందన్నారు.మహిళలు అన్నిరంగాలలో రానించాలన్న సావిత్రిబాయి ఎన్నో పోరాటాలు చేశారని,మహిళలను విద్యావంతులను చేయాలన్న మహాత్మా జ్యోతిరావ్ పూలే గొప్ప ఆలోచనతో ముందుగా తన సతీమణి నే చదివించి ఉపాధ్యాయురాలిని చేశాడని అన్నారు.అయన మార్గంలోనే సావిత్రి బాయి ఎంతోమంది మహిళలను చైతన్య వంతుల్ని చేసిందని కొనియాడారు.ఇంటిని చక్కదిద్దినట్టే సమాజాన్ని చక్కదిద్దడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అటువంటి మహిళా ఉపాధ్యాయురాళ్లను సత్కరించుకోవడం గొప్ప విషయన్నారు. ఇంతటి కార్యక్రమాన్ని చేపట్టిన టి.ఎం.ఎస్.టి.ఎ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది ఇటువంటి కార్యక్రమాన్ని మరింత వైభవంగా నిర్వంచుకుందామని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే


*** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే ముఖ్య పాత్ర**




**విశ్వంభర, సూర్యాపేట:** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని అన్నారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి ని పురస్కరించుకొని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీ.ఎం.ఎస్.టీ.ఏ) సూర్యాపేట జిల్లా ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు అధ్యక్షతన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సావిత్రిభాయి పూలే అవార్డ్స్ 2025 ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా వ్యాప్తంగా ఎంపికైన ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాళ్లకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే అన్నారు. తొలి మహిళా ఉధ్యాయురాలిగా ఆమె జీవితం అందరి ఆదర్శనీయమని అన్నారు. మహిళల చైతన్యంతోనే సమాజంలో పూర్తిస్తాయి అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మహిళలు అన్నిరంగాలలో రానించాలని సావిత్రిబాయి ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. మహిళలను విద్యావంతులను చేయాలన్న మహాత్మా జ్యోతిరావ్ పూలే గొప్ప ఆలోచనతో ముందుగా తన సతీమణి నే చదివించి ఉపాధ్యాయురాలిని చేశాడని, అయన మార్గంలోనే సావిత్రి బాయి ఎంతోమంది మహిళలను చైతన్య వంతుల్ని చేసిందని కొనియాడారు. ఇంటిని చక్కదిద్దినట్టే సమాజాన్ని చక్కదిద్దడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అటువంటి మహిళా ఉపాధ్యాయురాళ్లను సత్కరించుకోవడం గొప్ప విషయమని తెలిపారు. మహిళా ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని చేపట్టిన మోడల్ స్కూల్ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది ఇటువంటి కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వంచుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సి పూల రవీందర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చల్లమల్ల నర్సింహ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దామెర శ్రీనివాస్, రాధాకృష్ణ, వేణుగోపాల్ రెడ్డి, సౌజన్య, పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా జరిగిన పంబారట్ వేడుకలు

*** హాజరైన అయ్యప్ప స్వాములు, మహిళలు**



**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో అయ్యప్పస్వామి పంబారట్టు మహోత్సవం పండితులు నాగరాజు, ఆలయ అర్చకులు సత్యనారాయణ గ్రామంలోని మాలధారణ భక్తులు వైభవంగా నిర్వహించారు. శివకేశవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అయ్యప్పను అలంకరించి ఊరేగింపు వాహనంపై ప్రతిష్ఠించారు. గ్రామంలోని శివాకేశవాలయం నుంచి దీక్షాపరులు, భక్తుల ఆధ్వర్యంలో స్వామి ఊరేగింపు వైభవంగా ప్రారంభించారు. మహిళలు మంగళహారులతో స్వాగతం పలకగా భక్తులు మొక్కులు సమర్పించారు. అయ్యప్ప మాలాధారణ స్వాములు భక్తి పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. అనంతరం పవిత్ర గోదావరి నదిలో అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్ఠించి పండితులు నాగరాజు శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ అయ్యప్పస్వామిని కొలుస్తూ పాలు, పెరుగు, నెయ్యి, భస్మం(విభూది), పంచదార, చందనం, పసుపు, పండ్లు, తేనె, జలంతో వేలాదిగా తరలివచ్చిన మాళదారులు, భక్తుల సమక్షంలో అభిషేకం చేశారు. అనంతరం అయ్యప్పస్వామి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు పొడి శెట్టి రమేష్ బండం విశ్వాస్ రెడ్డి మరియూ కన్య స్వాములు కత్తి స్వాములు గంట స్వాములు గధ స్వాములు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రెడ్డి సంఘం జిల్లా యువజన విభాగాన్ని ఏర్పాటు చేయాలి

**- ఎమ్మెల్యే నాయిని**



**విశ్వంభర, వరంగల్:** కాజీపేట మండలం మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్ లో వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదిరెడ్డి రవీందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రెడ్డి సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కూడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి మరియు రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులందరితో కలిసి నూతన సంవత్సర డైరీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మీ అందరి ఆశీర్వాదంతో ఈ రోజు నేను ఎం.ఎల్.ఏ. గా గెలుపొందాను. నన్ను ఎం.ఎల్.ఏ. గా గెలిపించిన మీ అందరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. రెడ్డి సంఘం యువజన విభాగం కూడా ఒకటి మరొకటి మహిళా విభాగం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రతి మూడు నెలలకొకసారి కాకుండా నెలకొకసారి మన సంఘం మీటింగ్ ఏర్పాటు చేసి సంఘం అభివృద్ధికి ఏమైనా సలహాలు సూచనలు ఉంటె తెలియ చేయాలి.కొన్ని చోట్ల మన రెడ్డి సంఘం ఉన్నదని కూడా తెలవదు కొన్ని చోట్ల సభ్యత్వాలు లేవు.కావున కమిటీ సభ్యులు ఈ విషయాన్నీ పరిగానలోనికి తీసుకొని యువజన విభాగాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు హనుమా రెడ్డి, చాడ సునీల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, వసుంధర, సత్యనారాయణ రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, సంపత్ రెడ్డి, వరద రెడ్డి, తిరుమల రెడ్డి, సీతారాం రెడ్డి, రాం గోపాల్ రెడ్డి, సంజీవ రెడ్డి, కన్నా రెడ్డి, వీరా రెడ్డి, సుధీర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నాయిని అమరేందర్ రెడ్డి, నాయిని లక్ష్మా రెడ్డి, పల్లె రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్ లింగ బలిజలను ఓబీసీలో చేర్చాలి



**విశ్వంభర, రామన్నపేట:** వీర శైవ లింగాయత్ లింగ బలిజలను ఓబీసీలో చేర్చాలని వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకటాల సోమేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో ఆ సంఘం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయత్, లింగ బలిజలను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రత్యేకమైన సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు జుడుగుల ఆడవప్ప, పురాణమఠం మల్లికార్జున్, పట్టణ అధ్యక్షులు మోకాళ్ళ వీరేష్, అమీరిశెట్టి భద్రయ్య, రామ్ శివకుమార్, గోధుమల సంగప్ప, బాపూరి మల్లికార్జున్, ఆళ్ల బాలకృష్ణ, పొగాకు కొండయ్య, ఏనుతుల రమేష్, పల్లం మనోజ్ కుమార్, భద్రప్ప, అన్నపూర్ణ, భాగ్యమ్మ, సరిత, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ మానక్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన విద్యార్థిని



**విశ్వంభర, చింతపల్లి :** ఈనెల 3, 4 తేదీల్లో నలగొండలోని డాన్ బోస్కో ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో చింతపల్లి మండలం కుర్మపల్లి జడ్పీహెచ్ఎస్ పదో తరగతి చదువుతున్న A. శివ తులసి ప్రదర్శించిన సేఫ్టీ ఎలక్ట్రిక్ స్ట్రీట్ పోల్ అనే ప్రాజెక్టు స్టేట్ లెవెల్ కి ఎంపికైన సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని మరియు మెమొంటోను అందజేశారు. ఈ ప్రాజెక్టు గైడ్ టీచరుగా వున్న సిలివేరు నారాయణ మాట్లాడుతూ వర్షాకాలంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా కరెంటు స్తంభాలకుండా కరెంటు ప్రవహించడం ద్వారా అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారని దానిని నివారించడానికి ఏర్పాటు చేసిందే ఈ ప్రాజెక్టు అని ఆయన అన్నారు. ముఖ్యంగా కరెంటు స్తంభంలో కరెంటు ప్రవహిస్తున్నప్పుడు అలర్ట్ చేయడానికి హెచ్చరికగా రెడ్ లైట్ ను అమరచడం జరిగిందని మరియు దానిని కూడా గమనించకుండా కరెంటు పోల్ దగ్గరికి వెళ్తే బీప్ సౌండ్ వస్తుందని కావున ఎవరు కూడా కరెంటు ప్రవహిస్తున్న స్తంభాన్ని ముట్టుకోకుండా తద్వారా ప్రమాదాలకు గురికాకుండా ఉంటారని ఆయన తెలియజేశారు. ఈ ప్రాజెక్టు స్టేట్ లెవెల్ కి ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు, పాఠశాల సిబ్బంది మరియు గ్రామస్తులు ఆ విద్యార్థిని అభినందించారు.

## డి.సి.సి.బి నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఆదివారం హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టేస్కాబ్ బ్యాంక్ డీసీసీ బ్యాంక్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే నాగరాజు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట పాక్స్ చైర్మన్ రాజేష్ ఖాన్నా, 56 డివిజన్ అధ్యక్షుడు కొంక హరి బాబు,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందుకూరి పూర్ణ చందర్, రామంచ ఐలయ్య, రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## హెడ్మాస్టర్ పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి: కేవీపీఎస్



**విశ్వంభర, మహేశ్వరం :** రాష్ట్ర రాజధానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భక్తి ముసుగులో బడి పంతులు పై డిసెంబర్ 23న అమానుషమైన దౌర్జన్యం ను ఖండిస్తున్నట్లు కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా కమిటీ తెలిపింది. ఆదివారం కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించారు. సందర్భంగా జిల్లాలో ఉన్నటువంటి వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని హెడ్మాస్టర్ పైన చేసిన దాడిని ఖండించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మస్కు ప్రకాష్ కారత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బోడ సామెల్ మాట్లాడుతూ కఠినంగా శిక్షించాలని అన్నారు. సమావేశంలో ఐద్వా నాయకురాలు సుమలత, విజయమ్మ, ఉమా, నాయకులు రవికుమార్, బాల్ రాజ్, శేఖర్, కాంగ్రెస్ నాయకులు బాకీ జాన్, ఎర్ర గణేష్, తరంగ్, ఆనంద్, తిరుపతయ్య, బాలరాజ్, ప్రసాద్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆల్ ఆర్ట్స్ సొసైటీ జాతీయ కళాశాంగమం కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల నృత్యాలు అలరించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ ప్రసంగించి చిన్నారులను అభినందించాడు.

- విశ్వంభర, హైదరాబాద్




## విద్యార్థులు బాగా కష్టపడి చదవాలి: బి దామోదర్

**విశ్వంభర, చౌటుప్పల్:** విద్యార్థులు బాగా కష్టపడి చదవాలని విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి దామోదర్, విశ్రాంత డిగ్రీ కళాశాల లెక్చరర్ డి కృష్ణమూర్తిలు అన్నారు. ఆదివారం భరత్ భూషణ్ అగర్వాల్ జయంతి నీ పురస్కరించుకొని ఆయన పేరు మీద ఆయన కుమారుడు రాహుల్ కొయ్యలగూడెం, డి నాగారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ .25 వేల విలువైన వస్తువులను అందజేశారు. అనంతరం రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పోలిశెట్టి రమేష్, జాతీయ మహిళా ఉపాధ్యాయులు శివ జ్యోతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాదిగ విద్యార్థి యువగర్జన సన్నాహక సమావేశం



**విశ్వంభర, ఘట్కేసర్ :** మండల కేంద్రంలో డాక్టర్ మల్లేశం ఆధ్వర్యంలో మాదిగ విద్యార్థి యువగర్జన సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరై ప్రసంగించారు. ఫిబ్రవరి 2న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ఎస్ కాలేజ్ ఆవరణంలో మాదిగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ విద్యార్థి యువగర్జన సభను వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ రాజకీయ వేదిక అధ్యక్షులు వక్కల గడ్డ చంద్రశేఖర్, తెలంగాణ దళిత బహుజన సమితి అధ్యక్షులు గజ్జెలి మల్లికార్జున్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రూ నరసింహ, తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి అధ్యక్షులు బొమ్మెర స్టాలిన్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, మాదిగ జేఏసీ నాయకులు దేవరకొండ నరేష్ జోగు గణేష్ మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మారుతి గుప్తాకు లైన్స్ క్లబ్ పురస్కారం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, లయన్స్ ప్యారడైజ్ స్టార్స్, పిచ్ క్లబ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లయన్స్ భవన్ లో వివిధ రంగాల్లో రాణిస్తున్న సంస్థలకు పురస్కారాలు ప్రదానం చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ నారాయణ స్వామి మాట్లాడుతూ యువతను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. అత్యుత్తమ కంప్యూటర్ శిక్షణ సంస్థ పురస్కారం మారుతి టెక్నాలజీస్ ఎండీ మారుతి గుప్తా అందుకున్నారు. శివ, సుమన్, ఆత్రేయ, సతీష్, వంశీ, సంతోష్, సారిక, కిరణ్, జయ్ పాల్ రెడ్డి పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు.

## మల్లు భట్టి విక్రమార్కకు స్వాగతం పలికిన వరంగల్ కుడా చైర్మన్



**విశ్వంభర, వరంగల్:** పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో జీడబ్లూసీ 15వ డివిజన్ మొగిలిచర్ల, గొర్రెకుంట, విశ్వనాధపురం గ్రామాలలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాల శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కుడా చైర్మన్ మాట్లాడుతూ భట్టి విక్రమార్క తో పాదయాత్ర చేసిన సందర్భంగా పరకాల నియోజకవర్గంలోని అనేక సమస్యలను విన్నవించానని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చెప్పిన ప్రతీ హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కష్టపడి పని చేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, శాసన మండల సభ్యులు బసవరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్పీడీసీఎల్ చైర్మన్ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైలారంపై అక్రమ మైనింగ్ ఆపాలి



**విశ్వంభర, హైదరాబాద్:** మైలారం గుట్టకు చారిత్రాత్మక ప్రాధాన్యత ఉందని ఈ గుట్టపై అక్రమ మైనింగ్ ను ఆపాలని మైలారం గుట్ట పరిరక్షణ పోరాట కమిటీ అధ్యక్షులు గుండాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మైలారం గుట్ట పరిరక్షణ పోరాట సమితి నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పర్యావరణ వేత్త శాస్త్ర వేత్త బాబురావు ప్రొఫెసర్ హరగోపాల్, న్యాయ సలహాదారులు అడ్వకేట్ లక్ష్మణ్ లు మాట్లాడుతూ మైలారం గుట్ట అతి ప్రాచీనమైంది అన్నారు. దీనికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ఈ గుట్టపై నిరుపేదలు ఇండ్లు నిర్మాణం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. పక్కన నాలుగైదు గ్రామాలకు ఈ గుట్ట జీవనాధారంగా ఉందని అటువంటి గుట్టను అక్రమ మైనింగ్ తో ఆక్రమించాలని చూస్తున్నారన్నారు. అక్రమ మైనింగ్ ను వెంటనే ఆపాలని ప్రకృతిని కాపాడాలని కోరారు. లేనిపక్షంలో ప్రకృతి ప్రకోపానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అధ్యక్షులు గుండాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. మైలారం గుట్టపై చుట్టుపక్కల రైతులు తమ పశువులను మేకలను మేత కోసం తీసుకువస్తారని పచ్చని చెట్లు వివిధ రకాల పండ్ల చెట్లు ఉన్నాయని జాతీయ పక్షి నెమళ్లు దుంపలు జింకలు వన్యప్రాణులకు నిలయంగా గుట్ట ఉందన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయం కూడా గుట్టపై ఉందని ముస్లిం సమాధులు కూడా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనం క్రీడా ప్రాంగణం లక్షల రూపాయల ఖర్చు చేసి గుట్టపై ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ మైనింగ్ జరుగుతుండడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని డంపింగ్ యార్డ్ కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు ప్రభుత్వం దాదాపు 4500 కోట్లతో నిర్మిస్తున్న ఉమామహేశ్వరం రిజర్వాయర్ కూడా ఈ గుట్టకు అనుకొని నిర్మించనున్నారు. ఈ మైనింగ్ వల్ల రిజర్వాయర్ కు కూడా ప్రమాదం ఉందన్నారు. మైలారం గుట్టపై ఇచ్చిన మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గుట్టపై జరుగుతున్న మైనింగ్ పనులు నిలిపివేసి ప్రజలు జీవించే హక్కు కాపాడాలన్నారు. జీవా వరణాన్ని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలారం గుట్ట పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా నూతన పరపతి సంఘం ఎన్నిక

**విశ్వంభర, హనుమకొండ:** గత కొంతకాలంగా జర్నలిస్టు మిత్రుల ఆలోచనతో ఒక పరపతి సంఘం ఏర్పాటు చేసుకోవాలనే వారి కోరిక నేటితో నెరవేరింది. ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్ లోని మాస్టర్ జీ డిగ్రీ కళాశాల వేదికగా నూతనంగా జర్నలిస్టులంత కలిసి పరపతి సంఘం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ పరపతి సంఘానికి సభ్యులందరూ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ పరపతి సంఘానికి అధ్యక్షులుగా బుర్ర శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గడ్డమీది అశ్విన్ కుమార్, కేశపాక సునీల్ కుమార్, నామాని కిషన్, ప్రధాన కార్యదర్శి రంగరాజు వెంకట దామోదర్, కోశాధికారి గుండమీది యుగేందర్, సహాయ కార్యదర్శులు ఏం .డి ఉస్మాన్ పాషా, శోభన్ బాబు, వినోద్ మెట్రో కార్యవర్గ సభ్యులు మాడ నర్సయ్య, బొల్లపల్లి అశోక్, పొడిశెట్టి రమేష్, గౌని సాంబయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నూతన కమిటీ మాట్లాడుతూ... సభ్యుల అందరికీ కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈపొదుపు సంఘ సభ్యులందరి నిర్ణయంతో ఈరోజు పొదుపు సంఘాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని సంఘంలో వేసే డబ్బులను ఎలాంటి దుర్వినియోగం చేయకుండా పొదుపు సంఘం అభివృద్ధికై, సంఘం కుటుంబ సభ్యులకు ఉపయోగపడే విధంగా మరింత అభివృద్ధి చెందేలా ముందుకు తీసుకెళ్తామని, ఇతర పొదుపు సంఘాలు మన పొదుపు సంఘాన్ని ఆదర్శంగా తీసుకునేలా తీర్చిదిద్దుతామని ,అందుకు కమిటీలేని సభ్యులందరం బాధ్యత గా కృషి చేస్తామని తెలిపారు.

# మెట్రో ప్రాజెక్ట్ కెసిఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయం

**- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**విశ్వంభర, మల్కాజిగిరి :** మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ, కృషితోనే ఉత్తర హైదరాబాద్ కు మెట్రో రైల్ ప్రాజెక్ట్ కు లైన్ క్లియర్ అయిందని బీఆర్ఎస్ సీనియర్ నేత మారెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిసెంబర్ 20 వ తేదీ జరిగిన తెలంగాణ శాసనసభ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ సమస్య పై తన గళం విప్పి రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, శాసనసభ దృష్టికితీసుకుని వచ్చారన్నారు. అంతేగాకుం డా ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని, దక్షిణ మధ్యరైల్వే ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించిన విషయం అందరికి తెలిసిందే నన్నారు. ఎమ్మెల్యే రాజ శేఖర్ రెడ్డి కృషి ఫలితంగానే రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారని, దీంతో ప్యారడైజ్ నుంచి మేడ్చల్, అల్వాల్, శామీర్ పేట వరకు మెట్రో రైలు ప్రాజెక్ట్ కు మోక్షం లభించనుందని హర్షం వ్యక్తం చేశారు. మెట్రో రైలు ప్రయాణికుల ఇబ్బందులను శాసనసభ దృష్టికి తీసుకుని వెళ్ళిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ సానుకూలంగా స్పందించి ఉత్తర హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అధికారులకు ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా మా రెడ్డి రాజశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# రెడీ టు సర్వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**విశ్వంభర, లక్డికపూల్ :** రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ప్రతి ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రిల వద్ద అన్నదానం కార్యక్రమంలో భాగంగా నిలోఫర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగుల సహాయకుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుప్రజ హాస్పిటల్ (ఏ యూనిట్ ఆఫ్ దంతూరి ) జనరల్ మేనేజర్ కార్పొరేట్స్ శీగా అజయ్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా వచ్చి 400 మందికి పైగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీంట్లో భాగంగా అజయ్ మాట్లాడుతూ రెడీ టు సర్వ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఇంత విజయవంతంగా ముందుకు తీసుకెళ్తూ ఆకలితో ఉన్నవారికి కడుపు నింపుతున్నందుకు వారిని అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీం సభ్యులు కూడా ఎంతగానో ఉత్సవం చూపుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడీ టు సర్వ్ ఫౌండేషన్ యువత విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివ నేత , కోఆర్డినేటర్ ప్రకాష్, చైతన్య, రాజు, లక్ష్మణ్, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్, పూజ మొదలగు వారు పాల్గొన్నారు.




523 సర్వే నంబర్ లో పట్టాలిచ్చిన పేదలకు డబల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని ఈనెల 20న మహబూబ్ నగర్ అర్బన్ మండలం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేయాలని కరపత్రాన్ని విడుదల చేస్తున్న ప్రొఫెసర్ హర గోపాల్. (విశ్వంభర, మహబూబ్ నగర్)

# ఆప్-బీజేపీ 'సోషల్' వార్.. ఢిల్లీలో వేడెక్కిన రాజకీయాలు!

**ఢిల్లీ:** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఢిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే అభ్యర్థుల జాబితాను ప్రకటించగా.. బీజేపీ, కాంగ్రెస్ విడతల వారీగా ప్రకటిస్తున్నాయి. ఈ క్రమంలో సోషల్ మీడియాలో నేతల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల యుద్ధం కొనసాగుతోంది. అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఓటర్లను ఆకర్షించేలా ఓ పార్టీ వీడియోలు పెడుతుంటే.. దానిని విమర్శిస్తూ ప్రత్యర్థి పార్టీ మరో వీడియోను పోస్టు చేస్తోంది. ఈ క్రమంలో ఏ చిన్న అవకాశాన్ని కూడా పార్టీలు వదులుకోవడం లేదు. అందంగా అలంకరించిన గుర్రంపై వరుడు లేని వీడియోను ఆప్ తాజాగాసోషల్ మీడియా వేదికగాపోస్ట్ చేస్తూ.. బీజేపీ ఇంకా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేదని ఎత్తిచూపింది. దీనికిదీటుగా బీజేపీ స్పందిస్తూ దేశరాజధానిలో త్వరలోబీజేపీ అధికారంలోకి వస్తుందని.. దీంతో దిల్లీ ప్రజలకు వచ్చిన ఆపద తొలగిపోతుందని సూచిస్తున్న పోస్టర్‌ను షేర్ చేసింది. ఆప్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయి, ఢిల్లీకిఓ ఆపదగా మారిందని ప్రధాని మోదీ ఇటీవల విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. దీనిపై కేజ్రీవాల్ స్పందిస్తూ అసలు విపత్తుభాజపాలోనే ఉందని ఎదురుదాడికి దిగారు. మొదటి విపత్తు భాజపాకు ముఖ్యమంత్రి అభ్యర్థి లేకపోవడం, రెండోది సరైన ఆలోచన లేకపోవడం, మూడోది అజెండా లేకపోవడం అని దుయ్యబట్టారు. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఫిబ్రవరిలో ఎన్నికలుజరిగే అవకాశముంది. 2015 నుంచి రెండు సార్లు గెలుపొందిన ఆప్.. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా.. దిల్లీలోనూ ఈసారి ఎలాగైనా పాగా వేయాలని ఆశిస్తోంది. మరోవైపు ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం విడివిడిగా బరిలోకి దిగుతున్నాయి. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై పోటీకి బీజేపీ మాజీ ఎంపీ పర్వేశ్‌వర్మను ఆ పార్టీ బరిలోకి దింపింది.







## రష్యా, ఉత్తర కొరియా దళాలు భారీ ప్రాణనష్టాన్ని ఎదుర్కొంటున్నాయి: జెలెన్ స్కీ



కీవ్: ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉత్తరకొరియా సైన్యం పోరాడుతున్న సంగతి తెలిసిందే. కాగా ఉక్రెయిన్‌పై దాడులకు దిగుతున్న రష్యా, ఉత్తర కొరియా సైనికులు తమ సైన్యం చేతుల్లో ఓటమిని చవిచూస్తున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. రష్యాలోని దక్షిణ కుర్స్క్ ప్రాంతంలో రెండు రోజులుగా జరుగుతున్న ఘర్షణల్లో తమ సైనికులు భారీగా విరుచుకుపడడంతో అక్కడి బలగాలకు భారీ ప్రాణనష్టం సంభవించిందన్నారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన విదేశీ సైనికుల పేర్లు బయటకు రాకుండా రష్యా జాగ్రత్త పడుతోందన్నారు. కుర్స్క్ ప్రాంతంలో తమ సైన్యం ముగ్గురు ఉత్తర కొరియా సైనికులను హతమార్చి వారి గుర్తింపు పత్రాలను స్వాధీనం చేసుకుందని తెలిపారు. అయితే అందులో వారి పేర్లు, వివరాలను మార్చేసి రష్యాకు చెందిన వారిగా తప్పుడు పత్రాలు సృష్టించినట్లు గుర్తించామని పేర్కొన్నారు. "గత రెండు రోజులుగా కుర్స్క్ ప్రాంతంలోని మఖ్నోవ్కా గ్రామ సమీపంలో జరుగుతున్న యుద్ధంలో మా బలగాలు పైచేయి సాధిస్తున్నాయి. ఇది యుద్ధంలో మాకు మరో ముఖ్యమైన ముందడుగు" అని జెలెన్‌స్కీ అన్నారు. స్వేసా పట్టణంలో రష్యా చేసిన దాడుల్లో పలు నివాస భవనాలు దెబ్బతిన్నాయని, రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని అన్నారు. 2022 ప్రారంభం నుంచి రష్యా-ఉక్రెయిన్ ల మధ్య యుద్ధం నడుస్తోంది. యుద్ధాన్ని ఆపాలని ప్రపంచ దేశాలు ఎంతగా ప్రయత్నిస్తున్నా ముగింపు ఛాయ లు ఎక్కడా కనిపించడం లేదు. రష్యా సరిహద్దు ప్రాంతమైన కుర్స్క్‌లోని మూడు గ్రామాల్లో దాదాపు 10వేల మంది కిమ్ సైనికులు పోరాడుతున్నారు. యుద్ధంలో పోరాడే శక్తి వారికి లేకపోవడంతో ప్రాణ నష్టం ఎక్కువగా ఉంటోందని అమెరికా సైతం అభిప్రాయం వ్యక్తం చేసింది. మరో వైపు చనిపోయిన ఉత్తర కొరియా సైనికుల ముఖాలను గుర్తుపట్టకుండా పుతిన్ సేనలు కాల్చేస్తున్నాయని జెలెన్‌స్కీ ఇటీవల ఆరోపించారు.

## నమో భారత్ కారిడార్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ

**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీ-ఘజియాబాద్-మేరఠ్ నమో భారత్ కారిడార్ ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లోని సాహిబాబాద్, దిల్లీలోని న్యూ అశోక్ నగర్ మధ్య నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌లో 13 కిలోమీటర్ల అదనపు సెక్షన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి సాహిబాబాద్ నుంచి న్యూ అశోక్ నగర్ వరకు ప్రయాణించారు. ఈ మార్గంలో కొత్తగా ప్రారంభించిన రైలు 13 కి.మీ విభాగంలో 6కి.మీ మేర భూగర్భంలో నడవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నమో భారత్ రైళ్లు భూగర్భ విభాగంలో నడపడం ఇదే తొలిసారని తెలిపారు. కార్యక్రమానికి ముందు ప్రధాని మోదీ మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు ఆప్ ప్రభుత్వంతో విసిగిపోయారని అన్నారు. ప్రస్తుతం వారు దేశ రాజధానిని అభివృద్ధి బాటలో నడిపే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. నేడు ప్రారంభించిన నమో భారత్ కారిడార్ దిల్లీకి మేరఠ్‌కు మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తుందని అన్నారు. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ.. ఢిల్లీ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 12,200 కోట్లు కేటాయించిందని అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. రిథాలా-కుండ్లి మెట్రో పొడిగింపు, జనక్‌పురి-కృష్ణా పార్క్ మెట్రో లైన్, ర్యాపిడ్ రైల్ కారిడార్ వంటి ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ ఆయన ప్రశంసించారు. దిల్లీని ఎవరైనా అభివృద్ధి చేస్తే అది ప్రధాని మోదీ మాత్రమే అని అన్నారు.



## మమ్మల్ని రక్షించండి.. హమాస్ చెరలోని ఇజ్రాయెల్ నిఘా సైనికురాలు

**జెరూసలెం:** ఇజ్రాయెల్- హమాస్‌లల మధ్య పోరు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే తమ చెరలో బందీ లుగా ఉన్న వ్యక్తుల వీడియోలను హమాస్ విడుదల చేస్తోంది. ఇజ్రాయెల్‌కు చెందిన నిఘా సైనికురాలి వీడియోను హమాస్ తాజాగా విడుదల చేసింది. ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెంచేందుకు హమాస్ మిలిటరీ విభాగమైన అల్ కస్సామ్ బ్రిగేడ్ ఈ వీడియోను విడుదల చేసినట్లు తెలుస్తోంది. అందులో 19 ఏళ్ల లిరి అల్బాగ్ తన ఆవేదనను వ్యక్తం చేశారు. 450 రోజులకుపైగా తాను హమాస్ చెరలో బందీగా ఉన్నట్లు వీడియోలో వెల్లడించారు. ఈ సందర్భంగా తమను రక్షించాలని టెల్అవీవ్ నాయకులకు విజ్ఞప్తి చేశారు. లిరి అల్బాగ్ ఓ నిఘా సైనికురాలని ఇజ్రాయెల్‌కు చెందిన వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి. గాజా సరిహద్దు సమీపంలోని నహాల్ ఓజ్ సైనిక స్థావరం వద్ద ఐడీఎఫ్ నిఘా సైనికులు ఉన్నారు. ఆ సమయంలో మిలిటెంట్ గ్రూప్ దాడి చేసింది. ఈ దాడుల్లో 15 మంది మరణించగా.. లిరితో పాటు మరో ఆరుగురిని ఆ సంస్థ బందీలుగా తీసుకెళ్లింది. ఈ వీడియోపై బాధితురాలి కుటుంబసభ్యులు స్పందించారు. 'ఆ దృశ్యం మమ్మల్ని కలవరపరుస్తోంది. లిరి మానసిక వేదనతో ఉన్నట్లు తెలుస్తోంది' అని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వద్ద బందీలుగా ఉన్నవారిని వెంటనే విడిపించాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు విజ్ఞప్తి చేశారు. 2023లో ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయడంతో సుమారు 1,200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.. 251 మందిని ఆ సంస్థ బంధించి గాజాలోకి తీసుకెళ్లింది. దీంతో ఇజ్రాయెల్ చేపట్టిన ప్రతిదాడుల్లో గాజాలో 43వేల మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మధ్యలో తాత్కాలికంగా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం వేళ కొందరు బందీలు విడుదల కాగా.. ఇంకా 97 మంది హమాస్ చెరలోనే ఉన్నారు. అయితే పలు ఘటనల్లో మరి కొందరు మృతి చెందారు. ప్రస్తుతం 51 మంది మాత్రమే సజీవంగా ఉండి ఉంటారని ఇజ్రాయెల్ మీడియా చెబుతోంది.



## కూలిన కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్.. ముగ్గురు మృతి

అహ్మదాబాద్: ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ (ఏఎల్‌హెచ్) కూలిపోయింది. దీంతో మంటలు చెలరేగాయి. హెలికాప్టర్‌లోని ముగ్గురు సిబ్బంది ఈ ప్రమాదంలో మరణించారు. గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో ఈ సంఘటన జరిగింది. ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన ధ్రువ్ హెలికాప్టర్ సాధారణ గస్తీ కోసం బయలుదేరింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పోర్‌బందర్ సమీపంలోని గ్రౌండ్‌లో అది కూలిపోయింది. ఆ వెంటనే మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. కాగా, ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన ఎయిర్ ఎన్‌క్లేవ్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అందులో ప్రయాణించిన సిబ్బందిలో ముగ్గురు మరణించినట్లు చెప్పారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. హెలికాప్టర్ కూలడానికి కారణం ఏమిటన్న దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు హెలికాప్టర్ కూలిన తర్వాత మంటలు చెలరేగిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.




## ట్రంప్‌తో ఇటలీ ప్రధాని మెలోని భేటీ..



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మరికొన్ని రోజుల్లో అధికార బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. శనివారం ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో ఎస్టేట్‌లో ఈ ఇరువురు నేతలు సమావేశమయ్యారు. 'ఇది సంతోషకరమైన సమయం. అద్భుతమైన మహిళ, ఇటలీ ప్రధానితో ఉన్నాను' అని ట్రంప్ అక్కడి వారితో పేర్కొన్నారు. ఇరువురి నేతల సమావేశానికి సంబంధించిన వివరాలు వెల్లడి కాలేదు. అయితే, ఉక్రెయిన్ తో రష్యా యుద్ధం, వాణిజ్యసమస్యలు, మధ్యప్రాచ్యంలో నెలకొన్నఉద్రిక్తతలతో పాటు ఇరాన్‌లో నిర్బంధించిన ఇటాలియన్ జర్నలిస్టు విడుదల వంటి అంశాలను గురించి చర్చించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇటాలియన్ వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి. దీనిపై ప్రధాని కార్యాలయంఎలాంటి ప్రకటన చేయలేదు. మరో వైపు.. ఇటలీకి చెందిన ఓ జర్నలిస్టును టెహ్రాన్ అధికారులు అరెస్టు చేశారు. ఈవిషయాన్ని ఇటలీ విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ట్రంప్‌తో అనేక మంది దేశాధినేతలు భేటీ అయ్యారు. ఇటీవల అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలి , హంగేరీ ప్రధాని విక్టోర్ అర్బన్ , కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సైతం ఆయనతో సమావేశమయ్యి చర్చలు జరిపారు.

## రెండు రోజుల్లో 100కుపైగా టార్గెట్‌లు..

### ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం!



**జెరూసలెం:** హమాస్‌పై ఇజ్రాయెల్ తన దాడులను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలోనే గత రెండు రోజుల్లో 100కుపైగా ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడినట్లు ప్రకటించింది. ఇటీవలి కాలంలో తమ దేశంపైకి రాకెట్ దాడులు జరిపిన ప్రదేశాలనూ లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. ఇజ్రాయెల్ దాడుల్లో పదుల కొద్దీ పౌరులు మృతి చెందినట్లు పాలస్తీనా అధికారులు తెలిపారు. హమాస్ నెట్‌వర్క్ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడులతో గాజా ఇప్పటికే అతలాకుతలమైంది. అయినప్పటికీ.. ఇటీవలి కాలంలో హమాస్ ఉగ్రవాదులు మరోసారి వరుస రాకెట్ దాడులకు తెగబడుతున్నారు. ఇవి ఇలాగే కొనసాగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి కాట్జ్ ఇటీవల హెచ్చరించారు. ఈ క్రమంలోనే దాడులను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. "గాజావ్యాప్తంగా రెండు రోజుల్లో 100కుపైగా ఉగ్ర లక్ష్యాలపై వాయుసేన దాడులు జరిపింది. పదుల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టింది" అని ఇజ్రాయెల్ మిలిటరీ ఓ ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉండగా.. టెల్‌అవీవ్ దాడుల్లో శనివారం 30 మందికిపైగా పౌరులు మృతి చెందినట్లు గాజా అధికారులు తెలిపారు. మరోవైపు.. ఓ ఇజ్రాయెల్ బందీ వీడియోను హమాస్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

## గుజరాత్‌లో కూలిన హెలికాప్టర్..!



**పోర్ బందర్:** తీర రక్షక దళానికి చెందిన హెలికాప్టర్ ఒకటి గుజరాత్‌లోని పోర్ బందర్ తీరంలో కుప్పకూలింది. ఈ ఘటలో ముగ్గురు సిబ్బంది మృతి చెందినట్లు సమాచారం. కోస్ట్ గార్డ్ గార్డ్ ఎయిర్‌ఎన్‌క్లేవ్‌లో ఇది కూలిపోయినట్లు తెలుస్తోంది. వీరిలో ఇద్దరు పైలట్స్ ఉన్నట్టు భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఐసీజీ అధికారులు ప్రకటించారు. ఈ హెలికాప్టర్ ప్రయాణం మొదలుపెట్టాక సాంకేతిక సమస్యలను ఎదుర్కొంది. ఆ తర్వాత కొద్దిసేపటికే అది కూలిపోయింది. దీనిపై కోస్టు గార్డు ఇప్పటికే దర్యాప్తు చేపట్టింది. ఇప్పటికే ఏఎల్‌హెచ్ హెలికాప్టర్లలో కీలకమైన రక్షణ చర్యలకు హిందూస్థాన్ ఏరోనాటికల్ సంస్థ ఇప్పటికే చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. గతేడాది కూడా ఈ శ్రేణి హెలికాప్టర్లు ప్రమాదాలకు గురయ్యాయి. వీటిల్లో డిజైన్ సమస్యలు ఉండటంతో చాలా చోట్ల వీటిని వాడటంలేదు. గతేడాది మార్చి 8న మన నౌకాదళానికి చెందిన ఏఎల్‌హెచ్ ధ్రువ్ ముంబయి తీరంలో ప్రమాదానికి గురైంది. అందులోని ముగ్గురు సిబ్బందిని నేవీ పెట్రోలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ సాయంతో రక్షించారు. ఈ ఘటన తర్వాత వీటి వినియోగాన్ని త్రివిధ దళాల్లో నిలిపివేశారు. కొన్నాళ్లకు సైన్యం వీటి సేవలను పునరుద్ధరించగా.. ఆ తర్వాత కొన్నాళ్లకే మరో హెలికాప్టర్ కూలిపోవడం గమనార్హం. నాడు సాంకేతిక లోపం తలెత్తడంతో జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్వాడ్ జిల్లా అటవీ ప్రాంతంలో అత్యవసరంగా దించేందుకు ప్రయత్నిస్తుండగా ఈ చాపర్ కుప్పకూలింది. ఆ ఘటనలో తెలంగాణకు చెందిన సాంకేతిక నిపుణుడు పబ్బల్ల అనిల్(29) మృతి చెందారు.

## కమ్మటి పిజ్జాలో కత్తి ముక్క.. షాకైన కస్టమర్!




**పుణె:** హోటల్ నుంచి పిజ్జా ఆర్డర్ చేసిన ఓ వ్యక్తికి భయానక అనుభవం ఎదురైంది. అందులో ఏకంగా కత్తి ముక్క రావడంతో కంగుతిన్నాడు. ఈ ఘటన మహారాష్ట్రలో చోటు చేసుకొంది. పుణెకి చెందిన డోమినోస్ నుంచి అరుణ్ అనే వ్యక్తి పిజ్జా ఆర్డర్ చేశాడు. దాన్ని తింటుండగా.. తనకు ఏదో గుచ్చుకున్నట్లుగా అనిపించింది. వెంటనే దాన్ని నోటి నుంచి బయటకు తీసి పరిశీలించగా.. అది కత్తి ముక్కగా తేలింది. అనంతరం తాను పిజ్జా ఆర్డర్ చేసిన అవుట్‌లెట్‌కు ఫోన్ చేసి విషయం తెలియజేశాడు. అయితే.. తొలుత దీనిని తోసిపుచ్చిన షాపు మేనేజర్ ఆ తర్వాత కస్టమర్ ఇంటికి వచ్చి పరిశీలించాడు. ఆధారాలు చూపడంతో తప్పును అంగీకరించి క్షమాపణలు కోరాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. "రూ.596తో పిజ్జా ఆర్డర్ చేశా. దాన్ని తింటుండగా మధ్యలో నాకు పదునైన వస్తువు తగిలినట్లు అనిపించింది. పిజ్జాలో కత్తి ముక్క రావడం చూసి షాకయ్యా. డోమినోస్ నుంచి ఇలాంటి సేవలు బాధాకరం. ఇది నిర్లక్ష్యం మాత్రమే కాదు. ప్రాణాలకే ప్రమాదకరం. మీరు ఆహారాన్ని ఆర్డర్ చేసిన తర్వాత జాగ్రత్త వహించండి" అని అరుణ్ పేర్కొన్నాడు.

## దీదీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారు: సువేందు అధికారి



**కోల్‌కతా:** భారత్‌లోకి చొరబాటుదారులు ప్రవేశించేందుకు సరిహద్దు భద్రతా దళం సాయం చేస్తోందని పశ్చిమ్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇటీవల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆమె ఆరోపణలను భాజపా ఖండించింది. దిగజారుడు రాజకీయాలకు దీదీ పాల్పడుతున్నారని ప్రతిపక్ష నేత సువేందు అధికారి విమర్శించారు. ఈ మేరకు ఆయన మమతా బెనర్జీకి ఓ లేఖ రాశారు. 'భద్రతా దళాలు దేశానికి సేవ చేస్తాయి.. కానీ, ప్రభుత్వానికి కాదు. వారు దేశ రక్షకులు. గత కొద్ది రోజులుగా పశ్చిమ్ బెంగాల్‌లో జరుగుతున్న చొరబాటులకు సైనికులను నిందిస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు ఉంటాయి. అయితే, భద్రతా బలగాలను అందులోకి లాగడం వారిని అవమానించడమే అవుతోంది. మీ వైఫల్యాలను వారికి ఆపాదించడం నీచ రాజకీయం తప్ప మరొకటి కాదు. దేశ సరిహద్దులను, ప్రజలను రక్షించడానికి వారు ప్రాణాలను పణంగా పెడుతున్నారు. అలాంటి వారిని అవమానిస్తూ మీరు చేసిన వ్యాఖ్యలు దేశం మరచిపోదు' అని లేఖలో పేర్కొన్నారు. ఇటీవల బంగ్లాదేశ్ చొరబాటుదారులు భారత్‌లోకి ప్రవేశించడానికి బీఎస్ఎఫ్ సాయం చేస్తోందని దీదీ ఆరోపించారు. బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలు ఉన్నాయని, భారత్-బంగ్లా సరిహద్దుకు ఇరువైపులా శాంతియుత పరిస్థితులు ఉండాలని వ్యాఖ్యానించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. నలుగురు మావోయిస్టుల మృతి



**నారాయణ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. నారాయణ్‌పూర్- దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లోని దండకారణ్యంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. అబుజ్‌మాడ్‌లోని అటవీ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ , సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల కాల్పుల్లో దంతెవాడ డీఆర్‌జీ హెడ్ కానిస్టేబుల్ కరమ్ ప్రాణాలు కోల్పోయారు.

# ఆ సినిమాలను హిందువులు బహిష్కరించాలి: గేయ రచయిత అనంత శ్రీరామ్






**విశ్వంభర, విజయవాడ:** సినిమాల్లో హైందవ ధర్మం మీద దాడి జరుగుతోందని ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద విశ్వ హిందూపరిషత్ (వీహెచ్‌పీ)ఆధ్వర్యంలో నిర్వహించిన 'హైందవ శంఖారావం'సభలో ఆయన ప్రసంగించారు. వాల్మీకి రామాయణం, వ్యాస భారతం.. భారత సాహిత్య వాఙ్మయానికి రెండు కళ్లలాంటివన్నారు. అలాంటి వాటినే వినోదం కోసం వక్రీకరించారని చెప్పారు. హిందూ ధర్మాన్ని హననం చేసే సినిమాలను ప్రతి ఒక్కరూ బహిష్కరించాలని కోరారు. అప్పుడు ఆ సినిమాలకు డబ్బులు రావని, డబ్బులు రాకపోతే హిందూ ధర్మాన్ని హననం చేసే సినిమాలను నిర్మాతలు తీయరన్నారు.

**హిందూ సమాజానికి క్షమాపణలు చెబుతున్నా..**

"వ్యాపారాత్మకమైన కళ, కళాత్మకమైన వ్యాపారం సినిమా. ఈ రెండింటినీ జోడించే క్రమంలో హిందూ ధర్మానికి కళంకం కలుగుతోంది. ఆలయాలకు ఆత్మగౌరవం కోసం భారీగా హిందువులు తరలిరావడం చాలా సంతోషంగా ఉంది. సినీ పరిశ్రమలో జరిగే తప్పులను ఆ రంగానికి చెందిన వ్యక్తిగా బాహాటంగానే విమర్శిస్తున్నా. ఇప్పటి వరకు సినిమాల్లో జరిగిన హైందవ ధర్మ హననానికి.. హిందూ సమాజానికి క్షమాపణలు చెబుతున్నా. పురాణాలు ఇతి హాసాల గొప్పతనాన్ని సినిమాల్లో తగ్గించి పాత్రలు మార్చేస్తున్నారు. చరిత్రను వక్రీకరించి హిందూ ధర్మాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. వ్యాసుడు, వాల్మీకి రచనలను వినోదం కోసం వక్రీకరిస్తున్నారు"

**ఆ దర్శకుడికి 15 ఏళ్లుగా పాట రాయలేదు..**

"కృష్ణా జిల్లాకు చెందిన దర్శకులు, నిర్మాతలే ఈ పొరపాటు చెప్పకపోతే ఎలా? పాత్రల ఔన్నత్యాన్ని మారిస్తే హైందవ ధర్మాన్ని ఆచరించినట్టు కాదు. నిండు సభలో ద్రౌపది వస్త్రాన్ని తీస్తున్నా మౌనంగా ఉన్న కర్ణుడు ఎలా గొప్పవాడు అవుతారు? భారత, రామాయణ, భాగవతాల్లో పురాణాలను ఇష్టం వచ్చినట్టు మార్చేశారు. అభూత కల్పనలు, వక్రీకరణలు చేస్తున్నా మనం చూస్తూ ఊరుకుంటున్నాం. చిత్రీకరణలో, గీతాలాపనలో ఎన్నో రకాల అవమానాలు జరిగాయి. ఒక దర్శకుడు.. పాటలో 'బ్రహ్మాండ నాయకుడు' అనే పదం ఉండ కూడదని చెబితే 15 ఏళ్లుగా ఆ వ్యక్తికి నేను పాటలు రాయలేదు.

హిందూ ధర్మాన్ని అవమానించేలా తీసిన సినిమాలను ప్రభుత్వం నిషేధించాలి.. లేదంటే హిందువులే పూర్తిగా వాటిని బహిష్కరించాలి. అప్పుడే హిందూ ధర్మానికి ఒక గౌరవం, గుర్తింపు ఉంటాయి" అని అనంత శ్రీరామ్ అన్నారు.

**భారీగా హాజరైన ప్రజలు**

గన్నవరం: ఎన్టీఆర్ జిల్లా గన్నవరం సమీపంలోని కేసరిపల్లి వద్ద 'హైందవ శంఖారావం'సభ కొనసాగుతోంది. విశ్వ హిందూపరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలతో పాటు హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక, సేవా సంఘాల ప్రతినిధులు, పీఠాధిపతులు హాజరయ్యారు. దీంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అంతకుముందు సభ ప్రారంభం సందర్భంగా భారతమాత చిత్రపటం వద్ద వీహెచ్‌పీ నేతలు, పీఠాధిపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు.

**ఐదేళ్లలో హైందవ ధర్మంపై దాడి జరిగింది: పురందేశ్వరి**

గత ఐదేళ్లలో హైందవ ధర్మంపై విపరీతంగా దాడి జరిగిందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ధ్వజమెత్తారు. హైందవ శంఖారావం సభలో ఆమె పాల్గొన్నారు. గత ప్రభుత్వ తీరువల్ల హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న హిందువుల మనోభావాలను ప్రతి ఒక్కరికీ వివరించాలనే ఉద్దేశంతోనే సభనిర్వహిస్తున్నట్లు చెప్పారు. " రాష్ట్రంలో మతమార్పిడులు ఎక్కువగా జరుగుతున్నాయి. అందరినీ ఒకతాటిపైకి తీసుకొస్తేనే ఆలయాల స్వయం ప్రతిపత్తి, హిందూధర్మ పరిరక్షణ సాధ్యమవుతుంది" అని పురందేశ్వరి తెలిపారు.

# జనవరి 8న శ్రీశైలంలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం



**శ్రీశైలం:** స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా ఈ నెల 8వ తేదీన పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పరిధిలో విస్తృతంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టనున్నారు. ఈ విషయాన్ని శ్రీశైల ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. దీనికోసం తగు ప్రణాళికను రూపొందించామని చెప్పారు. స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా క్షేత్రాన్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా, 68 ప్రదేశాలుగా విభజించడం జరిగిందన్నారు.పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి జోన్‌కు కూడా యూనిట్ అధికారులను, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా ఆయా జోన్లలో పలువురు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ మాడవీధులు, గంగాధర మండపం నుంచి తూర్పువైపున నందిగుడి వరకు గల ప్రదేశం దక్షిణం వైపున అలంకారేశ్వరాలయం గల ప్రదేశం, దర్శన క్యూకాంప్లెక్సు విరాళాల సేకరణ కేంద్ర ప్రాంగణం మరియు పరిసరాలు, అన్నప్రసాద వితరణ భవన పరిసరాలు, శ్రీలలితాంబికా వాణిజ్య సముదాయం, సీఆర్‌వో కార్యాలయ పరిసరాలు, దేవస్థానం వైద్యశాల పరిసరాలు, గంగాగౌరి సదన్ పరిసరాలు, మల్లికార్జున సదన్ పరిసరాలు, చల్లా వెంకయ్య సత్రం పరిసరాలు, గణేశసదన్ పరిసరాలు, టూరిస్ట్ బస్టాండ్ పరిసరాలు, సెంట్రల్ పార్కింగ్ ప్రదేశం, మల్లమ్మ కన్నీరు పరిసరాలు, పంచమఠాల పరిసరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిసరాలు, సర్వతోభద్రవన పరిసరాలు, కల్యాణకట్ట పరిసరాలు, పాతాళగంగ పాతమెట్ల మార్గం, ఆర్టీసి బస్టాండు, సిద్ధిరామప్ప వాణిజ్య సముదాయం, పాతాళగంగ మెట్ల మార్గం, పాతాళగంగ స్నానఘట్టాలు, భ్రమరాంబ అతిథి గృహ పరిసరాలు, శ్రీగిరి కాలనీ, కొత్తపేట అడ్డరోడ్లు, సాక్షి గణపతి ఆలయ పరిసరాలు, హాటకేశ్వరాలయ పరిసరాలు, ఫాలధార %-% పంచధార, శిఖరేశ్వర ఆలయ పరిసరాలు మొదలైన చోట్ల పారిశుద్ధ్య చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బందితో పాటు దుకాణాల నిర్వాహకులు, సత్రాల సిబ్బంది స్థానికులందరు కూడా పాల్గొని క్షేత్ర పవిత్రతను కాపాడటంలో సహకరించాలని కోరారు.

# మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ అరెస్టు



**మాచర్ల:** పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్‌ను ఏపీ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని కిశోర్ అనేక అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడ్డాడు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో పర్యటనకు వెళ్లిన తెదేపా నేతలు బొండాఉమా మహేశ్వరరావు, బుద్ధావెంకన్నపై ఆయన దాడికి పాల్పడ్డాడు. కారు అద్దాలు బద్దలు కొట్టిదాడికి దిగాడు.దీనిపై అప్పట్లో కేసు నమోదైనప్పటికీ.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చిన తర్వాత తురకా కిశోర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమాలకుపాల్పడిన అతడిపై...చర్యలు తీసుకోవాలని తెదేపా నేతలు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.తాజాగా అతడుహైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకొని అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు.

# గత ప్రభుత్వం శాంతిభద్రతలను గాలికి వదిలేసింది: హోంమంత్రి అనిత

విశాఖ: గత ప్రభుత్వం శాంతిభద్రతలను గాలికి వదిలేసిందని హోం మంత్రి అనిత విమర్శించారు. శనివారం విశాఖ సెంట్రల్ జైలులో ఫోన్ కనిపించిందన్న ఆరోపణలతో ఆమె విశాఖ సెంట్రల్ జైలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జైలులో గంజాయి వాడుతున్నారనే ఆరోపణలు వచ్చాయన్నారు. విశాఖ సెంట్రల్ జైలు లోపల వివాదాస్పద ఘటనలపై విచారణ జరుగుతోందని చెప్పారు. ఇప్పటికే కొంతమందిని విశాఖ కేంద్ర కారాగారం నుంచి ఇతర జైళ్లకు బదిలీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితేఉపేక్షించేది లేదని హెచ్చరించారు.గత ప్రభుత్వ నిర్వాకం వల్లే జైళ్లలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని మండిపడ్డారు. విశాఖ జైలులో ఘటనలపై కమిటీ వేసినట్లు చెప్పారు. పది రోజుల్లో నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అనిత పేర్కొన్నారు.

"ఇటీవలే జైలులో సెల్ ఫోన్లు బయటపడ్డాయి. అవి బయటపడిన చోట కూడా పరిశీలించాం. విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విధులు సమర్థంగా నిర్వహించకపోతే సిబ్బందిపై కూడా చర్యలుంటాయి. యూనిఫామ్ సర్వీసులో ఉన్నవారు ధర్నా, బంద్‌ల్లో పాల్గొనకూడదు. విశాఖ సెట్రల్ జైలు నుంచి కొంతమంది ఖైదీలను



రాజమహేంద్రవరం జైలుకు తరలిస్తున్నాం. గత ఐదు సంవత్సరాలు ప్రజాప్రతినిధులు సెంట్రల్ జైలును సందర్శించిన దాఖలాలు లేవు" అని అనిత తెలిపారు.

# వైకుంఠ ద్వార దర్శనానికి నిర్దేశిత సమయంలోనే అనుమతిస్తాం: టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు



తిరుపతి: వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో భక్తులు వేచి ఉండే సమయాన్ని నివారించేందుకు టోకెన్లు, టికెట్లపై నిర్దేశించిన సమయంప్రకారం మాత్రమే భక్తులనుదర్శనాలకు అనుమతిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పునరుద్ఘాటించారు. ఆదివారం ఉదయం తిరుమలలోని శ్రీవారి ఆలయ మాఢవీధుల్లో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను బీఆర్ నాయుడు పరిశీలించారు.ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు సంయమనం పాటించి తిరుపతిలో జారీ చేయనున్న ఎస్ఎస్‌డీ టోకెన్లు పొందాలని కోరారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి వైకుంఠ ఏకాదశికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసేందుకు టీటీడీ యంత్రాంగం విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు.


**వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు ఎలా పొందాలంటే..**

జనవరి 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పది రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతించనున్నారు. వైకుంఠ ద్వార దర్శనానికి ఆన్‌లైన్‌లో టికెట్లను పొందని భక్తులకు నేరుగా తిరుమల, తిరుపతిలో ఎస్ఎస్‌డీ టికెట్లు ఇచ్చేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నారు. ఇందుకోసం తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 94 కౌంటర్లలో టోకెన్లు ఇవ్వనున్నారు.తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కోసం తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాట్లు చేశారు.జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లను తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో మాత్రమే టోకెన్లు జారీ చేయనున్నారు.

# ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## - రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశ్వంభర, సంతమాగులూరు:



కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావేదికలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొడ్పెట్రో కుమార్ ఆదేశించారు. సంతమాగులూరు మండల పరిషత్ కార్యాల ఆవరణలో శనివారం జరిగిన ప్రజా వేదికలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. ప్రజా వేదికకు ఏర్పాటుచేసిన వేదికను సున్నితంగా తిరస్కరించిన మంత్రి గొట్టిపాటి ప్రజల్లో ఒకరిగా ప్రజల మధ్యలో కూర్చుని ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను స్వయంగా స్వీకరించారు. మధ్యాహ్నం ప్రారంభమైన ప్రజా వేదిక సాయంత్రం 5 గంటల వరకు నిరంతరం కొనసాగింది. మండల ప్రజలు వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా సమస్యలను ఒక్కొక్కటిగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం మార్గం చెప్పారు. ప్రజా వేదికలో మొత్తం 147 మంది వివిధ సమస్యలపై అర్జీలు దాఖలు చేయగా అందులో రెవెన్యూకు సంబంధించి 63 పంచాయతీరాజ్ సంబంధించి 12 మిగిలినవి మంత్రి కేక విద్యుత్ శాఖ సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. అన్ని సమస్యలకు అధికారులను అప్రమత్తం చేసి తక్షణ పరిష్కారం చూపే దిశగా ప్రయత్నం చేయాలని మంత్రి రవికుమార్ ఆదేశించారు.

**పంచాయతీలలో పనులు చేయకుండా నిధులు డ్రా చేసే వారిపై చర్యలు తప్పవు...**

గ్రామపంచాయతీలలో ప్రజాప్రతినిధులు పనులు చేయకుండా నిధులు డ్రా చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని అటువంటి చర్యలను ఎవరు అధికారులు ప్రోత్సహించవద్దని అలా చేసిన వారిపై చర్యలు తప్పవని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు. సంతమాగులూరు మండలంలో గురుజేపల్లి గ్రామపంచాయతీకి సంబంధించి అత్యధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని అక్కడ నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల ఆదేశించారు. ప్రజా సమస్యలపై వచ్చిన అర్థ్యలను స్వీకరించడం కాదని వాటికి నూరు శాతం పరిష్కారం చూపునప్పుడే ప్రభుత్వంపై అధికారులపై ప్రజలకు సానుకూల దృక్పథం ఏర్పడుతుందని రవికుమార్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలను కూడా గ్రామాల వారీగా విస్తృతంగా అవగాహన కల్పించాలని అర్హుల అయ్యుండి సాంకేతిక కారణాలవల్ల ఎవరికైనా లబ్ధి చేకూరకపోతే అటువంటి సమస్యలను పరిష్కరించి లబ్ధి చేకూరే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారుల ది స్థానిక ప్రజా ప్రతినిధులపై ఉన్నదని రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, సంతమాగులూరు తాసిల్దార్ రవిబాబు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జ్యోతిర్మయి, విద్యుత్ శాఖ ఈ నల్లూరి మస్తాన్రావు ఏఈ దీపక్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి లాభణ్య, విద్యాశాఖ అధికారి వేమవరపు కోటేశ్వరరావు, అన్ని శాఖల అధికారులు పంచాయతీ సిబ్బంది పాల్గొనగా సంతమాగులూరు సర్కిల్ లోని సంతమాగులూరు బల్లికురవ ఎస్సైలు పట్టాభిరామయ్య జీవి చౌదరి తమ సిబ్బందితో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# సంక్రాంతి రద్దీ.. మరో 52 అదనపు రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే



హైదరాబాద్: సంక్రాంతి రద్దీ సందర్భంగా మరో 52 అదనపు రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. నగరంలోని సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపూర్, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు ఈ రైళ్లు నడపనున్నట్లు తెలిపింది. ఆయా ప్రాంతాలకు ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు ఇవి అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది.

# విశాఖకు భారీగా ఐటీ కంపెనీలు: మంత్రి నారా లోకేశ్



**విశాఖ:** ఉత్తరాంధ్రకు జగన్ చేసిందేమీ లేదని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఒక్క ఐటీ పరిశ్రమనుకూడా తీసుకురాలేదన్నారు. ప్రధాని మోదీ పర్యటనపై సమీక్ష అనంతరం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. "కియా పరిశ్రమను తీసుకొచ్చింది చంద్రబాబే . వైసీపీ పాలనలో రాష్ట్రం నుంచి కంపెనీలు తరలిపోయాయి. గతంలో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పారు.. చేశారా? ప్రస్తుతం దేశంలో భారీగా పింఛన్ ఇస్తోంది ఏపీనే. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు మేము చెల్లిస్తున్నాం. గాడితప్పిన పాలనను సరైన దారిలో పెడుతున్నాం. విశాఖకు భారీగా ఐటీ కంపెనీలు తీసుకువస్తాం. ఏపీకి కావాల్సిన ప్రతి ప్రాజెక్టును రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు అడుగుతున్నారు. అన్ని ప్రాంతాలకు నీరు అందించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది." అని లోకేశ్ తెలిపారు.

# విశాఖలో ప్రధాని పర్యటనపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష




విశాఖపట్నం: ఈ నెల 8న ప్రధాని మోఢీ విశాఖలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం నిర్వహించిన సమీక్షలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల వారీగా వచ్చే వారికి రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సుమారు 3లక్షల మంది హాజరయ్యే అవకాశముందని అంచనా వేశారు.

# సినీనటి మాధవీలత గురించి అలా మాట్లాడటం తప్పే: జేసీ ప్రభాకర్‌రెడ్డి



**తాడిపత్రి:** సినీనటి మాధవీలత గురించి ఆవేశంలో అలా మాట్లాడటం తప్పేనని అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అంగీకరించారు. ఆమెకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపారు. డిసెంబరు 31న తాడిపత్రి జేసీ పార్కులో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలపై మాధవీలతతోపాటు, భాజపా నాయకురాలు సాధినేని యామిని చేసిన వ్యాఖ్యలపై జేసీ ప్రభాకర్‌రెడ్డి అభ్యంతరకరమైన కామెంట్లు చేయడం విమర్శలకు తావుతీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని, క్షమాపణ కోరుతున్నట్లు జేసీ పేర్కొన్నారు.ఆదివారం తాడిపత్రిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవేశంలోనే అలాంటి వ్యాఖ్యలు చేశాను తప్పు.. వారిని కించపరచాలన్న ఉద్దేశం తనకు లేదన్నారు. కొంతమంది పార్టీ మారిపోవాలని విమర్శిస్తున్నారని, తాను పార్టీ మారాలని చెప్పే హక్కు ఎవరికీ లేదన్నారు. డిసెంబరు 31న నన్ను నమ్మి 16 వేల మంది అక్కచెల్లెళ్లు జేసీ పార్క్‌కు వచ్చారు. నాగురించి మాట్లాడిన రాజకీయనాయకులంతా ఫ్లెక్సీ గాళ్లే. తాడిపత్రి కోసం ఎంత దూరమైనా వెళ్తా. రెండు సంవత్సరాల్లో తాడిపత్రి రూపురేఖలు మారుస్తా. గత మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడమే.. ప్రజలు నావైపు ఉన్నారని చెప్పడానికి నిదర్శనం" అని జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.




# సిడ్నీ టెస్టులో విజయం.. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆసీస్

**సిడ్నీ:** ఆసీస్ గడ్డపై హ్యాట్రిక్ సిరీస్ సాధించడం అటుంచితే.. కోల్పోకుండా ఉండాలని భావించిన భారత్‌కు ఓటమి తప్పలేదు. సిడ్నీ వేదికగా జరిగిన ఐదో టెస్టును ఆసీస్ గెలుచుకుంది. దాదాపు పదేళ్ల తర్వాత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. సిరీస్‌తోపాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తును ఆసీస్ ఖాయం చేసుకుంది. మరోవైపు సిరీస్‌ను కోల్పోవడమే కాకుండా మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకోవాలనే భారత్ ఆశలు గల్లంతయ్యాయి.
రసవత్తరంగా మారుతుందని భావించిన సిడ్నీ టెస్టులో ఎలాంటి అద్భుతం జరగలేదు. బుమ్రా బౌలింగ్ చేయకపోవడంతో ఆసీస్ ఎదుట ఉంచిన 162 పరుగుల లక్ష్యాన్ని భారత్ కాపాడుకోలేకపోయింది. ఆస్ట్రేలియా కేవలం 27 ఓవర్లలోనే నాలుగు వికెట్లను కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 185 పరుగులు చేయగా.. ఆసీస్ 181 పరుగులకు పరిమితమైంది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 157 పరుగులకు పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా స్కాట్ బోలాండ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా జస్‌ప్రీత్ బుమ్రా అవార్డులు సాధించారు.

**దూకుడే మంత్రం..**
బుమ్రా లేకపోవడంతో భారత బౌలింగ్‌పై ఆసీస్ ఓపెనర్లు ఎదురు దాడికి దిగారు. యువ ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (22) వచ్చీ రావడంతోనే దూకుడు ప్రదర్శించాడు. ప్రధాన పేసర్ సిరాజ్ కూడా ఆరంభంలో లెగ్ సైడ్ బంతులు వేయడంతో ఆసీస్ పని ఇంకా సులువైంది. మొదటి రెండు ఓవర్లలోనే 26 పరుగులను ఆసీస్ ఓపెర్లు రాబట్టారు. అయితే, ప్రసిధ్ కృష్ణ (3/65) స్వల్ప వ్యవధిలో వికెట్లు తీసి ఆసీస్‌పై ఒత్తిడి పెంచాడు. ఉస్మాన్ ఖవాజా (41) హాఫ్ సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. సిరాజ్ (1/69) బౌలింగ్‌లో ఔటయ్యాడు. అయితే, ట్రావిస్ హెడ్ (34*), వెబ్‌స్టర్ (39*) ఐదో వికెట్‌కు అజేయంగా 58 పరుగులు జోడించి ఆసీస్‌ను గెలిపించారు. స్టీవ్ స్మిత్ (4), మార్నస్ లబుషేన్ (6) విఫలమయ్యారు.

**అదే తేడా..**
ఆసీస్‌తో సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ బుమ్రా.. రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌కు రాలేదు. ఇదే భారత్‌ను ఇబ్బందికి గురి చేసింది. సిరాజ్, ప్రసిధ్, నితీశ్‌తో కూడిన పేస్ విభాగం ఆసీస్‌ను అడ్డుకోలేకపోయింది. అదే బుమ్రా ఉండుంటే.. ఆస్ట్రేలియా బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడేందుకు ప్రయత్నించేవారు కాదు. అప్పటికీ త్వరగానే మూడు వికెట్లను పడగొట్టినా.. ఖవాజా, హెడ్, వెబ్‌స్టర్‌ను కట్టడి చేయలేకపోయారు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు బుమ్రా 32 వికెట్లు తీశాడు. ఇప్పుడీ కీలక సమయంలో బుమ్రా సేవలు లేకపోవడంతో సిరీస్‌నుసమం చేసే అవకాశాన్ని భారత్ చేజార్చుకుంది.

# విజయ్ హజారే ట్రోఫీ.. హైదరాబాద్‌కు నాలుగో విజయం

**క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన ఆరు జట్లు**

**అహ్మదాబాద్:** విజయ్ హజారే ట్రోఫీ 2024-25 సీజన్‌లో హైదరాబాద్ నాలుగో విజయం సాధించింది. ఆదివారం అహ్మదాబాద్‌లోని ఎడీఎస్ఎ రైల్వేస్ క్రికెట్ మైదానంలో అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన ఏడో రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తనయ్ త్యాగరాజన్ (5/32), అనికేత్ రెడ్డి (4/14) విజృంభించడంతో తొలుత బ్యాటింగ్ చేసిన అరుణాచల్ ప్రదేశ్ 28.3 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. సిద్ధార్థ్ బలోడి (29) టాప్ స్కోరర్. ధ్రువ్ సోని (20), బికి కుమార్ (15) పరుగులు చేశారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని హైదరాబాద్ 12 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. తన్మయ్ అగర్వాల్ (22), కె నితీశ్ రెడ్డి (15), పి నితీశ్ రెడ్డి (29*), కొడిమెల హిమతేజ (21*) పరుగులు చేశారు.

**ఆంధ్రకు మూడో ఓటమి..**
విజయ్ హజారే ట్రోఫీలో గత ఐదు మ్యాచ్‌ల్లో వరుసగా మూడింటిలో గెలిచి జోరు మీద కనిపించిన ఆంధ్ర.. లీగ్ దశ చివర్లో తడబడింది. గత మ్యాచ్‌లో మహారాష్ట్ర చేతిలో ఓడిన ఆంధ్ర.. ఆదివారం హిమచల్‌ప్రదేశ్‌తో జరిగిన ఏడో రౌండ్ మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. ఓవరాల్‌గా ఆ జట్టుకిది మూడో ఓటమి. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 49.2 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌటైంది. వినయ్ (44) టాప్ స్కోరర్. పృథ్వీ రాజు (37), సందీప్ (27), శ్రీకర్ భరత్ (27) పరుగులు చేశారు. 198 పరుగుల లక్ష్యాన్ని హిమచల్‌ప్రదేశ్ 38.1 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ అంకిత్ కల్సి (100*; 126 బంతుల్లో 12 ఫోర్లు) శతకం బాదాడు. రిషి ధావన్ (45; 42 బంతుల్లో 7 ఫోర్లు) రాణించాడు. దిగ్విజయ్ (26), సుమిత్ వర్మ (26) రన్స్ చేశారు.

**విజయ్ హజారే ట్రోఫీ..**




**క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన జట్లు ఇవే..**
విజయ్ హజారే ట్రోఫీలో ఆదివారం జరిగిన ఏడో రౌండ్ మ్యాచ్‌లతో గ్రూప్ దశ ముగిసింది. లీగ్ స్టేజ్‌లో ఐదు గ్రూప్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేసిన 10 జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించాయి. గుజరాత్, మహారాష్ట్ర, విదర్భ, కర్ణాటక, బరోడా, పంజాబ్ నేరుగా క్వార్టర్ ఫైనల్స్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాయి. హరియాణా, రాజస్థాన్, తమిళనాడు, బెంగాల్ ప్రిక్వార్టర్స్‌కు చేరాయి. ఈ నాలుగు జట్లలో రెండు క్వార్టర్స్‌కు చేరతాయి. గ్రూప్ సిలో ఉన్న హైదరాబాద్, గ్రూప్ బిలో ఉన్న ఆంధ్ర ఏడేసి మ్యాచ్‌లు ఆడి నాలుగింట మాత్రమే విజయం సాధించి లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టాయి. నాకౌట్ మ్యాచ్‌లన్నీ వడోదరలోని కోటంబి స్టేడియం, మోతీబాగ్ క్రికెట్ మైదానంలో జరుగుతాయి. జనవరి 9న ప్రిక్వార్టర్స్.. 11, 12 తేదీల్లో క్వార్టర్ ఫైనల్స్ జరగనున్నాయి.15, 16 తేదీల్లో సెమీ ఫైనల్స్ నిర్వహిస్తారు. ఇదే నెల 18న టైటిల్ పోరు జరగనుంది.

**విజయ్ హజారే ట్రోఫీ 2024-25 నాకౌట్‌కు అర్హత సాధించిన జట్లు..**
1. గుజరాత్ - 28 పాయింట్లు - గ్రూప్ ఎ టాపర్
2. మహారాష్ట్ర - 24 పాయింట్లు (+1.75) - గ్రూప్ బి టాపర్
3. విదర్భ - 24 పాయింట్లు (+1.55) - గ్రూప్ డి టాపర్
4. కర్ణాటక - 24 పాయింట్లు (+1.37) - గ్రూప్ సి టాపర్
5. బరోడా - 20 పాయింట్లు - గ్రూప్ ఈ టాపర్
6. పంజాబ్ - 24 పాయింట్లు (+2.167) - గ్రూప్ సిలో 2వ స్థానం
7. హరియాణా - 24 పాయింట్లు (0.726) - గ్రూప్ ఎలో 2వ స్థానం
8. రాజస్థాన్ - 20 పాయింట్లు - గ్రూప్ బిలో 2వ స్థానం
9. తమిళనాడు - 18 పాయింట్లు - గ్రూప్ డిలో 2వ స్థానం
10. బెంగాల్ - 18 పాయింట్లు - గ్రూప్ ఈలో 2వ స్థానం.



# అతడికి హక్కేలేదు.. బుమ్రాతో కొన్‌స్టాస్ వాదనపై గంభీర్

**సిడ్నీ:** సిడ్నీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో ఆసీస్ యువ ఆటగాడు సామ్ కొన్‌స్టాస్ వాగ్వాదానికి దిగిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బంతికే ఉస్మాన్ ఖావాజాను బుమ్రా ఔట్ చేశాడు. దీంతో భారత ఆటగాళ్ల కొన్‌స్టాస్ వైపు చూస్తూ సంబరాలు చేసుకున్నారు. వీటిపై ఆసీస్ కోచ్ మెక్‌డొనాల్డ్ స్పందిస్తూ.. 'భారత ఆటగాళ్ల సంబరాలు కాస్త భయపెట్టేలా ఉన్నాయి' అని వ్యాఖ్యానించాడు. వాటిపై గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో స్పందించాడు. ''కఠినమైన క్రీడలో సున్నితంగా ఉండలేరు. అలాగని ఎవరూ బెదిరింపులకు దిగరు. ఈ విషయంలో కొన్‌స్టాస్‌కు మాట్లాడే హక్కే లేదు. బుమ్రా, ఉస్మాన్ ఖవాజా సంభాషించుకుంటున్నప్పుడు మధ్యలో అతడు వెళ్లాల్సిన అవసరం లేదు. బ్యాటింగ్ కోసం స్ట్రైకింగ్‌లో ఉన్న ఆటగాడు, అంపైర్, బౌలర్ మాత్రమే మాట్లాడుకొనే అంశం. అది కొన్‌స్టాస్ పని కాదు'' అని గంభీర్ వ్యాఖ్యానించాడు.

**అందరూ దేశవాళీ ఆడితే..**
''జట్టులోని ప్రతి ఒక్కరినీ సమానంగా చూసే బాధ్యత నాదే. కొందరికి ప్రాధాన్యం ఇచ్చి.. మరికొందరిని దూరం చేయడం నాకు ఇష్టం ఉండదు. జట్టులోని ప్రతి ఒక్కరూ దేశవాళీ క్రికెట్ ఆడాలని కోరుకుంటా. వారు అందుబాటులో ఉన్నప్పుడు తప్పకుండా ఆడాలి. సుదీర్ఘ ఫార్మాట్‌లో నిబద్ధతతో ఆడాలనుకుంటే.. దేశావాళీ క్రికెట్‌ను మరిచిపోకూడదు'' అని తెలిపాడు.

# నేను భారతీయుడిని కదా.. అందుకే అవసరం లేదేమో

**సునీల్ గావస్కర్**

**ముంబయి:** బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా 3-1 తేడాతో కైవసం చేసుకుంది. సిడ్నీ టెస్టులో విజయం అనంతరం ట్రోఫీని అలెన్ బోర్డర్ చేతుల మీదుగా ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ స్వీకరించాడు. అయితే, క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్‌ను ఆహ్వానించకుండానే.. బోర్డర్ చేతుల మీదుగా ప్రదానం చేయించడం ఇప్పుడు విమర్శలకు దారితీసింది. ఆసీస్‌కు ట్రోఫీని ఇస్తున్న సమయంలో మైదానంలోనే గావస్కర్ వ్యాఖ్యానం చేస్తూ ఉండటం గమనార్హం. దీనిపై గావస్కర్ కాస్త అసంతృప్తి వ్యక్తం చేశాడు. బోర్డర్‌తో కలిసి ఇచ్చేందుకు సంతోషించేవాడినని.. తనకు ఆహ్వానం లేకపోవడం నిరుత్సాహానికి గురి చేసిందని వ్యాఖ్యానించాడు. ''నేను ఇక్కడే ఉన్నా. ఆస్ట్రేలియా సిరీస్‌ను కైవసం చేసుకుంది. అదేమీ నాకు ఇబ్బందికరం కాదు. వారు బాగా ఆడారు. విజయం సాధించారు. కానీ, ట్రోఫీని బోర్డర్‌తో కలిస నేను కూడా అందిస్తే బాగుండేది. అయితే, నేను కేవలం భారతీయుడినే కాబట్టి పిలవలేదేమో. నా స్నేహితుడు అలెన్ బోర్డర్‌తో కలిసి ప్రెజెంటేషన్ కార్యక్రమంలో ఉండుంటే సంతోషించేవాడిని. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు నిర్వాహకులు వచ్చి ట్రోఫీ అందజేతపై తమ అభిప్రాయం తెలిపారు. ఒకవేళ భారత్ ఈ మ్యాచ్ గెలవకపోయినా.. మ్యాచ్ డ్రా అయినా నేను అవసరం లేదన్నారు. నాకు బాధేం లేదు. కానీ, నేను అయోమయానికి గురయ్యా. ఇది బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ కదా.. మేమిద్దరం కలిసి ఇస్తే బాగుంటుందని అనిపించింది'' అని గావస్కర్ వెల్లడించాడు.

**పదేళ్ల తర్వాత ఆసీస్ వద్దకు ట్రోఫీ..**
ఆస్ట్రేలియా గడ్డపై భారత్ హ్యాట్రిక్ సిరీస్ విజయం సాధించలేపోయింది. అదే సమయంలో పదేళ్ల తర్వాత బోర్డర్ -గావస్కర్ ట్రోఫీని ఆసీస్ సొంతం చేసుకుంది. చివరిసారిగా 2014/15 సీజన్‌లో ఆస్ట్రేలియా గెలుచుకుంది. ఆ తర్వాత వరుసగా నాలుగుసార్లు ట్రోఫీని భారత్ దక్కించుకుంది. ఇప్పుడు మళ్లీ ట్రోఫీ ఆసీస్ వద్దకు చేరుకుంది. 1996/97 సీజన్ నుంచి క్రికెట్ దిగ్గజాలు అలెన్ బోర్డర్, సునీల్ గావస్కర్ పేరిట ట్రోఫీని ఐసీసీ అందజేస్తోంది. యాషెస్ సిరీస్ మాదిరిగానే ఇది అభిమానులను ఆకట్టుకుంది.

# 'సూపర్ స్టార్ సంస్కృతి' వద్దు..

**కోహ్లీపై మాజీ ఆల్‌రౌండర్ తీవ్ర విమర్శలు**

**ముంబయి:** టెస్టుల్లో నిలకడగా రాణించలేకపోతున్న విరాట్ కోహ్లీపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. టీమ్‌ఇండియాకు సూపర్ స్టార్ సంస్కృతి అవసరం లేదని, కోహ్లీని పక్కనపెట్టి అతడి స్థానంలో యువ ఆటగాడిని తుది జట్టులోకి తీసుకోవడానికి సమయం ఆసన్నమైందన్నాడు. విరాట్ దేశవాళీ క్రికెట్ ఎందుకు ఆడట్లేదని ప్రశ్నించాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో ఓటమి అనంతరం ఇర్ఫాన్ పఠాన్ స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ బీజీటీలో కోహ్లీ 9 ఇన్నింగ్స్‌ల్లో 23.75 సగటుతో 190 పరుగులు మాత్రమే చేశాడు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో మాత్రం ఒక సెంచరీ చేశాడు. తర్వాత భారీ స్కోర్లు చేయలేకపోయాడు. ఆఫ్‌స్టంప్ ఆవల పడే బంతులను వేటాడి పెవిలియన్ చేరాడు. ఈ ఆసీస్ పర్యటనలో కోహ్లీ ఏడుసార్లు ఇదే విధంగా ఔట్ కావడం గమనార్హం.'2024లో టెస్టుల్లో మొదటి ఇన్నింగ్స్‌ల్లో కోహ్లీ సగటు కేవలం 15. గత ఐదేళ్లలో అతని గణాంకాలను పరిశీలిస్తే సగటు 30 కూడా లేదు. సీనియర్ ఆటగాడి నుంచి భారత జట్టు ఆశించేది ఇదేనా? కోహ్లీకి బదులుగా ఒక యువ ఆటగాడికి రెగ్యులర్‌గా అవకాశాలు ఇస్తే అతను కూడా సగటున 25-30 పరుగులు చేస్తాడు. ఎందుకంటే మనం ఇక్కడ జట్టు గురించే చర్చిస్తున్నాం. వ్యక్తుల గురించి కాదు. టీమ్‌ఇండియాకు 'సూపర్ స్టార్ సంస్కృతి' అవసరం లేదు. జట్టు సంస్కృతి అవసరం. విరాట్ కోహ్లీ ఖాళీగా ఉన్నప్పుడు చివరగా దేశవాళీ క్రికెట్‌లో ఎప్పుడు ఆడాడో చెప్పండి? అతను డొమెస్టిక్ క్రికెట్ ఆడి దాదాపు దశాబ్దం అయింది. దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ కూడా దేశవాళీ క్రికెట్ ఆడాడు. కొన్నాళ్లకు అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. సచిన్ డొమెస్టిక్ క్రికెట్ ఆడాల్సిన అవసరం లేదు. కానీ అతను కూడా ఆడటానికి వచ్చాడు' అని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు.







# రేపటి నుంచి ఏడు సంస్థల ఐపీఓలు షురూ.. ఆరు సంస్థల లిస్టింగ్..

**ముంబయి:** పలు కంపెనీలు సొంత పెట్టుబడులతో కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. తమ కార్యకలాపాలను విస్తరించడానికి నిధుల సేకరణ కోసం ఇన్షియల్ పబ్లిక్ (ఐపీఓ) ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అవుతుంటాయి. 2024లో ఐపీఓలకు వెళ్లిన కంపెనీలు దాదాపు 11.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సేకరించాయి. అదే ఊపులో ఇన్‌విట్ ప్లాన్‌తోపాటు ఏడు కంపెనీలు రూ.2,400 కోట్ల నిధుల సేకరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి.

**6న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీఓ**
ఇంజినీరింగ్, మెడికల్, కెమికల్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ సంస్థ ఐపీఓ.., ఈ నెల ఆరో తేదీన ప్రారంభం కానున్నది. ఈ నెల మూడో తేదీన యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.123.04కోట్ల నిధులు సేకరించింది. ఈ సంస్థ ఐపీఓ ఈ నెల ఎనిమిదో తేదీన ముగుస్తుంది. ఈ షేర్ విలువ రూ. 133-140 గా ఖరారు చేశారు. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.200.05 కోట్ల విలువ గల 1.42 కోట్ల షేర్లు విక్రయిస్తుంది. రూ.210 కోట్ల విలువ గల కొత్త షేర్లను జారీ చేసింది.

**7-9 మధ్య క్వాడ్రంట్ ఫ్యూచర్ టెక్ ఐపీఓ**
భారతీయ రైల్వేల కవచ్ ప్రాజెక్టు కింద న్యూ జనరేషన్ ట్రైన్ కంట్రోల్, సిగ్నలింగ్ సిస్టమ్స్ అభివృద్ధి చేస్తుందీ క్వాడ్రంట్ ఫ్యూచర్ టెక్. ఈ నెల 7-9 తేదీల మధ్య ఐపీఓకు వెళుతున్న క్వాడ్రాంట్ ఫ్యూచర్ టెక్ రూ.290 కోట్ల నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మొత్తం కొత్త షేర్ల జారీ ద్వారానే నిధులు సేకరిస్తుంది. ఐపీఓ షేర్ బాండ్ ధర రూ.275-290గా ఖరారు చేశారు.

**9న ముగియనున్న క్యాపిటల్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ ఐపీఓ**
గవార్ కన్‌స్ట్రక్షన్ స్పాన్సర్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ క్యాపిటల్ ఇన్‌ఫ్రా ట్రస్ట్ ఈ నెల ఏడో తేదీన ఐపీఓకు వెళుతుంది. ఐపీఓ ద్వారా రూ.1,578 కోట్ల నిధులను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. షేర్ ప్రైస్ బాండ్ రూ.99-100గా నిర్ణయించింది. ఐపీఓలో భాగంగా రూ.1,077 కోట్ల విలువైన వాటాలు జారీ చేస్తుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.501 కోట్ల నిధులు సేకరించాలని నిర్ణయించింది. ఈ సంస్థ ఐపీఓ జనవరి తొమ్మిదో తేదీతో ముగుస్తుంది.

**ఆరో తేదీ నుంచి ఇండోబెల్ ఇన్‌సులేషన్ ఐపీఓ**
ఎస్ఎంఈ సెగ్మెంట్ నుంచి ఐపీఓకు వెళుతున్న తొలి సంస్థ ఇండోబెల్ ఇన్సులేషన్. ఈ నెల ఆరో తేదీన ఐపీఓ ప్రారంభం అవుతుంది. రూ.10.14 కోట్ల నిధుల సేకరణ లక్ష్యంగా ఐపీఓకు వెళుతున్నదీ సంస్థ. ఈ ఐపీఓలో సంస్థ షేర్ విలువ రూ .46గా నిర్ణయించారు. ఈ నెల ఎనిమిదో తేదీన ముగుస్తుంది.

**ఏడో నుంచి బీఆర్ గోయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఐపీఓ**
ఈ నెల ఏడో తేదీ నుంచి బీఆర్ గోయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఐపీఓకు వెళుతుంది. ఈ సంస్థ ఐపీఓ షేర్ ధర రూ.128-135గా ప్రకటించారు. తాజా షేర్ల జారీ ద్వారా రూ.85.21 కోట్ల నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది బీఆర్ గోయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్. ఈ నెల తొమ్మిదో తేదీన ఐపీఓ బిడ్డింగ్ ముగుస్తుంది.

**7న డెల్టా ఆటో కార్ప్ ఐపీఓ**
ఎలక్ట్రిక్ టూ వీలర్స్, త్రీ వీలర్స్ తయారీ సంస్థ డెల్టా ఆటో కార్పొరేషన్ ఐపీఓ ఈ నెల ఏడో తేదీన ప్రారంభం అవుతుంది. ఈ ఐపీఓ ద్వారా రూ.54.6 కోట్ల నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఐపీఓ షేర్ విలువ రూ. 123-130గా నిర్ణయించారు. ఈ నెల తొమ్మిదో తేదీన ఐపీఓ ముగుస్తుంది. తాజా 50.54 కోట్ల విలువ గల 38.88 లక్షల షేర్లను జారీ చేస్తారు. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.4.06 కోట్ల విలువ గల 3.12 లక్షల షేర్లు విక్రయిస్తారు.

**7-9 మధ్య అవాక్స్ అపారెల్స్ అండ్ ఆర్నమెంట్స్ ఐపీఓ**
వచ్చేవారం ప్రారంభమయ్యే ఐపీఓల్లో అతి చిన్నదీ అవాక్స్ అపారెల్స్ అండ్ ఆర్నమెంట్స్. సిల్వర్ ఆర్నమెంట్స్, నిట్టెడ్ ఫ్యాబ్రిక్ హోల్ సేలర్ అవాక్స్. ఐపీఓ ద్వారా రూ.1.92 కోట్ల నిధులు సేకరించాలని అవాక్స్ అపారెల్స్ అండ్ ఆర్నమెంట్స్ లక్ష్యంగా పెట్టుకుంది. షేర్ విలువ రూ.70గా నిర్ణయించారు. ఈ నెల ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకూ ఐపీఓ కొనసాగుతుంది.

**వచ్చే వారం ముగిసే ఐపీఓలివే..**
జనవరి ఆరో తేదీన పరమేశ్వర్ మెటల్, డావిన్ సన్స్ రిటైల్ ఐపీఓలు ముగుస్తాయి. పరమేశ్వర్ మెటల్ 41.96 రెట్లు, డావిన్ సన్స్ రిటైల్ 11.95 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. ఫ్యాబ్ టెక్ టెక్నాలజీస్ క్లీన్ రూమ్స్ ఐపీఓ కూడా ఈ నెల ఏడో తేదీ ముగుస్తుంది. తొలి రోజు ఫ్యాబ్ టెక్ టెక్నాలజీస్ క్లీన్ రూమ్స్ ఐపీఓలో సంస్థ షేర్ 18.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది.

**వచ్చే వారం లిస్టింగ్స్ ఇవే..**
ఈ నెల ఏడో తేదీన ఇండో ఫామ్ ఎక్విప్‌మెంట్ సంస్థ దేశీయ స్టాక్ మార్కెట్లలో లిస్టవుతుంది. ఈ సంస్థ ఐపీఓలో ఆశించిన దాని కంటే 229.68 రెట్లు సబ్‌స్క్రిప్షన్లు దాఖలయ్యాయి. ట్రాక్టర్లు, పిక్ అండ్ క్యారీ క్రేన్ల తయారీ సంస్థ గ్రే మార్కెట్‌లో 45 శాతం ప్రీమియం ఆకర్షించిందని పరిశీలకులు చెబుతున్నారు. ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో ఐపీఓలకు వెళ్లిన ఐదు సంస్థలు వచ్చే వారం స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అవుతాయి. ఈ నెల ఏడో తేదీన టెక్నికెమ్ ఆర్గానిక్, ఎనిమిదో తేదీన లియో డ్రై ఫ్రూట్స్ అండ్ స్పైస్, తొమ్మిదో తేదీన పరమేశ్వర్ మెటల్ అండ్ డావిన్ సన్స్ రిటైల్, పదో తేదీన ఫ్యాబ్ టెక్ టెక్నాలజీస్ క్లీన్ రూమ్స్ లిస్టవుతాయి.

# గతవారం ట్రేడింగ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు భారీ నష్టం

**టాప్ -10లో నాలుగు సంస్థల ఎం-క్యాప్ రూ.19,605 కోట్లు వృద్ధి**

**ముంబయి:** గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ-30 లిస్టెడ్ కంపెనీల్లోని టాప్ 10 కంపెనీల్లో నాలుగు కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.96,605.66 కోట్లు కోల్పోయాయి. వాటిల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) భారీగా నష్టపోయాయి. మరోవైపు, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, ఐటీసీ, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ), హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) లాభ పడ్డాయి. టాప్-10 సంస్థల్లో మిగతా ఆరు సంస్థలు తమ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.82,861.16 కోట్లకు పెంచుకున్నాయి.
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 37,025.46 కోట్లు పతనమై రూ.13,37,919.84 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.29,324.55 కోట్ల నష్టంతో రూ. 8,93,378.50 కోట్ల వద్ద స్థిర పడింది. టీసీఎస్ ఎం-క్యాప్ రూ.24,856.26 కోట్లు కోల్పోయి రూ.14,83,144.53 కోట్లకు పరిమితమైంది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ. 5,399.39 కోట్ల పతనంతో రూ.7,08,168.60 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, రిలయన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.41,138.41 కోట్ల వృద్ధితో రూ.16,93,373.48 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎం-క్యాప్ రూ.15,331.08 కోట్లు పెరిగి రూ.5,65,194.18 కోట్లకు చేరుకుంది. ఎల్ఐసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 13,282.49 కోట్లు పెరిగి రూ.5,74,689.29 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.9,031.19 కోట్లు వృద్ధి చెంది 8,04,834.34 కోట్ల వద్ద ముగిసింది. ఐటీసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,878.63 కోట్లు పెరిగి రూ.6,03,064.44 కోట్ల వద్ద నిలిచింది. భారతీ ఎయి టెల్ ఎం-క్యాప్ రూ.199.36 పెరిగి రూ.9,10,934.58 కోట్లకు సరిపెట్టుకుంది. గత వారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్ టెన్ సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతీ స్థానాల్లో టీసీశ్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీ బ్యాంకు, హిందూస్థాన్ యూనీ లివర్ నిలిచాయి.





## పవర్‌ఫుల్‌గా 'డాకు మహారాజ్' ట్రైలర్

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త చిత్రం 'డాకు మహారాజ్'. ఈ చిత్రానికి బాబీ దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. బాబీ దేవోల్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జనవరి 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలోనే తాజాగా 'డాకు మహారాజ్' ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ''అనగనగా ఒక రాజు ఉండేవాడు. చెడ్డవాళ్లంతా ఆయన్ని డాకు అనేవాళ్లు. మాకు మాత్రం మహారాజు'' అనే డైలాగ్స్‌తో ట్రైలర్ మొదలైంది. బాలయ్య నటన, యాక్షన్ సన్నివేశాల్లో ఆయన ప్రదర్శన, సంభాషణలు ఆకట్టుకునేలా ఉన్నాయి. బాలకృష్ణను ఉద్దేశించి.. ''ఇక్కడ కింగ్ ఆఫ్ జంగిల్'' అంటూ చిన్నారి చెప్పే డైలాగ్స్ పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ బాగుంది.

## క్లీంకార ఫొటో ఆరోజు రివీల్ చేస్తా: రామ్‌చరణ్



**హైదరాబాద్:** రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా రామ్‌చరణ్, దిల్‌రాజు ఇటీవల బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోన్న 'అన్‌స్టాపబుల్' కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ప్రోమో తాజాగా విడుదలైంది. ఇందులో రామ్‌చరణ్ తన వ్యక్తిగత విషయాలు పంచుకున్నారు. కుమార్తె గురించి మాట్లాడుతూ ఆయన ఎమోషనల్ అయ్యారు. ''మా పాప నాన్న అని పిలిచిన రోజు తప్పకుండా ఫొటో రివీల్ చేస్తాను'' అని అన్నారు. సురేఖ, అంజనా దేవి పంపిన వీడియో సందేశాన్ని ఇదే కార్యక్రమంలో ప్లే చేశారు. 2025లో తమకు వారసుడు కావాలని వారు కోరారు. పార్టీ చేసుకోవడానికి తన మామయ్య అల్లు అరవింద్ సరైన వ్యక్తి అని చరణ్ నవ్వుతూ బదులిచ్చారు. ఇందులోనే ప్రభాస్‌కు ఫోన్ కాల్ చేశారు.

## చిక్కడపల్లి పీఎస్‌కు వచ్చిన అల్లు అర్జున్



**విశ్వంభర, హైదరాబాద్:** సినీనటుడు అల్లు అర్జున్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు విచారణ నేపథ్యంలో ప్రతి ఆదివారం పీఎస్ ముందు హాజరుకావాలని నాంపల్లి కోర్టు ఆయన్ను ఆదేశించిన విషయం తెలిసిందే. బెయిల్ షరతుల దృష్ట్యా అల్లు అర్జున్ చిక్కడపల్లి పీఎస్‌కు వచ్చి సంతకం చేశారు. 10 నిమిషాల తర్వాత అక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. ఇప్పటికే అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.



## జనతాగ్యారేజ్ నటుడి బాక్సాఫీస్ ఊచకోత..

### ఉన్నిముకుందన్ మార్కో అరుదైన ఫీట్



జనతాగ్యారేజ్, ఖిలాడీ, యశోద సినిమాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ . ఈ టాలెంటెడ్ యాక్టర్ ఇటీవలే మార్కోసినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. హనీఫ్ అదేని దర్శకత్వం వహించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామి సృష్టిస్తోంది. తొలి ఏ రేటెడ్ మలయాళం మూవీగా ప్రేక్షకుల ముందుకొచ్చిన మార్కో రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయింది.యాక్షన్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో విడుదలై మిక్స్‌డ్ రెస్పాన్స్ రాబట్టుకుంటోంది. ఇషాన్ శౌలత్, అభిమన్యు ఎస్ థిలకన్, యుక్తి తరేజా, కబీర్ దుహన్ సింగ్, సిద్దిఖీ కీలక పాత్రల్లో నటించారు. రవి బస్రూర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. షరీఫ్ అహ్మద్ తెరకెక్కించారు. మరి ఈ చిత్రం రాబోయే రోజుల్లో ఎలాంటి ట్రెండ్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

## సినిమాల్లోకి అకీరా.. రేణూ దేశాయ్ ఆసక్తికర కామెంట్

తన తనయుడు అకీరా నందన్ సినిమాల్లోకి రావడంపై నటి రేణూ దేశాయ్ తాజాగా స్పందించారు. రాజమహేంద్రవరం వేదికగా జరిగిన ఓ ప్రెస్‌మీట్‌లో ఆమె ఈ విషయంపై మాట్లాడారు. తన తనయుడి ఎంట్రీ కోసం తాను కూడా ఆశగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. ''నేను ఎక్కడికి వెళ్లినా నాకు ఎదురయ్యే ప్రశ్న అకీరా ఎంట్రీ గురించే. అందరి కంటే ఎక్కువగా ఒక తల్లిగా నేను ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నా. కాకపోతే అది పూర్తిగా అతడి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. తను ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు వస్తాడు'' అని తెలిపారు.సెకండ్ ఇన్నింగ్స్ ఎప్పుడు? అని విలేకరి ప్రశ్నించగా.. ''నేను ఎన్నిసార్లు సెకండ్ ఇన్నింగ్స్ ఇవ్వాలి (నవ్వులు). ఇప్పటికే నాలుగైదుసార్లు సెకండ్ ఇన్నింగ్స్ అయిపోయింది. సినిమాల నుంచి చాలాకాలం బ్రేక్ తీసుకున్న తర్వాత 2017లో టీవీలో ఒక డ్యాన్స్ షోకు న్యాయ నిర్ణేతగా చేశా. ఆ తర్వాత టీవీ ఇండస్ట్రీలోనే కొన్ని వర్క్స్ చేశా. రెండేళ్ల క్రితం రవితేజతో ఒక సినిమా చేశా. మధ్యలో డైరెక్షన్ చేశా. ప్రస్తుతం నా చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి.కాబట్టి నా వర్క్ అలా కొనసాగుతూనే ఉంది'' అని ఆమె నవ్వుతూ బదులిచ్చారు. రాజమహేంద్రవరం గురించి మాట్లాడుతూ.. ''గోదావరి జిల్లాల్లో ఉన్నంత అద్భుతమైన లొకేషన్లు నేను ఎక్కడా చూడలేదు. విజయవాడ రాజమహేంద్రవరం మధ్య పచ్చని పొలాలు చూసి నా మనసు ఆనందంతో నిండిపోయింది. ఇదొక స్వర్గం. ఈ ప్రాంతంలో ఉండటం ఒక వరం'' అని అన్నారు. సినిమా షూటింగ్స్ ఈ ప్రాంతాల్లో జరగాలనే ప్రభుత్వ పెద్దల నిర్ణయానికి ఆమె మద్దతు తెలిపారు. దాదాపు 22 ఏళ్ల తర్వాత ఒక యాడ్ కోసం వర్క్ చేశానని అన్నారు. అందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. యాడ్స్‌లో భాగం కావడాన్ని తాను ఎంతగానో ఇష్టపడుతుంటానని చెప్పారు. సినిమాల్లోకి రావాలని తాను ఎప్పుడూ అనుకోలేదని ఇదంతా విధి రాత అని ఆమె చెప్పారు. అకీరా ఎంట్రీ గురించి రేణూ దేశాయ్ స్పందించడం కొత్తేమీ కాదు. గతంలోనూ ఆమె ఇదే విషయాన్ని చెప్పారు. మరోవైపు, ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాలనే ఉద్దేశంతో అకీరా ఇప్పటికే న్యూయార్క్‌లోని ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుంటున్న విషయం తెలిసిందే. పియానో కూడా నేర్చుకున్నాడు.

## 'యానిమల్'.. అంగీకరించడానికి అదే కారణం



**రణ్‌బీర్ కపూర్ , రష్మిక జంటగా నటించిన చిత్రం 'యానిమల్' . ఇందులో జోయా పాత్రలో కనిపించి యువ హృదయాలను కొల్లగొట్టిన నటి త్రిప్తి డిమ్రి.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి మాట్లాడారు. ఆరంభంలో అవకాశాల్లేక కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. తనకు బిగ్గెస్ట్ సక్సెస్ అందించిన 'యానిమల్'లో భాగం కావడంపై ఆమె మాట్లాడారు. ''యానిమల్'ను స్త్రీ ద్వేష చిత్రంగా నేనెప్పుడూ చూడలేదు. సినిమాలకు అలాంటి ట్యాగ్స్ ఇవ్వను. 'కోలా', 'బుల్బుల్' చిత్రాలు చేస్తున్నప్పుడు వాటిని స్త్రీవాద చిత్రాలుగా భావించలేదు. ఆయా కథల్లోని పాత్రకు కనెక్ట్ అయి.. దర్శకులపై నమ్మకం ఉంచి వాటిని ఎంచుకుంటా. ఈ సినిమాలో ఆఫర్ రాగానే దర్శకుడు సందీప్‌ను కలిశా. ఆయన నాకు కథ గురించి ఎక్కువగా చెప్పలేదు. జోయా పాత్ర గురించే వివరించారు.అప్పటివరకూ నేను కేవలం సున్నితమైన, పాజిటివ్ రోల్స్ మాత్రమే పోషించా. 'యానిమల్'లో నా పాత్ర ఇందుకు భిన్నమైంది. మనసులో మోసం చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ.. దయ, సానుభూతి కనిపించాలని దర్శకుడు చెప్పారు. అది నాకు సవాలుగా అనిపించింది. వెంటనే సినిమాకు ఓకే చెప్పాను'' అని త్రిప్తి డిమ్రి తెలిపారు.గతేడాది వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు త్రిప్తి డిమ్రి. విక్కీ కౌశల్‌తో ఆమె నటించిన 'బ్యాడ్‌న్యూస్' మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో'లో రాజ్‌కుమార్ రావుకు ఆమె జోడీగా కనిపించారు. ప్రస్తుతం 'ధడక్ 2'లో యాక్ట్ చేస్తున్నారు.**




## 'పుష్ప 2 ది రూల్'.. అల్లు అర్జున్ మూవీ సరికొత్త రికార్డు

విశ్వంభర, హైదరాబాద్: అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప 2 ది రూల్' బాక్సాఫీస్ వద్ద వరుస రికార్డులు సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఖాతాలో మరో సరికొత్త రికార్డు వచ్చి చేరింది. రూ.806 కోట్లు (నెట్) వసూలు చేసి హిందీ బాక్సాఫీస్ వద్ద నెం:1 చిత్రంగా ఇది నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర నిర్మాణ సంస్థ తాజాగా స్పెషల్ ప్రోమో విడుదల చేసింది. దీనిపై ఆనందం వ్యక్తం చేసింది. అల్లు అర్జున్ అభిమానులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కించిన చిత్రమే 'పుష్ప 2 ది రూల్'. రష్మిక కథానాయిక. డిసెంబర్ 5న విడుదలైంది. ప్రస్తుతం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా హవా కొనసాగుతోంది. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్ నాలుగు వారాల్లో రికార్డు వసూళ్లు సాధించినట్లు చిత్ర బృందం తెలిపింది. రూ.1799 కోట్లకు (గ్రాస్) పైగా వసూళ్లను రాబట్టిందని ఇటీవల టీమ్ ప్రకటించింది. టికెట్ల విక్రయంలోనూ 'పుష్ప2' సరికొత్త రికార్డు సృష్టించింది. బుక్‌మై షోలో 19.5మిలియన్ టికెట్లు విక్రయమయ్యాయి. ఇప్పటివరకూ 'బాహుబలి2' పేరిట ఉన్న రికార్డును 'పుష్ప2' బద్దలు కొట్టిన విషయం తెలిసిందే.

## 'గేమ్ ఛేంజర్'.. ఆ పాట చూస్తే చాలు టికెట్ డబ్బులు వచ్చేసినట్లే



అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో దర్శకుడిగా ఎంత క్రేజ్ సొంతం చేసుకున్నారో ప్రస్తుతం నటుడిగా అంతకుమించి గుర్తింపు పొందారు ఎస్.జె. సూర్య . 'సరిపోదా శనివారం'లో సీఐ దయానంద్‌గా మెప్పించిన సూర్య 'గేమ్ ఛేంజర్' లో మోపిదేవిగా కనిపించనున్నారు. రామ్ చరణ్ హీరోగా శంకర్ తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో ముచ్చటించారు. ఆ విశేషాలివీ..

**ముందు గేమ్ ఛేంజరే కానీ..**

''నేను నటుడిగా మారిన తర్వాత.. అందరిలాగే నాకూ శంకర్ దర్శకత్వంలో నటించాలనే కోరిక ఉండేది. ఓ స్థాయికి చేరుకుంటేనే ఆయన చిత్రాల్లో నటించేందుకు సాధ్యమవుతుంది (నవ్వుతూ). అలా తొలుత 'గేమ్ ఛేంజర్' అవకాశం దక్కింది. అందులోని నా పెర్ఫామెన్స్ నచ్చి, 'భారతీయుడు 2'లోనూ ఛాన్స్ ఇచ్చారు. ఈ చిత్రం ముందుగా విడుదలైంది. అవినీతి నాయకుడికీ మంచి కలెక్టర్‌కూ మధ్య ఘర్షణే క్లుప్తంగా 'గేమ్ ఛేంజర్' కథాంశం. నా మేనరిజం కొత్తగా ఉంటుంది. ఒక్క పాత్రేగానీ నాలుగు విభిన్న లుక్స్‌లో కనిపిస్తా''

**పవన్ మాటతో చెప్పలేని ఆనందం..**

''నేను దర్శకుడినే అయినా నటన విషయంలో జీరో నుంచి ప్రయాణం మొదలుపెట్టా. నటుడిగా నాకెన్ని మార్కులు వస్తాయో మీరే చెప్పాలి. 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నా గురించి మాట్లాడుతుంటే (మంచి దర్శకుడు.. మళ్లీ డైరెక్షన్ చేయాలంటూ) రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఆ ఆనందం గురించి చెప్పాలంటే మాటలు రావడంలేదు. 'ఖుషి' సమయంలో ఆయన ఏ ఐడియాలజీతో ఉండేవారో ఇప్పుడూ అలాగే ఉన్నారు''

**'స్పైడర్'తో అర్థమైంది..**

''ఏదైనా మంచి పాత్ర పోషిస్తే దాన్ని ఎంతగా ఆదరిస్తారో 'స్పైడర్'లోని రోల్‌తో అర్థమైంది. అందులోని నా ఎక్స్‌ప్రెషన్‌ను మీమ్స్‌లో చూసి ఆనందిస్తా. శంకర్ సలహా మేరకు 'గేమ్ ఛేంజర్'లో నటించా. ఆయన విజన్ ఉన్న డైరెక్టర్. రామ్ చరణ్ అద్భుతమైన నటుడు. ఐఏఎస్‌గా హుందాగా కనిపిస్తారు. ఆయన పోషించిన మరో పాత్ర 'అప్పన్న' జీవితాంతం గుర్తుండేలా ఉంటుంది.

**పాటకే రూ.కోట్లు!**

దిల్ రాజు సెట్స్‌కు వచ్చి అన్ని క్రాఫ్టులను పరిశీలిస్తారు. ఏమైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తారు. కథల ఎంపికలో ఆయనకు పట్టుంది. ముక్కుసూటిగా మాట్లాడతారు. ఈ సినిమా బడ్జెట్ విషయంలో రాజీ పడలేదు. 'జరగండి' పాట చిత్రీకరణకే రూ.కోట్లు ఖర్చుపెట్టారు. వెండితెరపై ఆ సాంగ్ అద్భుతంగా ఉంటుంది. ఆ ఒక్క గీతానికే టికెట్ డబ్బులు సరిపోతాయనిపిస్తుంది''

**'ఖుషి' సీక్వెల్?**

''ప్రస్తుతానికి నటన సౌకర్యవంతంగా ఉంది. దర్శకత్వం గురించి ఆలోచనలు లేవు. 'గేమ్ ఛేంజర్' ఈవెంట్‌కు వెళ్లే సమయంలో పవన్ కల్యాణ్ తనయుడు అకీరా నందన్‌ను చూశా. లుక్ బాగుంది. తండ్రిలాగే పుస్తకాలు చదువుతున్నాడు. ఒకవేళ అన్నీ కుదిరితే అతడితో 'ఖుషి 2' చేస్తానేమో. కాలమే సమాధానం'' అని పేర్కొన్నారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com